www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఉగాది శుభాకాంక్షలు

ఆదివారం | 30-3-2025 | పేజీలు: 16 + ఉగాది పంచాంగం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 344 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం తిథి: పాడ్యమి మ.12.50 తదుపరి విదియ, నక్షత్రం: రేవతి సా.4.35 తదుపరి అశ్విని, వర్జ్యం: తె. ఉ. 7.25, అమృతఘడియలు: మ.2.28-3.52, దుర్ముహూర్తం: సా.4.47-5.35, రాహుకాలం: సా. 4.30-6.00, సూర్యోదయం: 6.14, సూర్యాస్తమయం: 6.24 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్..

17 మంది నక్సల్స్ మృతి

- సుక్మా జిల్లాలోని అడవుల్లో ఘటన
- మృతుల్లో 11 మంది మహిళలు
- గాయపడ్డ నలుగురు డీఆర్‌జీ జవాన్లు
- మావోయిస్టులు లొంగిపోవాలి: అమిత్ షా
- 15 మంది మావోయిస్టుల లొంగుబాటు

13

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం

సంక్షేమానికి మారుపేరు టీడీపీ



- రాజకీయ కక్షలకు నేను దూరం
- తప్పు చేసిన వారి తాట తీస్తా
- టీడీపీ ప్రాంతీయ పార్టీ కాదు
- జాతీయభావాలున్న దేశభక్తి పార్టీ
- పార్టీకి వారసులం.. పెత్తందారులం కాదు
- కార్యకర్తల త్యాగం గుర్తుపెట్టుకుంటా
- రాష్ట్రంలో సంపద పెంపుపై దృష్టి పెట్టాం
- టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవంలో చంద్రబాబు వ్యాఖ్యలు

15

స్వచ్ఛందంగా వెళ్లిపోండి!

- క్యాంపస్ ఆందోళనల్లో పాల్గొన్న వందలాది మంది అంతర్జాతీయ విద్యార్థులకు అమెరికా ఈ-మెయిల్స్

13

భారతీయులపై మరో పిడుగు!

- గ్రీన్‌కార్డు దరఖాస్తుల ప్రాసెసింగ్ నిలిపివేత

13

మయన్మార్‌లో హాహాకారాలు

- 1,664కు చేరిన భూకంప మృతుల సంఖ్య
- 'రెబల్స్' ప్రాంతాల్లో కానరాని సహాయక చర్యలు
- ఆ ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుంటే మరణాలు 10 వేలు దాటి ఉంటాయన్న యూఎస్‌జీఎస్

13

వైసీపీ నేతల నుంచి ప్రాణహాని

16

- హత్య సినిమా ఎవరు తీశారో.. తీయించారో
- నలుగురి పేర్లే ఈ సినిమాలో పేర్కొన్నారు
- మిగిలిన నలుగురి పేర్లు ఎందుకు పెట్టలేదు?
- అవినాశ్, భాస్కర్‌రెడ్డి, ఉదయ్, శంకర్‌రెడ్డి లేరా?
- వివేకా కేసులో ఏ-2 సునీల్ యాదవ్ వ్యాఖ్యలు

అమరావతికి హైదరాబాద్ మార్గంలో
గ్రాండ్ ఎంట్రన్స్‌వే!

- మూలపాడు నుంచి కృష్ణానది మీదుగా ఐకానిక్ బ్రిడ్జి
- మారిన అలైన్‌మెంట్.. గతంలో ఇబ్రహీంపట్నం దగ్గర భూమిపూజ
- ఐకానిక్ బ్రిడ్జి డీపీఆర్‌కు కన్సల్టెంట్ కోసం టెండర్లు

విజయవాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి విజయవాడ-హైదరాబాద్ మార్గంలో గ్రాండ్ ఎంట్రన్స్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మూలపాడు నుంచి అమరావతి రాజధానికి గ్రాండ్ ఎంట్రన్స్‌వే తో పాటు కృష్ణానది మీదుగా ఐకానిక్ బ్రిడ్జి అలైన్‌మెంట్‌ను మార్చింది. ఇంతకు ముందు ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం దగ్గర ఐకానిక్ బ్రిడ్జికి భూమి పూజ చేశారు. ఎన్‌హెచ్ - 65, ఎన్‌హెచ్ - 30 లకు అనుసంధానంగా దీనిని ప్రతిపాదించారు. అప్పట్లో 2016 లో ఐకానిక్ బ్రిడ్జికి ప్రతిపాదించినపుడు విజయవాడ వెస్ట్ బైపాస్ లేదు. తర్వాతి క్రమంలో గొల్లపూడి నుంచి సూరాయపాలెం మీదుగా కృష్ణానది మీద 3 కిలోమీటర్ల పొడవున విజయవాడ వెస్ట్ బైపాస్ నిర్మాణం జరిగింది. అమరావతి రాజధానిలో వెంకటపాలెం మీదుగా కాజా వరకు ఇది సాగుతుంది. గొల్లపూడి, ఇబ్రహీంపట్నం ప్రాంతాలు దగ్గర దగ్గరగా ఉండటంతో ఐకానిక్ బ్రిడ్జి ఇక్కడ ఏర్పాటు చేయటం సముచితం కాదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) అధికారులు సరికొత్త అలైన్‌మెంట్‌పై కసరత్తులు చేశారు. ఇబ్రహీంపట్నం దాటిన తర్వాత మూలపాడు దగ్గర నుంచి ఎన్‌హెచ్ - 65 ను అనుసంధానిస్తూ గ్రాండ్ ఎంట్రన్స్ వే ఏర్పాటు చేయాలని భావించారు. ఈ గ్రాండ్ ఎంట్రన్స్‌వే నుంచి ఐకానిక్ బ్రిడ్జిని కృష్ణానదిపై నిర్మించాలని నిర్ణయించారు. మూలపాడు నుంచి కృష్ణానది మీదుగా రాయపూడి వరకు 5.2 కిలోమీటర్ల మేర ఈ గ్రాండ్ మార్గాన్ని అభివృద్ధి చేయాలని నిశ్చయించారు. ఎందుకంటే అమరావతి రాజధానిలో శాఖమూరు నుంచి రాయపూడి వరకు ఎన్ - 13 రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ గ్రాండ్ ఎంట్రన్స్ మార్గాన్ని రాయపూడి దగ్గర ఎన్ - 13 రోడ్డుకు అనుసంధానం చేయటం ద్వారా రాజధానిలోని అన్ని ప్రాంతాలకూ అనుసంధానమవుతుంది. అమరావతి గ్రాండ్ ఎంట్రన్స్ మార్గంలో భాగంగా కృష్ణానదిపై 4 కిలోమీటర్ల మేర ఐకానిక్ బ్రిడ్జి పొడవు ఉంటుందని తెలుస్తోంది. శనివారం అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) అధికారులు ఐకానిక్ బ్రిడ్జి కి సంబంధించి డీపీఆర్ తయారు చేసేందుకు కన్సల్టెంట్‌కు టెండర్లు పిలిచారు. మూలపాడు దగ్గర ఎన్‌హెచ్ - 65కు అనుసంధానం చేయటం ద్వారా హైదరాబాద్ రూట్‌లో ఈ మార్గం గేట్‌వేగా మారే అవకాశముంది.

నేడు వెలగపూడికి సీఎం చంద్రబాబు



గుంటూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాజధానిలోని వెలగపూడి గ్రామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించే పీ4 కార్యక్రమం ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి సాయంత్రం 5 గంటలకు వెలగపూడిలోని వేదిక వద్దకు హెలికాప్టర్‌లో చేరుకొంటారు. సాయంత్రం 5.05 గంటల నుంచి రాత్రి 7.45 గంటల వరకు జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి 8 గంటలకు ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకొంటారు.

తెలుగు లోగిళ్లు సిరిసంపదలతో పచ్చగా ఉండాలి

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉగాది శుభాకాంక్షలు

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పండుగలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, కళలు, జాతిని సజీవంగా నిలుపుతాయని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. శనివారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'మన ముంగిళ్లకు వచ్చిన ఉగాది తెలుగువారి వారసత్వపు పండుగ. శ్రీ విశ్వావసు అనే గంధర్వుడు పేరుతో వచ్చిన ఈ ఉగాది పండుగ తరుణాన తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. గత ప్రభుత్వ పాలన కష్టాలమయమైపోగా, ప్రజలకు సుఖాలను అందించే మంచి పాలన ఇప్పుడు ఏపీలో ప్రజల ముంగిటకు వచ్చింది. చైత్ర మాసపు శోభతో వసంతాన్ని మోసుకువచ్చిన శ్రీ విశ్వావసు నామ ఉగాది నాడు తెలుగు లోగిళ్లు సిరిసంపదలతో పచ్చగా ఉండాలని మనఃస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా' అని పవన్ కల్యాణ్ అన్నారు.

అదిగదిగో అమరావతి!
చకచకా సర్కారు బంగళాలు!

- కొలిక్కి వస్తున్న ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల నివాస భవనాలు
- పూర్తయినవాటిలో ఇంటీరియర్, ఎలక్ట్రిఫికేషన్ ప్రారంభం
- బ్యాలెన్స్ పనులకు వీలుగా చదును, నిర్మాణ పనులకు సిద్ధం
- భారీ సంఖ్యలో పొక్లెయిన్లతో పిచ్చి మొక్కల తొలగింపు
- త్వరలో బేస్‌మెంట్ నిర్మాణాల్లో పురోగతి


సీలింగ్, ఎలక్ట్రికల్ పనులు


అమరావతిలో ప్రభుత్వ అధికారుల నివాస గృహాలివి. చంద్రబాబు హయాంలో మొదలుపెట్టిన ఈ నిర్మాణాలు జగన్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు పాడు పెట్టారు. ఇప్పుడు జంగిల్ క్లియరెన్స్ చేపట్టడంతో నిర్మాణాలు ఇలా బయటపడ్డాయి.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

అమరావతి రాజధానిలో ప్రభుత్వ ఉన్నతాధికారుల నివాసాలు ఒక రూపు దిద్దుకుంటున్నాయి. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల బంగళా పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాయపూడిలో ఒక్కొక్కటి 5,90,761 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్-1 విధానంలో మొత్తం 115 ప్రిన్సిపల్ సెక్రటరీ, సెక్రటరీల బంగళాల పునర్నిర్మాణ పనులు కొద్దిరోజులుగా ఊపందుకున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ పనులు చేపట్టినా వైసీపీ ప్రభుత్వ పాలనలో వివిధ స్థాయిల్లో ఆగిపోయాయి. ఇటీవలే సీఆర్‌డీఏ అధికారులు ఈ పనుల పునర్నిర్మాణానికి వీలుగా రూ.411.39 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలవగా, కేఎంవీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ (కేఎంవీపీఎల్) సంస్థ అతి తక్కువకు కోట్ చేసి ఎల్-1 గా నిలిచి కాంట్రాక్టు దక్కించుకుంది. దీంతో రెండేళ్లలో ఈ భవనాల పనులు పూర్తి చేయాల్సిందిగా సీఆర్‌డీఏ నిర్దేశిస్తూ లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ (ఎల్‌ఓఏ) అందించింది. ఈ క్రమంలో కేఎంవీ సంస్థ క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగింది. అంతకు ముందు బంగళాలను కప్పేసిన కంపను చాలా వరకు సీఆర్‌డీఏ అధికారులు తొలగించినా.. ఆ తర్వాత మళ్లీ కంప, పొదలు పెరిగిపోయాయి. కాంట్రాక్టు సంస్థ భారీ ఎత్తున పొక్లెయిన్లను సిద్ధం చేసి ఆయా బంగళాలను చుట్టేసిన పిచ్చి మొక్కలన్నింటినీ తొలగించింది. బ్యాలెన్సు పనులను ప్రారంభించడానికి వీలుగా చక్కగా చదును చేసింది. ప్రస్తుతం స్ట్రక్చర్ పూర్తయిన బంగళాలపై దృష్టి సారించింది. వీటిలో ఇంటీరియర్, ఫ్లోరింగ్, సీలింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, పెయింటింగ్ వంటి పనులు చకచకా చేసుకుంటూ వస్తోంది. ఈ పనులు పూర్తి కాగానే ఫ్లోరింగ్ పనులు చేపడతారు. బిలో బేస్‌మెంట్, బేస్‌మెంట్ దశల్లో ఉన్న వాటికి సంబంధించి స్ట్రక్చర్ పనులు చేపడతారు. ప్రభుత్వం నిర్దేశించిన టెండర్ల ప్రకారం పైల్ ఫౌండేషన్, ఆర్‌సీ కాలమ్స్ - బీమ్స్‌తో కూడిన సూపర్ స్ట్రక్చర్, ఇంటర్నల్ ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఐటీ, హోమ్ ఆటోమేషన్ తదితర పనులను చేపడతారు. అనంతరం పెయింటింగ్ వేసిన తర్వాత వాటర్ సప్లై, వీధి దీపాలు, రోడ్లు వంటి పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తారు.

ఉగాది వేళ 'కళో'దయం!

కళారత్న, ఉగాది పురస్కారాల ప్రకటన.. ఆరేళ్ల తర్వాత తిరిగి ప్రకటించిన ప్రభుత్వం

- 86 మందికి కళారత్న, 116 మందికి ఉగాది అవార్డులు
- సాహిత్య రంగంలో కృత్తివెంటికి, నృత్య విభాగంలో త్రివిక్రమ్ సతీమణి సాయిసౌజన్యకు పురస్కారాలు..
- జర్నలిజంలో తొమ్మిది మందికి గౌరవం
- నేడు సీఎం చేతుల మీదుగా ప్రదానం

అమరావతి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు కళారత్న (హంస), ఉగాది పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించింది. దాదాపు ఆరేళ్లుగా ఆగిపోయిన ఈ పురస్కారాల ప్రకటనను తిరిగి పునరుద్ధరించి, శనివారం సాయంత్రం విజేతల జాబితాను విడుదల చేశారు. సాహిత్యం, కళలు, జర్నలిజం, హాస్యావధానం, బాల సాహిత్యం, పద్యం, సాంస్కృతిక సేవలు, మిమిక్రీ, బుర్రకథ, హరికథ, నాటకం, సామాజిక సేవ, సినిమా ఇలా అనేక రంగాల్లో ప్రముఖులను అవార్డులకు ఎంపిక చేశారు. ఈమేరకు శనివారం స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. కళారత్న, ఉగాది పురస్కారాలతో కలుపుకొని మొత్తం 202 మందిని ఎంపిక చేశారు. ఇందులో 86 మందికి కళారత్న, 116 మందికి ఉగాది పురస్కారాలు ప్రకటించారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆదివారం ఉదయం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదగా విజేతలకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. చివరిగా 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉగాది అవార్డులను అందించింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ పురస్కారాల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. మళ్లీ ఆరేళ్ల తర్వాత టీడీపీ ప్రభుత్వం ఉగాది పురస్కారాలను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

కళారత్నలు..

సాహిత్య విభాగంలో కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావుకు కళారత్న అవార్డును ప్రభుత్వం ప్రకటించింది. అలానే అచార్య ఎస్.రఘునాథశర్మకు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, సయ్యద్ నజీర్ అహ్మద్, దాట్ల దేవదానంరాజు, ఓలేటి పార్వతీశం, బొర్రా గోవర్ధన్, మన్నె శ్రీనివాసరావు తదితరులకు కూడా ఈ విభాగంలో అవార్డులు ప్రకటించారు. సంగీతంలో మల్లాది సోదరులు, నృత్యంలో ప్రముఖ సినిమా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సతీమణి సాయిసౌజన్యకు పురస్కారం లభించింది. సినిమా విభాగంలో నటుడు పృథ్వీరాజ్, నాటక రంగంలో డొర్నాల హరిబాబు, కావూరి సత్యనారాయణ, హరికథ విభాగంలో సప్పా భారతీలకు కళారత్న అవార్డు ప్రకటించారు.

'ఆంధ్రజ్యోతి' సీనియర్ జర్నలిస్టుకు పురస్కారం

జర్నలిజంలో తొమ్మిది మందిని కళారత్న అవార్డు వరించింది. సీనియర్ జర్నలిస్ట్, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ కే నాగ సుధాకర్ ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఇదే రంగం నుంచి 'ఈనాడు' ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు, 'స్వాతి' ఎడిటర్ వేమూరి బలరాం, కొల్లు అంకబాబు, భోగాది వెంకటరాయుడు, వల్లీశ్వర్‌లను ఎంపిక చేశారు. సేవా రంగంలో 'తానా' మాజీ అధ్యక్షుడు కోమటి జయరామ్, సీహెచ్ మస్తానయ్య, ఇతరుల విభాగంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి కొండా నరసింహరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు, ఐఆర్‌ఎస్ అధికారి ఎం.ప్రసాద్ ఎంపికయ్యారు.

ఉగాది పురస్కారాలు...

116 మందికి ఉగాది పురస్కారాలు లభించాయి. సాహిత్య విభాగంలో ఈతకోట సుబ్బారావు, చలపాక ప్రకాశ్, బండ్ల మాధవరావు, కె.వరలక్ష్మి, ఎస్.అబ్దుల్ అజీజ్, కుప్పిలి పద్మ తదితరులకు, నాటక రంగంలో చేగొండి వీరవెంకట సత్యనారాయణకు అవార్డులు ప్రకటించారు. కాగా, కళారత్న అవార్డు గ్రహీతలను రూ.50 వేల నగదు పురస్కారం, హంస ప్రతిమతో సత్కరిస్తారు. ఉగాది పురస్కార గ్రహీతలకు రూ.10 వేల నగదు పురస్కారం, మెమెంటో అందిస్తారు.

అవార్డుల ప్రకటనలో ఆలస్యం..

అవార్డుల ప్రకటన శనివారం ఉదయం ఉంటుందని అంతా భావించారు. కానీ, ప్రభుత్వం నుంచి ప్రకటన రావడం బాగా ఆలస్యం అయింది. మధ్యాహ్నం నుంచి విజేతలకు ఫోన్లు రావడం మొదలైంది. ఎట్టకేలకు సాయంత్రానికిగానీ పూర్తి జాబితా విడుదల కాలేదు. అవార్డులకు ఎంపికైన వారు ఆదివారం ఉదయానికి విజయవాడకు చేరుకోవాల్సి ఉంటుంది. పురస్కారాల ప్రకటనలో ఆలస్యం కారణంగా రాష్ట్రవ్యాప్తంగాను, తెలంగాణలోనూ ఉన్న అవార్డు విజేతలు అప్పటికప్పుడు ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవడంలో కొంత ఇబ్బందికి గురయ్యారు.

ఒకే కుటుంబంలోని
ఐదుగురి కిడ్నాప్

- తిరుపతిలో కలకలం.. ఆర్థిక లావాదేవీలే కారణం
- రూ.రెండు కోట్లు డిమాండ్ చేసిన కిడ్నాపర్లు
- తప్పించుకునేక్రమంలో కారులో నుంచి దూకిన భర్తకు తీవ్ర గాయాలు
- భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి ఆచూకీ కోసం పోలీసుల గాలింపు



కిడ్నాపర్ల నుంచి తప్పించుకుని గాయాల పాలైన రాజేశ్


కిడ్నాపర్ అరుణ్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీల కారణంతో ఒకే కుటుంబంలోని ఐదుగురిని కిడ్నాప్ చేసిన ఘటన తిరుపతిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రూ.రెండు కోట్లు ఇస్తేనే విడిచి పెడతామని బెదిరించిన ఈ ఘటన శనివారం వెలుగులోకి రావడంతో పోలీసులు గాలింపు చేపట్టారు. అలిపిరి ఎస్‌ఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు.. తిరుపతి నగరం జీవకోనలో కాపురముంటున్న రాజేశ్, అతడి భార్య సుమతి రెండు మీసేవ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. పిల్లలు జాస్మిత, యోక్షిత, తల్లి విజయతో కలిసి ఈ దంపతులు ఉంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన భార్గవ్ మూడేళ్ల క్రితం రాజేశ్ వద్ద అప్పు చేశాడు. డబ్బు తిరిగి ఇమ్మని రాజేశ్ అడుగుతుండడంతో భార్గవ్ కిడ్నాప్ ప్లాన్ చేశాడు. సెటిల్‌మెంట్లు, కిడ్నాప్‌లు చేయడంలో ఆరితేరిన అరుణ్ అనే వ్యక్తిని సంప్రదించి చెన్నై నుంచి కొందరు కిడ్నాపర్లను రప్పించారు. శుక్రవారం సాయంత్రం మీ-సేవ కేంద్రాన్ని మూసేసి రాజేశ్, సుమతి ఇంటికెళ్లారు. రాత్రి 7 గంటల సమయంలో రాజేశ్‌కు అరుణ్ ఫోన్ చేసి.. కొత్త వ్యాపారం గురించి మాట్లాడాలని, రెడ్డిభవన్ సమీపంలోని అక్కారంపల్లి వద్ద ఉంటున్న అపార్టుమెంటు వద్దకు రావాలని కోరాడు. దీంతో రాజేశ్, సుమతి, పిల్లలు, తల్లి విజయతో కలసి అపార్టుమెంటు వద్దకు వచ్చారు. అప్పటికే రెండు కార్లు సిద్ధం చేసుకుని ఉన్న కిడ్నాపర్ల బృందాలు రూ.రెండు కోట్లు ఇస్తేనే ఇక్కడి నుంచి పంపుతామని బెదిరించారు. అంత డబ్బు తమ వద్ద లేదని, చిత్తూరులో బంధువుల వద్దకు తీసుకెళితే తీసిస్తామని చెప్పారు. దీంతో వారందరినీ కారులో తీసుకుని చిత్తూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని ఐతేపల్లి వద్ద రాజేశ్ కిడ్నాపర్ల చెర నుంచి తప్పించుకుని కిందికి దూకేశాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని స్థానికులు గమనించి తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అలిపిరి ఎస్‌ఐ నాగార్జున రెడ్డి రాజేశ్ వద్దకు వెళ్లి వివరాలు రాబట్టారు. కిడ్నాపర్ల చెరలో ఉన్న భార్య సుమతి, ఇద్దరు పిల్లలు, తల్లిని కాపాడాలని రాజేశ్ వేడుకున్నాడు. వెంటనే రంగంలోకి దిగిన చిత్తూరు, తిరుపతి పోలీసులు కిడ్నాపర్ల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.


తెలుగు వారి తొలి పండగ ఉగాది. సోనోవిజన్ ఉగాది సేల్‌లో కొనుగోలు చేసి,
క్రొత్త సంవత్సరం లాభదాయకంగా ప్రారంభించండి
సోనోవిజన్
ఉగాది డిస్కౌంట్ సేల్
ఉగాది శుభాకాంక్షలు
Lowest Prices GUARANTEED Best Service
Upto 30000/- క్యాష్‌బ్యాక్ IDFC FIRST Bank
క్రెడిట్ కార్డ్, ఇతర కార్డ్ కొనుగోలుదారులకు, మరియు IDFC కొనుగోలుదారులకు, షరతులు వర్తిస్తాయి.
Upto 25000/- క్యాష్‌బ్యాక్ HDB FINANCIAL SERVICES
క్రెడిట్ కార్డ్, ఇతర కార్డ్ కొనుగోలుదారులకు, మరియు HDB కొనుగోలుదారులకు, షరతులు వర్తిస్తాయి.
Upto 10000/- క్యాష్‌బ్యాక్ BAJAJ FINSERV
బజాజ్ ఫైనాన్స్ కొనుగోలుదారులకు, షరతులు వర్తిస్తాయి.
Upto 26% క్యాష్‌బ్యాక్ క్రెడిట్ కార్డ్ కొనుగోలుదారులకు, సెలెక్టెడ్ మోడల్స్‌పై, షరతులు వర్తిస్తాయి.
1EMI Free HDFC BANK క్రెడిట్ కార్డ్ కొనుగోలుదారులకు, సెలెక్టెడ్ మోడల్స్‌పై, షరతులు వర్తిస్తాయి.
అన్ని పెద్ద కంపెనీల నుండి ఎక్కువ కూలింగ్ కెపాసిటి, హై ఎనర్జీ ఎఫిషియన్సీ రేషియోతో 2025 లేటెస్ట్ మోడల్స్ A.C లు అత్యంత విస్తృతశ్రేణి
LG 5Star & 3Star Inverter A.C
LLOYD 5Star & 3Star Inverter A.C
BLUE STAR 5Star & 3Star Inverter A.C
SAMSUNG 5Star & 3Star Inverter A.C
VOLTAS 5Star & 3Star Inverter A.C
DAIKIN 5Star & 3Star Inverter A.C
ఉగాది పండగ Exclusive ఆఫర్స్
HITACHI 5Star & 3Star Inverter A.C
Godrej 5Star & 3Star Inverter A.C
Panasonic 5Star & 3Star Inverter A.C
Haier 5Star & 3Star Inverter A.C
Carrier 5Star & 3Star Inverter A.C
ఎయిర్ కండీషనర్స్ Starting EMI 1888/-
ఎయిర్ కండీషనర్స్ Starting EMI 1888/-
VOLTAS Air Cooler 54 Litres Starting Price 6700/-
BAJAJ Air Cooler 55 Litres Starting Price 6600/-
Crompton Air Cooler 55 Litres Starting Price 8300/-
KENSTAR Air Cooler 60 Litres Starting Price 7200/-
orient electric Air Cooler 30 Litres Starting Price 5900/-
Symphony Air Cooler 60 Litres Starting Price 7000/-
LG Side by Side 635 Litres Refrigerator EMI : 12916/-
SAMSUNG Side by Side 650 Litres Refrigerator EMI : 5750/-
Whirlpool Frost Free Double Door 235 Litres Refrigerator EMI : 1900/-
Haier Frost Free Double Door 240 Litres Refrigerator EMI : 1750/-
VOLTAS Direct Cool Single Door 175 Litres Refrigerator EMI : 1266/-
LG 208 Cm (83") Ultra HD 4K OLED
Home Theatre
139 Cm (55") Ultra HD 4K Smart
SAMSUNG 189 Cm (75") LED 4K Ultra UHD
SONY 164 Cm (65") LED 4K Ultra HD Smart
Panasonic 108 Cm (43") LED 4K HD
LLOYD 108 Cm (43") Ultra 4K Google LED
TCL 108 Cm (43") 4K Google LED
Haier 108 Cm (43") UHD Google LED
BPL 109 Cm (43") UHD 4K Smart LED
iPhone 16, 16+ Upto 4000/- Cash Back
16 Pro, 16 Pro Max Upto 3000/- Cash Back
16e New Arrival
24/0, 9/0, 12/0 Schemes Available SBI, ICICI, Kotak Credit Cards and Selected Bank Cards (Exchange Bonus)
S-25 Ultra 5G Discount Upto 15000/- Conditions Apply
SAMSUNG A-36 5G A-56 5G
Instant Discount Upto 3000/-
9/0, 12/0, 24/0 Schemes Available
vivo 5G V-50 Pro 5G X-200, X-200 Pro
Upto 10% Cash Back 9/0, 10/2, 12/4 Schemes Available
oppo 5G F-29, F-29 Pro 5G Reno-13, 13 Pro
6/0, 7/0, 8/0, 11/2 Schemes Available
ONEPLUS 5G 13 & 13R
Instant CashBack ICICI Credit Card 12/4 Scheme Available
realme 5G 14 Pro
6/0, 8/2, 10/3 Schemes Available
mi Redmi 5G Note 14 Series
6/0, 8/0, 10/2, 12/4 Schemes Available
Water Dispenser Starting Price Rs:8000/-
Water Purifier RO Starting Price Rs:12000/-
Water Geyser 10 Litres Starting Price Rs:6200/-
Microwave Oven Starting Price Rs:6200/-
KITCHEN SMALL APPLIANCES
Air Chimney Starting Price Rs:8100/-
3 Burner Glass Cooktop Starting Price Rs:5000/-
Wet Grinder Starting Price Rs:3100/-
Rice Cooker Starting Price Rs:1650/-
Mixer Grinder 3 Jar, 750 Watts Starting Price Rs:2900/-
Juicer
Air Fryer
Kettle
Iron Box
Blender
Sonovision Festival Sale Special Offers On Mobiles & Laptops
AMAZON PAY Upto 2000/- CASH BACK Conditions Apply
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
విజయవాడ, విజయప్లాజా, ఏలూరు రోడ్, విజయవాడ 9154281648, 649, 650.
విజయవాడ, ఏలూరు రోడ్, రామమందిరం దగ్గర. 9440804182, 9246666202
విజయవాడ, ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట. 9246666664, 9100991701, 9440804184
విజయవాడ, యం.జి.రోడ్, ఆల్ ఇండియా రేడియో ఎదురు. 9246666203, 9154281640
విజయవాడ, పటమట, మోహన్‌దాస్ థియేటర్ దగ్గర. 9246661616, 9100991702
విజయవాడ, కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్ 9440804183, 9246666209
గొల్లపూడి, ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్. 8333924930, 9154281628
విజయవాడ, కానూరు, యం.జి.రోడ్. 8712600536, 8712600537,
శ్రీనగర్ కాలని, రింగ్ రోడ్డు, విజయవాడ. 8712600531, 32, 33
మెయిన్ రోడ్డు, చికిత్స హాస్పిటల్ దగ్గర, పాయకాపురం. ఫోన్ : 8712648704, 05, 06.
ఎనికేపాడు, ఏలూరు రోడ్. 9100991703, 9154281626
పోరంకి, మెయిన్ రోడ్ సెంటర్. 9154281645, 46, 47
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి. 7331149366, 367, 368
గుడివాడ, ఏలూరు రోడ్. 9154281178, 79
మచిలీపట్నం, కోనేరు సెంటర్, మునిసిపల్ పార్క్ ఎదురు. 7331149379, 80, 81

అందాల పోటీలు... అంతకు మించి!



అంతర్జాతీయస్థాయిలో, అన్నిదేశాలలో అందాల పోటీలు ప్రస్తుతం ఒక అవిభాజ్య అంశంగా మారిపోయాయి. ఈ పోటీలు కాలక్రమేణా సౌందర్య ప్రదర్శనకు మాత్రమే పరిమితం కాకుండా మనుషులలోని బహుముఖీన ప్రజ్ఞా విశేషాలకు అద్దంపట్టేలా రూపాంతరం చెందడం విశేషం.

ప్రస్తుత ప్రపంచంలో సౌందర్యానికి సంబంధించి చెప్పుకోదగినవిగా 'బిగ్ ఫోర్' పోటీలను చెబుతారు. అవి మిస్ యూనివర్స్, మిస్ వరల్డ్, మిస్ ఎర్త్, మిస్ ఇంటర్నేషనల్. మిస్ వరల్డ్ పోటీలు గత 73 సంవత్సరాలుగా అంతర్జాతీయంగా ఎంతో ప్రామాణికతను, ప్రాచుర్యాన్ని, ప్రభావాన్ని సాధించాయి. 1951 జూలై 29న మొట్టమొదటిసారిగా లండన్‌లోని లైసియం థియేటర్‌లో ఇవి జరిగాయి. యునైటెడ్ కింగ్డమ్‌కు చెందిన ఎరిక్ మోర్లీ మనసులో పుట్టిన ఆలోచన ఇది. అందాల పోటీలు అప్పటివరకు కేవలం శారీరక కొలతలు, రంగు, వివిధ వస్త్రాలలో వారి ఆకట్టుకునే సౌష్టవం ఇత్యాది అంశాలకు మాత్రమే పరిమితమై ఉండేవి. కానీ మిస్ వరల్డ్ పోటీలు 'బ్యూటీ విత్ పర్పస్' అనే లక్ష్యంతో, ఒక అడుగు ముందుకు వేసి సౌందర్యానికి సామాజిక ప్రయోజనాత్మకతకీ వారధిని నిర్మించాయి. అలా మొదలైన 'మిస్ వరల్డ్' పోటీలు ప్రపంచవ్యాప్తంగా ఏటా ఎంతో సందడిగా, వందకు పైగా దేశాల నుంచి సుందరీమణుల ప్రాతినిధ్యంతో అలరారుతున్నాయి.

తెలంగాణ రాజధానినగరం హైదరాబాద్ ఈ 2025 సంవత్సరపు 73వ మిస్ వరల్డ్ పోటీలకు వేదికగా ఎంపిక కావడం, మే నెలలో వాటి నిర్వహణ దిశగా సన్నాహాలు జరుగుతూండటం ఆహ్వానించదగిన అంశం. హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకువచ్చే దిశగా, తెలంగాణ రాష్ట్రానికి అంతర్ దేశీయ వైభవం సాధించే దిశగా ఈ వేడుకలు ఒక ముందడుగు. 430 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరం 'ముత్యాల నగరం'గా, 'వజ్రాల నగరం'గా, 'ప్రేమ నగరం'గా ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి గాంచింది. ఈ సౌందర్య పోటీల ఆవిష్కరణతో హైదరాబాద్ నగరం 'అందాల నగరం'గా కూడా అంతర్జాతీయంగా మరొక గుర్తింపును పొందే అవకాశం ఏర్పడింది.

మిస్ వరల్డ్ పోటీలకు భారతదేశానికి అనుబంధం 1966లో మొదటిసారిగా ఏర్పడింది. ఆ ఏట 'రీటా ఫారియా' అనే భారతీయవనిత అంతర్జాతీయంగా అందరినీ దాటి ప్రపంచ సుందరిగా ఎంపిక అయ్యింది. ఈ కిరీటాన్ని గెలుచుకున్న తొలి ఏషియన్ కూడా ఆమె. ఆ తర్వాత దాదాపు 28 ఏళ్ళ పాటు మళ్లీ ఏ భారతీయ సుందరి ఈ కిరీటాన్ని దక్కించుకోలేక పోయింది. భారతదేశంలో 1991 నుంచి నూతన ఆర్థిక సంస్కరణలు, సరళీకరణ ప్రక్రియ ఆరంభంతో శాటిలైట్ ఛానల్స్, మీడియా, వినోద పరిశ్రమకు సంబంధించి విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయి. ఈ నేపథ్యంలో 1994లో ఐశ్వర్యరాయ్ ప్రపంచ సుందరిగా ఈ కిరీటాన్ని దక్కించుకుని వంద కోట్ల భారతీయుల దృష్టిని ఆకర్షించింది. దానికి కొనసాగింపుగా, 1997లో డయానా హెడెన్, 1999లో యుక్తాముఖి, 2000 సంవత్సరంలో ప్రియాంక చోప్రా, 2017లో మానుషి చిల్లర్ వంటి భారతీయ సుందరీమణులు ఈ కిరీటాన్ని గెలుచుకున్నారు. ఈ పరిణామాల దృష్ట్యా భారతదేశంలో గతంలో ఎన్నడూ లేనిస్థాయిలో కాస్మెటిక్ ఇండస్ట్రీ ఆధారిత ఆర్థిక పరమైన అంశాలు ప్రభావితం అయ్యాయి.

అందాల పోటీలను నిర్వహించే ఆతిథ్య దేశానికి, ప్రాంతానికి అంతర్జాతీయ స్థాయిలో 'బ్రాండింగ్' రూపొందుతుంది. స్థానిక వ్యాపారం పెరుగుతుంది. స్థానిక వంటలు, వస్త్రాలు, కళారూపాలు, సాహిత్యం, సంగీతం, లలిత కళలు వంటి సాంస్కృతిక విశేషాలను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం లభిస్తుంది. మే నెలలో జరగనున్న మిస్‌వరల్డ్ పోటీలు హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ ఖ్యాతిని తెస్తాయి.



అందాల పోటీలను నిర్వహించే ఆతిథ్యదేశానికి, ప్రాంతానికి అంతర్జాతీయ స్థాయిలో, దాదాపు 120కి పైగా దేశాలలో 'బ్రాండింగ్' రూపొందుతుంది. స్థానిక వ్యాపారం కూడా ఎంతో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. చేతివృత్తులు, హస్తకళలు, స్థానిక వంటలు, వస్త్రాలు, కళారూపాలు, సాహిత్యం, సంగీతం, లలిత కళలు వంటి సాంస్కృతిక విశేషాలు ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం లభిస్తుంది. ఈ సౌందర్య పోటీల ప్రారంభ, ముగింపు ఉత్సవాలలో ప్రత్యేకంగా ఆయా దేశాలు లేదా ప్రాంతాలు తమదైన స్థానిక, దేశీయ, మూలవాసుల సంస్కృతులను కళా ప్రదర్శనల ద్వారా చూపించడం వల్ల ఆ ప్రాంత ఔన్నత్యం, అస్తిత్వం, సాంస్కృతిక వైవిధ్యం ప్రపంచమంతా తెలిసే అవకాశం ఉంటుంది.

అందాల పోటీలు అంతర్జాతీయంగా ఒక దేశ బ్రాండ్‌ని మార్కెటింగ్ చేయడంలో దోహదపడుతున్నాయి అనేది నిజమైనప్పటికీ, స్త్రీ హక్కుల పరిరక్షణ సంఘాలు, మానవ హక్కుల సంఘాలు, ఇతర పౌర సంఘాలు దీని పట్ల ప్రతి సందర్భంలోనూ వ్యతిరేకతను, నిరసనను వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. ఈ అందాల పోటీలు స్త్రీలను విలాస వస్తువుగా, భోగవస్తువుగా, ఆటబొమ్మగా చూసే సంస్కృతిని పెంపొందిస్తున్నాయని వారు విమర్శిస్తున్నారు. అందుకే ప్రతి ఏటా ఈ అందాల పోటీలు జరిగే దేశాలలో, ప్రాంతాలలో మహిళా సంఘాల నిరసన సెగలు సహజంగా పరిణమించాయి. అయితే ఇటీవలి కాలంలో ఈ ధోరణిలో కొత్త ప్రశ్నలు మొదలవడం గమనించదగిన అంశం. అందాల పోటీలో పాల్గొనే వాళ్ళందరూ వివిధ ప్రొఫెషనల్ రంగాలలో నిష్ణాతులు కావడం, కేవలం 'స్కిన్ షో'కు పరిమితమైన వారుగా కాకుండా, డాక్టర్లుగా, కార్పొరేట్ మేనేజర్లుగా, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా, వర్ధమాన పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతూ, వివిధరంగాలలో ప్రతిభను, ప్రగతిని చూపించిన మహిళలే ఇందులో పాల్గొనడానికి సుముఖత చూపడం గమనార్హం. మరొకవైపున ఈ పోటీలలో సాంస్కృతిక విశిష్టతలను చెప్పే అంశాలు, మేధస్సుని పరీక్ష చేసే అంశాలు, సామాజిక సేవ, మానవీయ కోణాలను పరీక్ష చేసే మరెన్నో అంశాలు అంతర్భాగంగా జోడించడం వల్ల ఒక స్త్రీ మూర్తిమత్వాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించగలిగే పోటీలుగా ఇవి రూపాంతరం చెందాయి. "మేధస్సుని కలిగినవారు సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలలో పాల్గొంటారు. ప్రొఫెషనల్ నైపుణ్యం కలిగినవారు వైద్యులుగా, వ్యాపారవేత్తలుగా, న్యాయవాదులుగా, ఇంజనీర్లుగా తమ ప్రతిభని ప్రదర్శిస్తున్నారు. వీటన్నిటితో పాటు సౌందర్యం కూడా అదనంగా కలిగిన మేము, మా సౌందర్యాన్ని ప్రదర్శించి అందులో మిగతావారి కన్నా ఎంతో బాగున్నామని నిరూపించుకోవడంలో తప్పేముంది?" అని అందాల పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణులు వేస్తున్న ప్రశ్నలు ఇప్పుడు అందర్నీ ఆలోచింపజేస్తున్నాయి.

హైదరాబాద్‌లో జరగబోయే ఈ అందాల పోటీలు మరింత నాణ్యతతో, మరింత సాంస్కృతిక వైవిధ్యతతో, శారీరక సౌందర్యంతో అంతఃసౌందర్యాన్ని కూడా ప్రదర్శించే విధంగా రూపొంది, తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ సౌందర్య చిత్రపటంలో ప్రత్యేకంగా నిలుపుతాయి అని ఆశించవచ్చు.

• డాక్టర్ మామిడి హరికృష్ణ
డైరెక్టర్, తెలంగాణ భాష–సాంస్కృతిక శాఖ

కృత్రిమ మేధలో 'డ్రాగన్' దూకుడు

కృత్రిమ మేధ (ఎఐ) సాంకేతికత చైనాకు ప్రతీకగా మారింది. ప్రపంచదేశాలు ఇంతవరకు చైనాను చూస్తున్న తీరు తెన్నులను డీప్‌సీక్ ఒక్కసారిగా మార్చి వేసింది. చైనా శీఘ్రపురోగతిని నిరోధిస్తున్న ప్రతి ద్రవ్యోల్బణం, రుణభారం, జన సంఖ్యామానం సమస్యలపై కలవరపాటు సమసిపోయేందుకు డీప్‌సీక్ దోహదం చేస్తోంది. ఇప్పుడు మదుపుదారులు అందరూ ఆ సమస్యల గురించి కాకుండా ఆర్థికాభివృద్ధిలో అమెరికాను చైనా ఎలా, ఎంతత్వరగా అధిగమించగలుగుతుంది, సాంకేతికతల సృష్టిలో ప్రస్తుత ప్రపంచ అగ్రరాజ్య ప్రాబల్యాన్ని చైనా ఎలా సవాల్ చేయనున్నదీ అన్న విషయాలపైనే మాటామంతీ జరుపుతున్నారు.



డీప్‌సీక్ సంచలనం ఆశ్చర్యకరమైనదేమీ కాదు. 2022లో ప్రపంచ అగ్రగామి ఎఐ పరిశోధకులలో దాదాపు సగంమంది తమ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను చైనాలోనే పూర్తిచేశారు. ఈ విషయంలో అమెరికా వాటా 18 శాతం. ప్రపంచ మేధా సంపత్తి సంస్థ గణాంకాల ప్రకారం 2024లో ఇన్నోవేషన్ ఇండికేటర్స్‌లో చైనా మూడవ స్థానంలో ఉంది. ఈ వినూత్న సాంకేతికతల సృష్టి చైనాలోని అనామక విశ్వవిద్యాలయాలనుంచే అధికంగా జరుగుతోంది.

చైనాకు విశేషంగా ఉన్న 'ఇంజినీర్ లబ్ధి' (engineer dividend) సత్ఫలితాలనిస్తోంది. 2000–2020 సంవత్సరాల మధ్య చైనాలో ఇంజినీర్ల సంఖ్య 5.2 మిలియన్ నుంచి 17.7 మిలియన్‌కు పెరిగింది. అపారంగా అందుబాటులో ఉన్న ఇంజినీరింగ్ ప్రతిభాపాటవాలు 'ఉత్పత్తి అవకాశాల సరిహద్దు' (production possibility frontier)ను మరింత ఉన్నతస్థాయికి తీసుకువెళ్లడంలో చైనాకు తోడ్పడుతుంది. ఒక విధంగా డీప్‌సీక్ సంచలనం ఆశ్చర్యకరమైనదేమీ కాదు. ఇంజినీరింగ్ ప్రతిభావంతులు అత్యధిక సంఖ్యలో ఉండడం వల్లే సాంకేతికతల నవీకరణలో పథనిర్దేశం చేయగల అవకాశం చైనాకు లభించింది. 2022లో ప్రపంచ అగ్రగామి ఎఐ పరిశోధకులలో 47శాతం మంది తమ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను చైనాలోనే పూర్తి చేశారు. ఈ విషయంలో అమెరికా వాటా 18 శాతం మాత్రమే. ప్రపంచ మేధా సంపత్తి సంస్థ గణాంకాల ప్రకారం 2024లో ఇన్నోవేషన్ ఇండికేటర్స్‌లో చైనా మూడవ స్థానంలో ఉంది. ఈ వినూత్న సాంకేతికతల సృష్టి అనామక పరిశోధనా కేంద్రాల నుంచి జరుగుతున్నదనే వాస్తవాన్ని కూడా మనం గుర్తించాలి. ఇందుకొక ఉదాహరణే డీప్‌సీక్. బీజింగ్‌లోని ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం 'Tsinghua' నుంచి అది ప్రభవించలేదు. ఒక చిన్ననగరంలోని ఒక అంకుర సంస్థ నుంచి అది వెలుగుచూసింది. డీప్‌సీక్ సృష్టికర్త లియాంగ్ వెన్‌ఫెంగ్ ప్రఖ్యాత ఝెజియాంగ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడు. అయితే, ఆ వర్సిటీ చైనా హార్వర్డ్ విశ్వవిద్యాలయమేమీ కాదు. స్టాక్ ఎనాలిసిస్, రెజ్యూమ్ స్క్రీనింగ్ మొదలైన సంక్లిష్ట పనులను సమర్థంగా నిర్వర్తించగల అధునాతన సాంకేతికతను సృష్టించడం ద్వారా Manus ఎఐ ఇటీవలే మరొకసారి కృత్రిమ మేధరంగంలో అమెరికా అగ్రగామిత్వంపై ప్రశ్నలు లేవనెత్తింది. ఈ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జియావోహాంగ్ వూహాన్‌లోని హువాఝోంగ్ విశ్వవిద్యాలయంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ చదివాడు. ఈ వర్సిటీ పేరు ప్రఖ్యాతులు ఝెజియాంగ్ విశ్వవిద్యాలయంకు ఉన్న వాటి కంటే కూడా తక్కువే.

'యూనిట్రీ రోబోటిక్స్' అనే అంకుర సంస్థనే తీసుకోండి. దీని 'కుంగ్ ఫు బాట్స్' ప్రతిష్ఠాకరమైనవి. కృత్రిమమేధ ఆధారిత మానవుల లాంటి రోబోల (హ్యూమనాయిడ్) అధికోత్పత్తిలో అమెరికా, చైనాల మధ్య పోటీలో చైనాను అగ్రగామిగా నిలపడంలో ఈ కుంగ్ ఫు రోబోలు విశేష దోహదం చేశాయి. షాంఘైలోని ఒక స్థానిక విశ్వవిద్యాలయంలో ఈ అంకుర సంస్థ వ్యవస్థాపకుడు వాంగ్ చదువుకున్నాడు. ఇంగ్లీష్ పరీక్షలో తగిన మార్కులు సాధించలేకపోవడంతో ఏమంత పేరు లేని విశ్వవిద్యాలయమే అతడికి దిక్కు అయింది. ఒక్కమాటలో చెప్పాలంటే, చైనా ఏమి సాధించగలదన్న విషయాన్ని నిర్ధారించేందుకు అత్యుత్తమ విశ్వవిద్యాలయాల నుంచి పట్టభద్రులయిన అగ్రగామి ఒకశాతం మంది ప్రతిభావంతులను పరిగణనలోకి తీసుకోవద్దు. దిగువస్థాయి విశ్వవిద్యాలయాలలో చదువుకుని, చిన్ననగరాలలో నివసిస్తున్నవారు దిగ్భ్రమ కలిగించే నవకల్పనలతో ప్రపంచం ముందుకు వస్తున్నారు.

మరో ముఖ్యవిషయమేమిటంటే చైనా 'వ్యయప్రయోజనం' పొందుతోంది. ఒక సంస్థ తన పోటీదారుల కంటే తక్కువ ఖర్చుతో వస్తువులు లేదా సేవలను ఉత్పత్తి చేయగల సామర్థ్యాన్ని ఈ వ్యయప్రయోజనం సూచిస్తుంది. ఇది అధిక లాభదాయకతకు, మార్కెట్లో పోటీతత్వానికి అవకాశమిస్తుంది. చైనాలో మొత్తం ఇంజినీరింగ్ పట్టభద్రులలో 30 సంవత్సరాల లోపువారు 44 శాతం. అమెరికాలో ఇది 20 శాతం మాత్రమే. ఒక ప్రతిభావంతుడైన పరిశోధకుడి మీద చైనా పెడుతున్న ఖర్చు అమెరికా చేస్తున్న వ్యయంలో ఎనిమిదో వంతు.

చైనాలో ఉన్నత విద్యారంగంమీద పాలకుల శ్రద్ధ కారణంగా ఇప్పుడు ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసినవారిలో 40శాతం మంది విశ్వవిద్యాలయాలకు వెళ్లుతున్నారు. పాతికేళ్లక్రితం ఇటువంటి విద్యార్థుల సంఖ్య కేవలం 10 శాతం. చైనాలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యలో ఇంజినీరింగ్ కోర్సులో చేరేవారు అత్యధికం. జనాభాసంఖ్య తగ్గుదల సమస్యతో సతమతమవుతున్న చైనా ప్రభుత్వానికి ఇదొక ఉపశమనం. గత ఏడాది చైనాలో 9.5 మిలియన్ పసిపాపలు మాత్రమే పుట్టారు. కోవిడ్ ఉపద్రవానికి ముందుకాలంలో వార్షిక జనాభా పెరుగుదల 15 మిలియన్‌గా ఉండేది. తమ సమాజం అంతకంతకూ వృద్ధాప్య సమాజం అయిపోతుండడంతో పాటు ఎగుమతుల ఆధారిత అభివృద్ధి నమూనా ప్రయోజనాలు తగ్గిపోవడంతో ఒకనాటి జపాన్ వలే చైనా ప్రాధాన్యాన్ని కోల్పోవచ్చునే భయాందోళనలు ఈ దేశ ప్రజలు, పాలకులలో పెరిగిపోతున్నాయి.

ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ ప్రతిభాపాటవాల సమృద్ధి ఒక సరికొత్త అభివృద్ధి నమూనాను సూచిస్తోంది. చైనా కార్మిక శ్రేణులలో వృద్ధులు పెరిగిపోతున్నారు. ఆగ్నేయాసియా దేశాలతో పోలిస్తే చైనాలో సంప్రదాయక ఎగుమతుల రంగాలయిన స్మార్ట్ ఫోన్స్, వస్త్రోత్పత్తులలో కార్మికుల వేతన భత్యాలు అత్యధికం. అయితే, ప్రతిభాసంపన్నులైన యువ ఇంజినీర్లు సమృద్ధిగా అందుబాటులో ఉన్నారు. జీవ సాంకేతికతలు, రోబోలు, కృత్రిమ మేధ అనువర్తనాలలో అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలకు దీటైన పోటీ నివ్వగల శక్తిసామర్థ్యాలను చైనాకు వారు సమకూర్చగలరు.

చైనా పాలకులు ఇప్పటికే సంప్రదాయ ఎగుమతుల రంగాలకు ప్రాధాన్యమివ్వడాన్ని తగ్గించారు. ఆ రంగాలలో తాము కీలక అనుకూలతలను కోల్పోతున్నామన్న వాస్తవాన్ని వారు గుర్తించారు. అందుకు మారుగా ఉత్కృష్ట ఇంజినీరింగ్ ప్రతిభా సామర్థ్యాలను అపారంగా సమకూర్చుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. కనుక అమెరికా టెక్నలాజికల్ శక్తి సామర్థ్యాలు తిరుగులేనివని వాదిస్తున్నవారు వాటికి చైనా నుంచి ఎదురవనున్న వ్యవస్థాగత సవాళ్లను తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. ఒకనాడు వస్త్రోత్పత్తులు, గృహ సామగ్రి ఉత్పత్తులలో వలే ఇప్పుడు కృత్రిమమేధ ఇత్యాది అధునాతన సాంకేతికతరంగాలను డ్రాగన్ దున్నేయబోతున్నదా?

○ షులి రెన్
(డెక్కన్ హెరాల్డ్ సౌజన్యం)

పూర్వవైభవానికై అమెరికా ఆరాటం!

ప్రపంచ చరిత్ర కనీసంగానైనా తెలియకపోతే ప్రపంచంలో వేగంగా మారుతున్న నేటి పరిస్థితులు గందరగోళంగానే దర్శనమిస్తాయి. 1945లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత ఆ యుద్ధంలో గెలిచినప్పటికీ బ్రిటన్ ఆర్థికంగా చితికిపోయింది. రాజకీయంగా ఉన్న అగ్రరాజ్య ఆధిపత్య స్థానాన్ని కూడా కోల్పోయింది. అప్పటివరకు వేగంగా అభివృద్ధి చెందుతూ వచ్చిన అమెరికా, బ్రిటన్ స్థానాన్ని తీసుకున్నది. రెండు ప్రపంచ యుద్ధాలతో ప్రపంచాన్ని విధ్వంసం చేసిన దేశాలన్నీ అమెరికా నాయకత్వంలో ఒకే కూటమిగా ఏర్పడినాయి. సోషలిస్టు దేశాలకు నాయకత్వం వహిస్తున్న సోవియట్ యూనియన్‌ను బూచిగా చూపించి 1949లో అమెరికా తన కూటమిలోని దేశాలను నాటో సైనిక కూటమిగా నిర్మాణం చేసింది.



అన్నింటికంటే ప్రపంచం పైన చైనా ఆధిపత్యం పెరుగుతుండడం అమెరికాకు ప్రధాన సమస్య. అమెరికాకు పశ్చిమ యూరప్ దేశాలో ఇంకా వేరే దేశాలో మిత్ర దేశాలు కాదు. చైనాతో పోరాడగలిగే దేశాలు, చైనాను బలహీనపరచడానికి ఉపయోగపడే దేశాలు అమెరికాకు మిత్రదేశాలు. అందుకే అమెరికా రష్యాకు అనుకూలంగా వ్యవహరించడానికి ప్రయత్నిస్తున్నది. అయితే ఏ ఒక్క దేశమో కోరుకున్నట్లుగా ప్రపంచం నడవదు.

మరోవైపు మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచంలో ఏర్పడిన ఒకే ఒక్క సోషలిస్టు దేశమైన సోవియట్ యూనియన్ రెండవ ప్రపంచ యుద్ధం తరువాత మరో అగ్రరాజ్యంగా అవతరించింది. అమెరికాకు బలమైన ప్రత్యర్థిగా ఎదురు నిలిచింది. 1953లో స్టాలిన్ మరణం తరువాత, నాటోకు జవాబుగా 1955 మే నెల 14న వార్సా ఒప్పందం ద్వారా సైనిక కూటమిని సోవియట్ యూనియన్ ఏర్పాటు చేసింది.

20వ శతాబ్దం మధ్య నుండి ప్రపంచంపై ఆధిపత్యం కొరకు ఈ రెండు కూటముల మధ్య కోల్డ్‌వార్ పేరు మీద ప్రాంతీయ యుద్ధాలు సాగినాయి. సోషలిస్టు కూటమిని ఓడించడానికి, అణచి ఉంచడానికి అమెరికా ప్రపంచవ్యాప్తంగా మిత్ర దేశాలకు ఎన్నో రాయితీలు, కాంట్రాక్టులు ఇచ్చింది. ఎన్నో కార్యక్రమాలకు నిధులు సమకూర్చింది. సైనిక శిబిరాలను ఏర్పాటు చేసింది. ఇలా ఎంతో ఖర్చు చేసి, ప్రపంచ ఆధిపత్యం ద్వారా అంతకంటే ఎక్కువే లబ్ధి పొందింది.

కోల్డ్‌వార్ పేరుతో జరిగిన ప్రాంతీయ యుద్ధాలు 1990 దశకం నాటికి ప్రపంచం పరిస్థితిని మార్చివేశాయి. వార్సా సైనిక కూటమికి నాయకత్వం వహిస్తున్న సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై 15 దేశాలుగా విడిపోయింది. వార్సా కూటమికి చెందిన మిగతా దేశాలలోని సోకాల్డ్ సోషలిస్టు ప్రభుత్వాలు కూడా కూలిపోయాయి. చివరికి 1991లో వార్సా సైనిక కూటమి కూడా రద్దు అయింది.

ఈ కాలంలోనే నాటో రద్దు గురించి కూడా చర్చ వచ్చింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై, వార్సా కూటమి రద్దు అయిన తరువాత కూడా నాటో సైనిక కూటమి అవసరం ఏమిటి అనే వాదనలు ముందుకు వచ్చాయి. కానీ అమెరికా, దాని నాటో మిత్రదేశాలు పిట్టకథలు చెబుతూ నాటోను రద్దు చేయకుండా కొనసాగించాయి. అంతే కాదు నాటోను రష్యా సరిహద్దుల వరకు విస్తరించాయి. ఇది నాటో, రష్యన్ ఫెడరేషన్‌లు కలిసి ఏర్పాటు చేసుకున్న, నాటో–రష్యన్ కౌన్సిల్ అవగాహనకు విరుద్ధం.

సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన 30 సంవత్సరాల తరువాత నేడు ప్రపంచం చాలా మారింది. గ్లోబలైజేషన్ పేరుతో సాగిన వ్యాపార యుద్ధాల వలన ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అయ్యాయి. 1990లో సోవియట్ యూనియన్ సూపర్ పవర్ స్థానాన్ని కోల్పోతే అమెరికా 2025 నాటికి సూపర్ పవర్ స్థానాన్ని కోల్పోయే పరిస్థితికి చేరుకుంది. అందుకే ట్రంప్ పదేపదే తిరిగి అమెరికాను గొప్ప దేశంగా చేయాలని అంటున్నాడు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా వెన్నుదన్నుతో కోలుకున్న పశ్చిమ యూరప్, జపాన్ లాంటి దేశాలు అమెరికా నీడలో ఉంటూనే అమెరికా లాభాలు ఆదాయాలకు గండి కొట్టడం మొదలుపెట్టాయి. 1990లలో దెబ్బతిన్న రష్యా కూడా 2000 నుండి క్రమంగా కోలుకొని అమెరికాకు పోటీ ఇవ్వడం మొదలు పెట్టింది. చైనా 1980 తరువాత అమెరికాతో మైత్రిని నెరపుతూనే చాపకింద నీరులా ప్రపంచ మార్కెట్‌ను కబ్జా చేసింది. అమెరికాకు పోటీగా దాని మార్కెట్లను, ప్రాబల్య ప్రాంతాలను తన ఆధీనంలోకి తీసుకున్నది. చైనా బ్రిక్స్‌ను ఏర్పాటు చేసి అంతర్జాతీయ కరెన్సీగా ఉన్న డాలర్‌కే ఎసరు పెట్టింది. మూడు సంవత్సరాల నుండి సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధంలో నాటో విజయం అసంభవంగా మారింది. ఈ పరిణామాలన్నీ అమెరికాను ఆర్థికంగానూ రాజకీయంగానూ దెబ్బతీశాయి. ప్రపంచ ఆధిపత్యం కోసం అమెరికా చేసిన యుద్ధాల వలన కూడా అమెరికా ఆర్థిక, రాజకీయ సమస్యలను ఎదుర్కొన్నది. ఆధిపత్యం కోసం అమెరికా చేస్తున్న ఖర్చులకు తగినంత ఆదాయం వెనక్కు రాకపోవడమే కాదు, ఆ ఖర్చులే భారంగా పరిణమించాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా కొత్త ఎత్తుగడలు పాత ప్రపంచాన్ని గందరగోళపరుస్తున్నాయి. యునైటెడ్ నేషన్స్ కార్యక్రమాలలో తన ఖర్చులను తగ్గించుకుంటున్నది. దేశంలో ఉద్యోగులను తగ్గించుకుంటున్నది. వలసదారులను రానివ్వడంలేదు. విదేశీ దిగుమతులపైన పన్నులు పెంచుతోంది. స్వేచ్ఛా మార్కెట్ ఛాంపియన్ అయిన అమెరికా రక్షణ సుంకాల వకాల్తాదారు అయ్యింది. చివరికి నాటో నుంచి కూడా బయటకు వెళ్తానని చెపుతున్నది.

ప్రపంచంపైన చైనా ఆధిపత్యం పెరుగుతుండడం ఇప్పుడు అన్నింటికంటే అమెరికాకు ప్రధాన సమస్య. ఉక్రెయిన్ యుద్ధం, రష్యా, ఇరాన్‌లు అమెరికాకు ప్రాధాన్యం లేని సమస్యలుగా మారిపోయాయి. పశ్చిమ యూరప్ దేశాలో ఇంకా వేరే దేశాలో అమెరికాకు మిత్రదేశాలు కాదు. చైనాతో పోరాడగలిగే, దానిని బలహీనపరచడానికి ఉపయోగపడే దేశాలే అమెరికాకు మిత్రదేశాలు. అందుకే అమెరికా రష్యాకు అనుకూలంగా వ్యవహరించడానికి ప్రయత్నిస్తున్నది.

అమెరికా కోరుకున్నట్లుగా రష్యా నడుస్తుందా, కష్టకాలంలో తనకు మద్దతుగా నిలబడిన చైనాను రష్యా మరిచిపోగలదా? అసలు సంక్షోభంలో ఉన్న అమెరికాపైన ఆధారపడాలని రష్యా అనుకుంటుందా? కొత్త మిత్రులు ఏమోగానీ ఉన్న మిత్రులను కూడా అమెరికా కోల్పోయే ప్రమాదం లేకపోలేదు. ఏమైతేనేమి రాబోయే కొద్దికాలంలోనే ప్రపంచ రాజకీయ చిత్రపటంలో ఎవరు ఎటువైపు ఉన్నారో స్పష్టంగా దర్శనమివ్వవచ్చు.

▪ లంకా పాపిరెడ్డి

కొత్తరుచి

తొలగిన మంచుతెరల్లోంచి
మామిడాకుల గుబురుల్లో దాగిన
ఓ పాత కోకిల
మళ్లీ రాగాల్ని అందుకొంటోంది
రాగం పాతదే
గొంతు కొత్తగా వినబడుతోంది

వగరు చేదుల ఆరు రుచుల సమ్మేళనం
కొన్నేళ్లపాటు
గొంతులో గరళమై దిగుతుంటే
అలసిపోయిన కోయిల
ఇప్పుడు చైత్రాన్ని కొత్త చిగుళ్ల
తోరణాలతో స్వాగతిస్తోంది

ఒక్కో ఇంటి తలుపును
తడుతున్న వసంతం
రేపటి భరోసాను పంచిపెడుతోంది
బహుశా ఈ ఉగాది కొత్త రుచిని
పందారం చేస్తున్నట్లుంది
అడవులైన పొలాలు
కాలువలై పారుతున్న నీళ్లు
సరికొత్త దృశ్యాలుగా
ఆవిష్కారమవుతున్నాయి
ఈ ఉగాది మాట తప్పని
చేతల్ని వాగ్దానం చేస్తోంది

– బండ్ల మాధవరావు

దాని పేరు విశ్వావసు

ఉదయం ఏదో ఫోన్ రింగ్ అవుతుంది
బంధువుకి ఒంట్లో బాగాలేదని సారాంశం
హాస్పిటల్‌కి వెళ్లేసరికి అశ్రునివాళి
వాట్సాప్‌లో దూరపు చుట్టాల పెళ్లి సందడికి
తప్పక రమ్మని ఒక షార్ట్ వీడియో
అన్న కొడుకు విదేశాల్లో పైచదువులకు
ఎయిర్‌పోర్ట్‌లో ఫ్యామిలీ సెండ్‌ఆఫ్ ఫోటోలు

సైకిల్ మీద కాలేజీకి కలిసి వచ్చిన శీనుగాడు
ఇంటికొచ్చి కూతురికి మద్రాస్ ఐఐటీలో సీటు
వచ్చిందని సంబరపడ్డాడు
ముందే తెలుసుకున్నాడో ఏమో
పట్టుబట్టి ఇంటికి తీసుకెళ్లి
నా కష్టం కాస్తయినా తుడవాలని నవ్వులతో
హత్తుకున్నాడు

అంతే కదా జీవితం– నాలుగు నవ్వులు
మూడు ఏడుపులు ఒక దిగులు
అర మోతాదులో కోపం
మరో అర మోతాదు భయం
చిటికెడు ఉల్లాసం చిటికెడు ఉత్సాహం
అచ్చం ఉగాదిలా
అయితే ఈసారికి దాని పేరు విశ్వావసు!

– బంగార్రాజు కంఠ

ప్రజాస్వామ్య ఉగాది

అకుపచ్చని కళన్ అలరారు ప్రతి చెట్టు
క్రమ భారత పతాకగ వెలుంగ
అనఘ పంచాంగంబె అతిగౌరవార్హమౌ
స్తవ్య రాజ్యాంగ గ్రంథంబె కాగ
చిత్రముల్ ఋతువుల శిష్ట క్రమములెల్ల
ఘనపాలనా విభాగాలు కాగ
వికసిత భారత ప్రకట సంస్కృత సభల్
కేంద్ర శాసనసభా కేళి కాగ
అళి పిక శుకమనోహర రూప చేష్టలే
సరస పౌరాళి సంబరము కాగ

'విశ్వ'మున కెల్ల 'వసువౌ'చు శాశ్వతముగ
భవ్యదివ్యంబు దారిదీపంబెయైన
ప్రతి ఉగాది ప్రజాస్వామ్య ప్రభుతగాదె!
సారపర్వయశశ్రీకి స్వాగతంబు

– రామడుగు వేంకటేశ్వరశర్మ



పర్వగీతం

ఆమని రాసే కమ్మని కవిత
అనంత కాలపు వసంత వేడుక

మామిడికాయల
మేలిమి మెటఫర్

వేపపూలను శృతి చేసే
తేనెపలుకుల పాట

సుర్రుమనే నాలుకపై
సడిచేసే పచ్చడి కారం

కొత్తికుండ బెల్లం ముక్కల్లో
తీయతీయగా పలికే ప్రాస

కోయిల పాటల కొసమెరుపుల్లో
కొత్త చింతపండు కొసరు వలపు

చిటికెడు ఉప్పు ఉతరేకించే
రుచి వ్యాకరణపు జిహ్వాభాష

చిగురుటాశల అమరకోశం
ఆరు రుచుల ఆమ్రేడితం

ఉగాది.. ఏరువాకల భారతం
మన తెలుగువారి పర్వగీతం!

–కంచరాన భుజంగరావు

రెండు పండుగలు

రెండు మతాలు
రెండు నేత్రాలై
మానవత్వానికి
'చూపు'నిస్తున్నాయి..!
రెండు పండుగలు
గుండె స్పందనలై
ఏకత్వానికి
'బ్రతుకు'నిస్తున్నాయి..!


మామిడి తోరణాలు
అత్తరు పరిమళాల మధ్య
షీర్ ఖుర్మా పాయసాలు
షడ్రుచుల భావనలు
ఆవిష్కృతమవుతున్నాయి..!

ఖర్జూర పండ్లు
కోయిల రాగాల మధ్య
పంచాంగ శ్రవణాలు
నమాజులు
మన విశ్వాసపు
గీతాలై వినిపిస్తున్నాయి..!

ఉపవాసాలు
ఉగాది పచ్చడిల మధ్య
మత సామరస్యపు ప్రతిబింబాలు
కవుల కవితా గానాలు
మనదేశ ఆదర్శాలై నడుస్తున్నాయి..!

మనలోని ఐక్యత
మనందరి సమగ్రత
మేరా భారత్ మహాన్ అంటూ
నింగిలోని మేఘాల మధ్య
పిడుగుల గర్జనగా
మన దేశం ప్రతిధ్వనిస్తుంది..!

– ఫిజిక్స్ అరుణ్‌కుమార్



ఉగాది తల్లీ వందనం!

మామిడి కొమ్మ మీద
కలమంత్ర పరాయణుడైన
కోకిల స్వామి నీకు వందనమ్ము
విశ్వసుందర పరమ పవిత్రమూర్తియైన
విశ్వావసు నామ వత్సరంబునకు
ఎదురువోయి స్వాగతంబిమ్ము
గీతికా ప్రసవమొసగి!

అరవదేడుల కాలచక్రభ్రమణమున
మరల వచ్చెను విశ్వావసు నవోదయమై
తెలుగు ప్రజలకు పర్వదినమై
షడ్రసోపేత రుచులను పంచగ
వచ్చెనమ్మా! నవ ఉగాది విశ్వావసువై!
తెచ్చునేమో ప్రజల జీవితమున క్రొత్త మార్పులు!
వచ్చునేమో! అభ్యుదయ పరంపరలు!

జాతి జనుల జీవితమ్మున
స్నేహ వాత్సల్య ప్రేమ మధురిమలు
వెల్లివిరియగ వచ్చెనమ్మా! నవ ఉగాది!
తెచ్చెనమ్మా క్రొత్త శోభలు! నవ ఉగాది!
ఆయురారోగ్య సంభరితమై
హృదయములానంద భరితము కాగ
అక్షరాక్షతల తోడ దీవించును గాక! విశ్వావసు!
వందనమమ్మా వందనమ్ము ఉగాది తల్లీ!
విశ్వావసుకు వందనమ్ము!

– ఆచార్య కె. యాదగిరి


శ్రీవారి ఆలయం ముందు భక్తుల రద్దీ

నేడు శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం

» వేడుకలకు సర్వాంగ సుందరంగా సిద్ధమైన తిరుమల

తిరుమల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలకు తిరుమల ముస్తాబైంది. శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉగాది ఆస్థానం జరుగనుంది. ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. శ్రీవారి మూలవిరాట్టు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు సమర్పిస్తారు. అలాగే పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. తర్వాత ఉగాది ఆస్థానాన్ని పండితులు ఆలయంలోని బంగారు వాకిలిలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. కాగా, ఉగాది సందర్భంగా శ్రీవారి ఆలయాన్ని సర్వాంగాసుందరంగా తీర్చిదిద్దారు. ధ్వజస్తంభం, బలిపీఠాన్ని లక్ష కట్ ఫ్లవర్లతో అలంకరించారు. ఇందులో ప్రత్యేకంగా అమెరికాలోని కాలిఫోర్నియా, కొలంబియా నుంచి తొలిసారిగా ట్రిసిలియం, డెల్ఫీనియం అనే పుష్పాలను తీసుకొచ్చి అలంకరించారు. అలంకరణల కోసం మనదేశంలో తొలిసారిగా వీటిని తిరుమలలో వినియోగించడం విశేషం. మరోవైపు.. వారాంతం కావడంతో భక్తులతో తిరుమల కిటకిటలాడింది.

వీవీఐటీలో ముగిసిన నేషనల్ ఆర్చరీ ఛాంపియన్ షిప్


వీవీఐటీలో నేషనల్ ఆర్చరీ ఛాంపియన్ షిప్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ విద్యాసాగర్

పెదకాకాని, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి అంతర్జాతీయ సాంకేతిక విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెరుకూరి లెనిన్ వోల్గా మెమోరియల్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీలు శనివారం ఘనంగా ముగిశాయి. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ విజేతలకు బహుమతులు అందించారు. ఈ నెల 26 నుంచి 29 వరకూ నాలుగు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 900 మంది ఆర్చరీ క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-13, అండర్-15 విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీలలో జార్ఖండ్, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారులు అత్యధికంగా మెడల్స్ సాధించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన ఆర్చర్లు ఇండిన్ ఆర్చరీ మినీ సబ్ జూనియర్ టీమ్‌కు ఎంపిక కానున్నారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లడుతూ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్ షిప్‌కు వీవీఐటీ వేదిక కావడం సంతోషంగా ఉందని, ఆర్చరీ వంటి క్రీడల ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. 2030లో ఇండియాలో జరగనున్న పారా ఒలంపిక్స్ టోర్నమెంట్‌లో ఆర్చరీ క్రీడకు ఆంధ్రప్రదేశ్ ప్రాతినిధ్యం ఇవ్వనుందని.. అది వీవీఐటీ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎకోబ్లిస్ ఇండియా సంస్థ సి.ఈ.ఓ ఏ.వి.పి.ఎస్ చక్రవర్తి, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చెరుకూరి సత్యం, వీవీఐటీ డెరెక్టర్ రావెల నవీన్, ఇండియన్ ఆర్చరీ క్రీడాకారుడు కె.వెంకటాద్రి, వీవీఐటీ ఫిజికల్ డైరెక్టర్ ఎన్.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరిలో వైభవంగా ప్రభోత్సవం




నంది వాహనంపై ఉత్సవమూర్తులు

శ్రీశైలం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉగాది మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్ర రథవీధిలో అశేష భక్తజనం మధ్య స్వామి, అమ్మవార్లకు ప్రభోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సుగంధ పుష్పాలు, పరిమళ ద్రవ్యాలతో అలంకరించిన ప్రభపై ఆదిదేవులను కోలాహలంగా ఊరేగించారు. అనంతరం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు నంది వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వగా, మహా సరస్వతి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. పురవీధుల్లో అశేష భక్తజనం నడుమ గ్రామోత్సవం నిర్వహించారు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

బిల్లును త్రీవంగా వ్యతిరేకిస్తున్నాం: ముస్లిం నేతలు


విజయవాడలో జరిగిన ధర్నాలో పాల్గొన్న ముస్లిం నేతలు

విజయవాడ(ధర్నాచౌక్), మార్చి 29(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తులను ఆక్రమించేందుకు రూపొందించిన వక్ఫ్ సవరణ బిల్లు 2024 రాజ్యాంగ విరుద్ధమని, ఈ బిల్లును అడ్డుకోవాలని ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు ఖాలిద్ సైఫుల్లా రెహమాని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో శనివారం మహాధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బిల్లుకు వ్యతిరేకంగా 50 మిలియన్లకు పైగా ముస్లింలు పార్లమెంటరీ సంఘానికి (జేపీసీ)కు ఈ మెయిల్స్ పంపామని తెలిపారు. అఖిల భారత ముస్లిం వ్యక్తిగత చట్ట మండలి ఇతర జాతీయ, రాష్ట్రస్థాయి ముస్లిం సంస్థలతో నాయకులతో కలిసి ఈ బిల్లుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసిందని చెప్పారు. ముస్లిం సమాజంతో ఎటువంటి సంప్రందింపులు లేకుండా వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్తుందని ధ్వజమెత్తారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా ఫజ్లుర్ రహిమ్ ముజద్దీద్ మాట్లాడుతూ వక్ఫ్ పరిరక్షణ ముస్లింల విశ్వాసానికి సంబంధించిన అంశమన్నారు. ఈ బిల్లు వల్ల కలిగే నష్టాలను సీఎం చంద్రబాబుకు వివరిస్తామని తెలిపారు.

ఇద్దరు మావోయిస్టు పార్టీ సభ్యుల అరెస్టు

పాడేరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు నేతలను చింతూరు సబ్ డివిజన్ పరిధిలో శుక్రవారం అరెస్టు చేసినట్టు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను శనివారం ఆయన విలేకరులకు వెల్లడించారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్రం డోకుపదు గ్రామానికి చెందిన మడకం మంగల్ అలియాస్ రమేశ్(35) శబరి దళంలో కమాండర్‌గా పనిచేస్తున్నాడని, అలాగే అదే రాష్ట్రం దబ్బపాదు గ్రామానికి చెందిన మాడివి రమేశ్ అలియాస్ ప్రదీప్(23) దళ సభ్యుడిగా పని చేస్తున్నాడన్నారు. వీరిద్దరినీ చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని తడికవాగు సమీపంలో అరెస్టు చేశామన్నారు. ఇద్దరూ ఆంధ్ర ఒడిశా సరిహద్దుతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల్లో చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడ్డారని, వారిపై నాలుగు చొప్పున కేసులు ఉన్నాయన్నారు. వారి నుంచి ఒక 303 తుపాకీ, ఐదు తూటాలు, రూ.2,400, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) ఎ.జగదీశ్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీలకే రాష్ట్ర ప్రభుత్వ వరాలు: సీపీఎం


నెల్లూరు (వైద్యం), మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అడగకుండానే వరాలు ఇస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ప్రజా సమస్యలపై శనివారం నెల్లూరు కలెక్టరేట్ వద్ద జరిగిన మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. అనేక కార్పొరేట్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం వేల ఎకరాలు ఇస్తోందని, అయితే అక్కడ పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో ఉద్యోగాలు రావడం లేదన్నారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా కార్పొరేట్ కంపెనీలు ఆదుకోలేదని చెప్పారు. అదానీ, అంబానీ వంటి కంపెనీలు బ్యాంకుల్లో తీసుకున్న అప్పులను చెల్లించకపోగా, వారి రూ.8 లక్షల కోట్ల రుణాలను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేయడం దారుణమని మండిపడ్డారు.


SKF
SAJID NADIADWALA'S
SIKANDAR
AN A R MURUGADOSS FILM
RELEASING TODAY
NETFLIX
A PEN MARUDHAR RELEASE
BOOK YOUR TICKETS NOW


RGV DEN PRODUCT
RGV AARVI PRODUCTIONS
4TH APRIL IN THEATRES
FOR HIM NO MEANS YES
రామ్ గోపాల్ వర్మ
శారీ
DIRECTED BY GIRI KRISHNA KAMAL
TELUGU | TAMIL | MALAYALAM


SIVAPARAMATMA CREATIONS
భక్తి జ్ఞాన వైరాగ్యాలే
ప్రధాన అంశంగా
రూపుదిద్దుకున్న చిత్రం
శివాజ్ఞ
SIVA AGNA
ఏప్రిల్ 4 విడుదల
ఆంధ్ర, తెలంగాణాలో 108 థియేటర్లలో
మొదటి రోజు 4 ఆటలు
ఉచిత ప్రదర్శన


ROBBING HEARTS ALL OVER
MYTHRI MOVIE MAKERS
NITHIIN
రాబిన్‌హుడ్
ADVENTUROUS ENTERTAINER COMING YOUR WAY!
ఉగాది శుభాకాంక్షలు


JAU & I STUDIOS
PADMANABHAREDDY PRESENTS
OMG PRODUCTIONS
PHANI
ఫణి | ഫണി | ಫಣಿ | பணி | फणि
విశ్వావసు నామ సంవత్సర
ఉగాది
శుభాకాంక్షలతో
DR. MEENAKSHI ANIPINDI | DR.V.N.ADITYA


SITHARA ENTERTAINMENTS
SRIKARA STUDIOS
FORTUNE FOUR
BLOCK BUSTER MAXX
HOUSEFULLS EVERYWHERE
S.NAGA VAMSI PRESENTS
(MAD)²
#ThisTimeItsMADMAXX
ఉగాది శుభాకాంక్షలు


RAW AND RUSTIC ACTION BLOCK BUSTER
HR PICTURES
NVR CINEMA
ఉగాది శుభాకాంక్షలతో..
తప్పక చూడండి
CHIYAAN VIKRAM
వీర ధీర శూర
PART 2
AN S.U.ARUN KUMAR FILM
G V PRAKASH KUMAR
VEERA DHEERA SOORA

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
ఆదివారం 30 మార్చి 2025



నయనానందవనం

» కొత్త అందాలను దిద్దుకుంటున్న మూలపాడు నగరవనం

10లో



తరలివచ్చె తనే వసంతం

మామిడి లేలేత పూతలు.. వేప పూల వయ్యారాలు.. మల్లె మొగ్గల అందాలు.. గున్నమావి కొమ్మల్లో కోకిలమ్మ కుహుకుహు గానాలు.. మయూర నాట్యాల మైమరపులు.. పడతుల పట్టు పరికిణీలు.. ముంగిట ముచ్చటగొలిపే తోరణాలతో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలకు విజయవాడ ముస్తాబైంది.



టీడీపీ ఆవిర్భావ దినోత్సవం


గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఎంపీ కేశినేని చిన్ని, జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, శ్రీరాం తాతయ్య, నాగుల్‌మీరా పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

8లో

బెట్టింగ్‌ల బుకింగ్

అవనిగడ్డ కేంద్రంగా జిల్లాలో బెట్టింగ్‌లు

టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించిన బెట్టింగ్ మూలాల్లో ఉన్న పీపీ ఎవరు? వైసీపీ నేత కుమారుడు పవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకోగానే ఆ పీపీ పారిపోయాడా? కృష్ణాజిల్లాలో బెట్టింగ్ నిర్వహణ కోసం సదరు పీపీనే వలను అల్లాడా? ఈ వల అవనిగడ్డ, పెడన మధ్య ఉందా? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి.



పటమట స్థావరంలోనూ జోరుగా..

- పెడనకు చెందిన పీపీ కీలక పాత్రధారి
- అనుచర బుకీగా వైసీపీ నేత కుమారుడు
- పవన్‌తో పాటు మరో నలుగురి అరెస్టు
- ముందస్తు సమాచారంతో పరారైన 'పీపీ'
- నిందితుల ఖాతాల్లో రూ.48 లక్షల నిల్వ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పటమటలో బెట్టింగ్ నిర్వహిస్తున్న అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి కుమారుడు పవన్ కుమార్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అతడితో పాటు పెడనకు చెందిన కోట నాగేశ్వరరావు, కృష్ణలంకకు చెందిన ఉమామహేశ్వరరావు, అవనిగడ్డకు చెందిన చెన్నా గోపయ్యస్వామి, కమ్మిలి వెంకటరమణను అరెస్టు చేసి శనివారం పటమట పోలీసులకు అప్పగించారు. మొత్తం వారి ఖాతాల్లో రూ.48 లక్షలు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. పవన్‌కుమార్ ఖాతాలోనే రూ.43 లక్షల వరకు ఉన్నట్టు నిర్ధారించారు.

పీపీ అంటే..

పవన్‌కుమార్ ఫోన్‌ను పోలీసులు విశ్లేషించినప్పుడు అందులో పీపీ పేరుతో ఓ నెంబర్ ఉంది. దాని పూర్తి వివరాలు తీయగా, పెడనకు చెందిన ప్రసాద్ అనే యువకుడి నెంబరుగా గుర్తించారు. పవన్‌కుమార్‌ను వెంటబెట్టుకుని వెళ్లిన పోలీసులు అవనిగడ్డలో జరుగుతున్న బెట్టింగ్ డెన్‌ను గుర్తించారు. పెడనకు చెందిన ఈ ప్రసాద్ అవనిగడ్డలో ఇళ్లు అద్దెకు తీసుకుని బెట్టింగ్ బాగోతాన్ని నిర్వహిస్తున్నాడు. అవనిగడ్డ, చల్లపల్లి, పెడన, రేపల్లె, హైదరాబాద్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. ప్రసాద్ ప్రధాన బుకీగా మిగతా 8లో..

ప్రత్యేకంగా జాయింట్ అకౌంట్

పవన్‌కుమార్, ప్రసాద్‌లు బెట్టింగ్‌లో నగదు లావాదేవీల కోసం ప్రత్యేకంగా ఓ జాయింట్ అకౌంట్ నిర్వహిస్తున్నారు. బెట్టింగ్‌లో ప్లంటర్లు ఎంతెంత మొత్తంలో బెట్టింగ్ పెట్టారు, ఎంత మొత్తంలో పందెం గెలిచిన వారికి ఇచ్చారు.. అనే వివరాల్లో పారదర్శకత కోసం ఈ అకౌంట్‌ను నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఆన్‌లైన్‌లో డబ్బు పంపే వారికి ఈ అకౌంట్ నెంబరును ఇచ్చారు. కలెక్షన్ ఏజెంట్లుగా ఉన్న వెంకటరమణ, నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావులు వసూలు చేసిన డబ్బును పవన్‌కుమార్ ఇస్తారు. అతడు ఆ డబ్బును జాయింట్ అకౌంట్లో జమ చేస్తాడు. టీస్టాళ్లు, కిళ్లీకొట్లు, కాఫీ కేఫ్‌లను వారు కలెక్షన్ పాయింట్లుగా పెట్టుకున్నారు. డబ్బు ఇవ్వాల్సిన వ్యక్తి వాహనం నెంబరు, ఇవ్వాల్సిన మొత్తం ప్రసాద్, పవన్‌కుమార్ కలెక్షన్ ఏజెంట్లకు చెబుతారు. వారు ఆయా ప్రాంతాలకు వెళ్లి చెప్పిన నెంబరు కలిగిన వాహనం రాగానే డబ్బు వసూలు చేసుకోవాలి. వైసీపీ ఐదేళ్లకాలంలో పీపీ, పవన్‌కుమార్‌లు తమకు ఎదురు లేకుండా బెట్టింగ్‌లు నిర్వహించారు. పోలీసులకు చిక్కడానికి ముందు పవన్‌కుమార్ రూ.32 లక్షలను ఓ వ్యక్తికి బదిలీ చేశాడు. బెట్టింగ్‌లో అవతలి వ్యక్తి గెలవడంతో ఆ డబ్బు పంపినట్టు సమాచారం.


పాస్టర్ ప్రవీణ్ హత్య కేసు..

నగరంలో దర్యాప్తు

రాజమండ్రి నుంచి వచ్చిన పోలీసులు

సీసీ కెమెరాల పరిశీలన ● ఆ నాలుగు గంటలు ఎక్కడున్నారని కూపీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతి కేసులో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. ఈ కేసుకు బెజవాడతో లింక్ కలిసింది. హైదరాబాద్ నుంచి బయల్దేరిన ప్రవీణ్‌కుమార్ నగరంలో మూడు, నాలుగు గంటల పాటు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఇదే విషయాన్ని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ వెల్లడించారు. ఈనెల 24న హైదరాబాద్ నుంచి బయల్దేరిన ప్రవీణ్‌కుమార్ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలో అనుమానాస్పదంగా మరణించిన విషయం తెలిసిందే. ప్రవీణ్‌కుమార్‌ది కచ్చితంగా హత్యేనని క్రైస్తవ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు రాజమహేంద్రవరం కేంద్రంగా సాగిన దర్యాప్తు ఇప్పుడు నగరానికి మారింది. అక్కడి నుంచి పోలీసు బృందాలు నగరానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నాయి. ఎంజీ రోడ్డులోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీసీ కెమెరాల ఫుటేజీలను వారు పరిశీలిస్తున్నారు.



ఆ మూడు, నాలుగు గంటలు ఎక్కడున్నారు?

హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై బయల్దేరిన ప్రవీణ్‌కుమార్ నగరంలో మూడు, నాలుగు గంటలు ఎక్కడున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. హైదరాబాద్ కేంద్రంగా సొంతంగా మినిస్ట్రీని నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్‌కు నగరంలో బంధువర్గం లేదని అతని సన్నిహితులు చెబుతున్నారు. సాధారణంగా వివిధ మినిస్ట్రీలు నిర్వహించే సువార్త మహాసభలకు వేర్వేరు మినిస్ట్రీలకు చెందిన పాస్టర్లను ప్రసంగీకులుగా ఆహ్వానిస్తారు. ప్రవీణ్‌కుమార్ నగరంలో నిర్వహించిన సువార్త మహాసభల్లో ఇప్పటి వరకు పాల్గొనలేదని మిగతా 8లో..

జిల్లాను అగ్రభాగంలో నిలుపుదాం..

● జిల్లా సమీక్షా సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్. చిత్రంలో ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, కొలికపూడి శ్రీనివాస్, గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, శ్రీరాంతాతయ్య, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

8లో

కోల్డ్ స్టోరేజీ సమస్య కొలిక్కి

యాజమాన్యం, రైతులతో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చర్చలు

మార్కెట్ ధర చెల్లించేందుకు యాజమాన్యం సూత్రప్రాయంగా అంగీకారం

జగ్గయ్యపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన సాయి తిరుమలగిరి కోల్డ్ స్టోరేజీ రైతులను ఆదుకునేందుకు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చొరవ తీసుకున్నారు. శనివారం రాత్రి జగ్గయ్యపేట మార్కెట్ యార్డులో కంపెనీ యాజమాన్యం, రైతులతో జరిపిన చర్చలు సఫలీకృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జగ్గయ్యపేట తహసీల్దార్ మనోహర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు, ఏఎంసీ మిగతా 8లో..

విజయ పాల ధర పెంపు!

7 కేటగిరీల్లో లీటర్‌కు రూ.2 చొప్పున వద్దన

- హూమోజినైజ్డ్ ఫుల్ క్రీమ్ మిల్క్ మాత్రం రూ.4 పెంపు
- ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి..
- కృష్ణామిల్క్ యూనియన్ నిర్ణయం!

చిట్టినగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విజయ పాల ధరను పెంచుతూ కృష్ణామిల్క్ యూనియన్ (విజయా డెయిరీ) నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. పెరిగిన ధరలు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. విజయ డెయిరీ 7 కేటగిరీల్లో పాలను ఉత్పత్తి చేస్తోంది. గోల్డ్ పాల ధర ప్రస్తుతం లీటరు రూ.74 ఉండగా తాజాగా పెరిగిన ధరతో రూ.76 కానుంది. ఫుల్ క్రీమ్ లీటరు రూ.72 నుంచి 74, స్టాండర్డ్ రూ.62 నుంచి 64, టోన్డ్ పాల ధర రూ.58 నుంచి 60, డబుల్ టోన్డ్ రూ.54 నుంచి 56 పెంచారు. అలాగే హూమోజినైజ్డ్ ఫుల్ క్రీమ్ మిల్క్ లీటరు రూ.68 నుంచి 72, టీమేట్ రూ.68 నుంచి 70 పెరగనుంది. ఆవుపాలు లీటరు రూ.54 నుంచి 56, టోన్డ్ మిల్క్ పెరుగు ప్యాకెట్(450 గ్రాములు) రూ.32 నుంచి 33, టోన్డ్ మిల్క్ పెరుగు ప్యాకెట్ (900గ్రాములు) రూ.62 నుంచి 64 పెంచారు. దేశంలోని అన్ని యూనియన్‌లు ధరలను పెంచాయని, పాల ఉత్పత్తి తగ్గడం, పౌండర్, బటర్ ధరలు పెరగటంతో ధరలు పెంచకతప్ప లేదని యాజమాన్యం చెబుతోంది. పెరిగిన ధరలు ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి రానున్నాయి. నెలవారీ పాలకార్డు కొనుగోలు చేసిన వారికి ఏప్రిల్ 8 వరకు పాత ధరలే వర్తిస్తాయని తెలిసింది.



ఎన్టీఆర్ జిల్లాను అగ్రభాగంలో నిలుపుదాం

- జిల్లా సమీక్షా సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్



జిల్లా అభివృద్ధిపై వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ లక్ష్మీశ ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం తాతయ్య, కొలికపూడి శ్రీనివాసరావు, విప్ తంగిరాల సౌమ్య

ఇబ్రహీంపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): 'ఎన్టీఆర్ జిల్లాలో సముద్ర తీరం తప్ప అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు అనుకూలమైన అన్ని వనరులు ఉన్నాయి. అధికారులంతా సమన్వయంతో, చిత్తశుద్ధితో పనిచేస్తే తలసరి ఆదాయంలో ఇప్పుడున్న మూడో స్థానం నుంచి అగ్రస్థానంలో జిల్లాను నిలపొచ్చు.' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కొండపల్లి ఖిల్లాపై శనివారం నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు సాయం అందుతోందన్నారు. రూ.27 వేల కోట్ల రైల్వేలైన్ పనులు, రూ.3 లక్షల కోట్లతో హైవే రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. 2047 వరకు ఏటా 15 శాతం వృద్ధి రేటు టార్గెట్‌గా పెట్టుకోవాలని అందుకు ప్రతి అధికారి పూర్తి సహకారం అందించాలని కోరారు. అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఖిల్లాపై జైలును పర్యాటక ప్రాంతంగా మార్చాలి

కొండపల్లి ఖిల్లాపై జైలును అండమాన్ జైలులా పర్యాటక ప్రాంతంలా మార్చాలని అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. కొండపల్లి కోటకు వచ్చే అప్రోచ్ రోడ్డు దిగువ భాగంలో బూడిద లారీలు తిరుగుతున్నందున దాన్ని ఎన్టీటీపీఎస్ అధికారులతో మాట్లాడి సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తామన్నారు. సూర్యఘర్ పథకానికి 80 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని 1,000 మందే ఇన్‌స్టాలేషన్ చేసుకున్నారని విద్యుత్‌శాఖ అధికారులు చెప్పడంతో మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఎంఎఫ్‌బీవైపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో 1.4 లక్షల మంది రైతులుంటే 3,187 మందికే బీమా ప్రీమియం చెల్లించడం ఏమిటని ప్రశ్నించారు. పలుచోట్ల ఆర్వోబీలు, ఆర్‌యూబీలపై రైల్వే అధికారులు, విద్యుత్‌శాఖ అధికారుల మధ్య సమన్వయలోపం ఉందని దాన్ని సరి చేసుకోవాలని సూచించారు.

టూరిజం హబ్‌గా జిల్లాను తీర్చిదిద్దుతాం: కలెక్టర్ లక్ష్మీశ

జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలు చూసేలా టూరిజం ప్యాక్‌ను తయారు చేస్తున్నామన్నారు. విజయవాడలో ఇప్పుడున్న ఫుడ్ కోర్టుతో పాటు మరో మూడు చోట్ల ఫుడ్ కోర్టుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. సితార సెంటర్‌లో రూ.2 కోట్లతో ఒకదాని పనులు ప్రారంభించామన్నారు. ప్రభుత్వాస్పత్రి వద్ద, బెంజ్ సర్కిల్ వద్ద ఫుడ్ కోర్టులు పెడతామన్నారు. గత ప్రభుత్వ హయంలో జి.కొండూరు మండలం సున్నంపాడు గ్రామంలో 230 ఎకరాలను పీఎంసీ లబ్ధిదారులకు నివేశన స్థలాలుగా ఇచ్చేందుకు కేటాయిస్తే అక్కడకు ఎవ్వరూ వెళ్లలేదని, అది నిరుపయోగంగా ఉందని దాన్ని పారిశ్రామిక హబ్‌గా మారుస్తామని అన్నారు.

ప్రజా సమస్యల కంటే వైసీపీకి రాజకీయమే ముఖ్యమా

ఏపీఐసీసీ కాలనీలో 488 కుటుంబాలు ఉంటున్నాయి. 2,500 మంది నివాసం ఉంటున్నారు. వారికి మంచినీరు ఇచ్చే పనులకు కౌన్సిల్‌లో బలం ఉందని వైసీపీ వాళ్లు అడ్డుపడ్డారు. దాన్ని ప్రభుత్వం రద్దు చేసే అవకాశం ఉంది. ప్రజా సమస్యల కంటే వైసీపీకి రాజకీయమే ముఖ్యమా? ఇప్పటికే మంత్రి నారాయణతో, ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడా. ఈవేసవిలో ఆ కాలనీకి మంచినీరు అందించేలా చూడాలి. కోతులు పట్టే వారిని పంపిస్తే నా సొంత నిధులుస్తా. గుణదల మేరీమాత ఆలయానికి వచ్చే భక్తుల కోసం బస్టాండ్, రైల్వే స్టేషన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు బస్సులు అధిక సంఖ్యలో తిప్పాలి. రాణిగారితోట వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున అక్కడ సబ్‌వేల నిర్మాణంలో అధికారులు చొరవ తీసుకోవాలి. మొగల్రాజపురంలో సీఎస్ఐ స్కూల్‌ను తక్షణం తెరిపించాలి. - ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

టిడ్కో ఇళ్ల వ్యవహారం త్వరగా తేల్చాలి

టిడ్కో ఇళ్ల వ్యవహారాన్ని త్వరగా తేల్చాలి. ప్రభుత్వమే లబ్ధిదారుల వడ్డీని భరించాలి. జక్కంపూడిలో పేదలకు నివేశనా స్థలాల ఇవ్వాలి. అంబేడ్కర్ స్మృతి వనం వద్ద రైతుబజారు ఏర్పాటు చేయాలి.

- ఎమ్మెల్యే బొండా ఉమా

అనాసాగరం ఎన్‌హెచ్ బాధితులకు న్యాయం చేయాలి

అనాసాగరం ఎన్‌హెచ్ కింద భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాలి. నందిగామ ప్రభుత్వాస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు పెంచడం సంతోషంగా ఉంది.

- ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

రైతుల్ని ఆదుకోవాలి

మునేరు, పాలేరు వరదల వల్ల నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి. గండ్లు పూడ్చాలి. ఎకరంలో మేట వేసిన ఇసుకను తొలగించేందుకు లక్షల్లో ఖర్చవుతోంది. దాన్ని వేరే అవసరాలకు మళ్లిస్తే ఆదాయంతో పాటు ప్రభుత్వానికి ఖర్చు కలిసి వస్తుంది. జగ్గయ్యపేట నగరవనం (వేదాద్రి), ముక్త్యాల అతిథిగృహాన్ని వినియోగంలోకి తేవాలి. బోట్ షికారును అభివృద్ధి చేయాలి. జగ్గయ్యపేటలో 586 ఎకరాల సీలింగ్ ల్యాండ్ సమస్యను పరిష్కరించాలి. - ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

రామచంద్రాపురం వద్ద రహదారి సమస్య పరిష్కరించాలి

ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం వద్ద రహదారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి. ప్రభుత్వ పనులకు గ్రావెల్ దొరకని పరిస్థితి ఉంది. గ్రావెల్ సమస్యకు పరిష్కారం చూపాలి. ఎ.కొండూరుకు త్వరితగతిన మంచినీరు అందేలా చూడాలి.

-ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



శాంతినగర్ - కవులూరు గ్రామాల మధ్య వినియోగంలోకి రాని కొత్త వంతెన



కొండపల్లి-ఈలప్రోలు గ్రామాల మధ్య అసంపూర్తిగా మిగిలిపోయిన హైలెవల్ వంతెన

ఇంకెన్నాళ్లు!

బీడీసీపై 2014-19 మధ్య వంతెనల నిర్మాణం ప్రారంభం

- ఇప్పటికీ అసంపూర్తిగానే వంతెనలు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- రెండు చోట్ల శిథిలావస్థలో ఉన్న వంతెనలే దిక్కు
- అవీ ఎప్పుడు కూలతాయో తెలియని పరిస్థితి
- ఐదేళ్లలో అప్రోచ్ రోడ్లు వేయలేకపోయిన వైసీపీ
- కూటమి ప్రభుత్వమైనా పట్టించుకోవాలని వేడుకోలు



కవులూరు - కట్టుబడిపాలెం వద్ద అప్రోచ్ రోడ్డు లేని హైలెవల్ వంతెన

ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి: బుడమేరు డైవర్షన్ చానెల్ (బీడీసీ)పై మూడు చోట్ల వంతెనలు అసంపూర్తిగా ఉన్నాయి. ఇంకా ఎన్నాళ్లు అవస్థలు పడాలని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.22 కోట్లతో శాంతినగర్-కవులూరు, కొండపల్లి-ఈలప్రోలు గ్రామాల మధ్య శిథిలావస్థల్లో ఉన్న వంతెనల పక్కన, కవులూరు-కట్టుబడిపాలెం మధ్య పాత వంతెన స్థానంలో హైలెవెల్ వంతెనలు నిర్మించారు. కవులూరు-కట్టుబడిపాలెం వద్ద తాత్కాలిక అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేసి దాన్ని ఉపయోగంలోకి తెచ్చారు. మిగిలిన రెండు చోట్ల ఉన్న వంతెనలకు అప్రోచ్ రోడ్లు వేయలేదు. అక్కడ ఉన్న పాత వంతెనలపైనే ఇప్పటికీ రాకపోకలు సాగిస్తున్నారు. బీడీసీకి గండ్లు పడినప్పుడు కవులూరు-శాంతినగర్ వంతెనకు తాత్కాలికంగా అప్రోచ్ రోడ్డు పోశారు. ఇక కొండపల్లి-ఈలప్రోలు గ్రామాల మధ్య ఉన్న హైలెవల్ వంతెనకు ఇప్పటికీ చెవికట్లు కట్టలేదు. ఆ ప్రదేశంలో ముళ్లపొదలు మొలిచాయి. ఇప్పటికైనా అధికారులు, నేతలు స్పందించి అసంపూర్తిగా ఉన్న హైలెవల్ వంతెనలను ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఎప్పుడు కూలుతుందో తెలియదు



కొండపల్లి-ఈలప్రోలు పాత వంతెన ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. కొత్త వంతెనను అందుబాటులోకి తేవాలి. అసంపూర్తి పనులు పూర్తి చేయాలి. రైతులందరికీ ఎంతో ఉపయోకరమైన వంతెన ఇది. సత్వరమే పనులు ప్రారంభించి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేసి వినియోగంలోకి తేవాలి.

- వల్లూరి కిషోర్ కుమార్, ఈలప్రోలు

గత ప్రభుత్వం పనులు ఆపేసింది



నిత్యం పనుల నిమిత్తం ఈలప్రోలు నుంచి కొండపల్లికి రైతులు, సాధారణ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పాత వంతెన పడిపోయే వరకు పట్టించుకోరా? గత ప్రభుత్వం పూర్తిగా పనులు ఆపేసింది. ఐదేళ్లుగా ఎదురు చూస్తున్నాం. త్వరగా వంతెన అసంపూర్తి పనులు పూర్తి చేయాలి.

- దారపనేని సాంబశివరావు, ఈలప్రోలు

అంచనాలు సిద్ధం చేశాం

వంతెనల అప్రోచ్ రోడ్లలకు పోలవరం కట్టలపై మట్టి వాడుకునే అవకాశం లేదు. కోర్టులో వ్యవహారం ఉన్నందున బయట మట్టితోనే అప్రోచ్ రోడ్లు వేయాలి. ఇందుకు సుమారు రూ.కోటి వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు వస్తే పనులు ప్రారంభిస్తాం.

-కౌశిక్, బీడీసీ జేఈ

బోర్డర్ దాటుతున్న ఇసుక

- తిరువూరు మీదుగా తెలంగాణకు రోజుకు 15 నుంచి 20 టిప్పర్లలో తరలింపు



తిరువూరు బైపాస్ రోడ్డులో నిలిపి ఉంచిన ఇసుక టిప్పర్లు

(తిరువూరు-ఆంధ్రజ్యోతి): తిరువూరు మీదుగా తెలంగాణ ప్రాంతానికి యథేచ్ఛగా రోజుకు 15 నుంచి 20 టిప్పర్లు ఇసుకను అనధికారికంగా తరలించుకుపోతున్నాయి. అయినా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. కంచికచర్ల, నందిగామ ఇసుక రీచ్‌ల నుంచి టిప్పరుకు 40 టన్నుల ఇసుక లోడు చేసుకుని ఉదయానికి ఎ.కొండూరు ప్రాంతంలోని ఖాళీ స్థలంలో కొన్ని, తిరువూరు బైపాస్‌రోడ్డులోని స్థలంలోకి కొన్ని చేరుకుంటాయి. తిరువూరు ప్రాంతంలో ఈ టిప్పర్లను నిర్వహించే వ్యక్తి తెలంగాణలో ఇసుక ఎవరికి అవసరమో తెలుసుకుని, సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకుని వస్తాడని, సాయంత్రానికి కొందరు వ్యక్తులు ఖాకీ దుస్తులు ధరించి, ప్రైవేటు వాహనంలో బోర్డర్ వద్ద రెక్కీ నిర్వహించి, ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక టిప్పర్ల వద్ద ఉండే వ్యక్తికి సమాచారం అందిస్తారని, తర్వాతే ఈ టిప్పర్లు బోర్డర్ దాటి తెలంగాణలోకి వెళుతుంటాయని కొందరు చెబుతున్నారు. ఆంధ్ర ప్రాంత టాక్సీ ప్లేటు వాహనాలు తెలంగాణలోకి ప్రవేశించేందుకు టెంపరరీ పర్మిట్ తీసుకోవాలి. కానీ, ఈ టిప్పర్లకు అనుమతులు లేకుండానే నేరుగా బోర్డర్ దాటుతున్నాయి. పట్టణ శివారులోని ఆంధ్ర-తెలంగాణ బోర్డర్ చెక్‌పోస్టు వద్ద పోలీసు సిబ్బంది లేకపోవడం, గతంలో బైపాస్‌రోడ్డులో ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టు తొలగించడంతో, అనధికార రవాణాకు అడ్డంకి లేకుండా పోతోంది. కొన్నిసార్లు పగలే ఇసుక టిప్పర్లు తెలంగాణ ప్రాంతానికి తరలి వెళుతున్నాయి.

అనధికార రవాణా చేస్తే పీడీ యాక్టు పెడతాం

ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రవాణాదారులపై పీడీ యాక్టు పెడతాం. ఇప్పటి వరకు 7 టిప్పర్లను స్వాధీనం చేసుకున్నాం. బోర్డర్ వద్ద ప్రత్యేక నిఘా పెడతాం.

-కేవీజీవీ సత్యనారాయణ, పట్టణం సెక్టార్-1 ఎస్సై

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, బూరగడ్డ వేదవ్యాస్ తదితరులు

వన్‌టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమనాథ్, పలువురు నాయకులతో కలిసి పార్టీ జెండాను నెట్టెం ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. టీడీపీ ఆవిర్భావం తెలుగు సమాజంలో సామాజిక విప్లవాన్ని రగిల్చిందన్నారు. నారా లోకేశ్ ఆధ్వర్యంలో పార్టీకి ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. లుక్కా సాయిరామ్ ప్రసాద్ గౌడ్, కొత్త నాగేంద్ర కుమార్(నాగబాబు), ఎస్.శివరామప్రసాద్‌గౌడ్, చెన్నుపాటి ఉషారాణి, వల్లూరి ఉషారాణి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భవన్‌లో..

గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, శ్రీరాం తాతయ్య పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ జెండాను ఎగురవేశారు. 43 ఏళ్ల క్రితం టీడీపీ స్థాపనతో రాజకీయ ఉద్యమం మొదలైందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా ఎన్నో అవకాశాలు కల్పించిందన్నారు. పార్టీకి బలం, బలగం కార్యకర్తలే అన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం సీఎం చంద్రబాబు నాయకత్వంలో అందరం కలిసి పనిచేస్తున్నామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 120 మందికి పైగా సీనియర్ కార్యకర్తలను ఎంపీ కేశినేని చిన్ని సన్మానించారు.

లింగగూడెంలో క్షుద్రపూజలు

- భీమవరం రోడ్డులోని మూడు రోడ్ల కూడలిలో బొమ్మలు గీసి, పసుపు కుంకుమ చల్లి, రాళ్లుపెట్టిన ఆగంతకులు
- తరచూ గ్రామంలో క్షుద్రపూజలు చేస్తున్నారంటున్న గ్రామస్థులు
- పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్న రైతులు, కూలీలు



లింగగూడెంలోని భీమవరం రోడ్డులో ఆగంతకులు వదిలి వెళ్లిన పసుపు, కుంకుమ ఇతర వస్తువులు

పెనుగంచిప్రోలు (జగ్గయ్యపేట), మార్చి 29(ఆంధ్రజ్యోతి): పెనుగంచిప్రోలు మండలం లింగగూడెం గ్రామస్థులు క్షుద్రపూజల భయంతో వణికి పోతున్నారు. కొద్ది రోజులుగా భీమవరం రోడ్డులోని మూడు రోడ్ల కూడలిలో పూజలు చేస్తున్నట్టు గ్రామస్థులు చెబుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి అమావాస్య కావటంతో మంత్రగాళ్లు పూజ లు చేశారని పలువురు చెబుతున్నారు. రెండు బొమ్మలు గీసి, పసుపు కుంకుమలు చల్లి, రాళ్లు పెట్టి ఉన్నాయి. రాత్రి మొక్కజొన్న చేలకు నీళ్లు పెట్టేందుకు వెళ్లిన రైతులను చూసి ఆగంతకులు కారులో భీమవరం రోడ్డులోకి పరారయ్యారని చెబుతున్నారు. అర్ధరాత్రి 2-3 గంటల మధ్య ఇటీవల కాలంలో అమావాస్య తిథుల్లో పూజలు చేస్తున్నారని గ్రామస్థు లు చెబుతున్నారు. ఉపాధి పనులకు వెళ్లే కూలీలు ఆ రోడ్డులోకి వెళ్లాలంటే భయపడిపోతున్నారు. ఇటీవల పెనుగంచిప్రోలు మండలంలో అన్ని గ్రామాల్లో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ఆ గంతకుల సమాచారం తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా యి. తరచూ గ్రామంలోని పెనుగంచిప్రోలు రోడ్డులో గండెవాగు వద్ద, లింగగూడెం బస్టాప్ వద్ద రోడ్డులో కోళ్లు కోస్తున్నారని, కోడిగుడ్లు, కుంకుమ ముద్దలు వేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. పెనుగంచిప్రోలు ఎస్సై అర్జున్‌న వివరణ కోరగా ఈ ఘటన కొద్ది రోజుల క్రితం జరిగినట్టు తెలుస్తోందని విచారణ చేస్తామని తెలిపారు.

బెట్టింగ్‌ల బుకింగ్

(7వ పేజీ తరువాయి)

వ్యవహరిస్తుండగా, పవన్‌కుమార్ ద్వితీయశ్రేణి బుకీ. ప్రసాద్ అవనిగడ్డలోని ఓ భవనం మొదటి, రెండు అంతస్తులను, పెంట్‌హౌస్‌ను అద్దెకు తీసుకుని బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. ఇక్కడ అద్దెలు తక్కువగా ఉండటంతో ఆ ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నాడని తెలుస్తోంది. ఒక్కో ఇంటికి రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు అద్దె చెల్లిస్తున్నాడు. ప్రసాద్, పవన్‌కుమార్‌లు.. పార్కర్ ఎక్స్ఛేంజ్ యాప్ ద్వారా ఒక్కో మ్యాచ్‌పై 100 నుంచి 200 మందితో బెట్టింగ్ కట్టిస్తున్నట్టు పోలీసులు నిర్ధారించారు. కాగా, పెడనకు చెందిన కోట నాగేశ్వరరావు పెనమలూరులో ఎమ్మెల్యే కార్యాలయం వీధిలో అద్దెకు ఉంటున్నాడు. పవన్‌కుమార్ ద్వారా నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడిని పెడనకు తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ప్రసాద్ అక్కడి నుంచి పరారయ్యాడు. అవనిగడ్డకు చెందిన గోపయ్యస్వామి తక్కువ మొత్తంలో బెట్టింగ్‌లు కట్టిస్తున్నాడని తేలింది. వెంకటరమణ, నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావులు ప్రసాద్, పవన్‌కుమార్‌కు కలెక్షన్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు.

కోల్డ్ స్టోరేజీ సమస్య కొలిక్కి

(7వ పేజీ తరువాయి)

కార్యదర్శి ఎన్వీ నరసింహారావు సమక్షంలో కోల్డ్ స్టోరేజీ తరఫున హరి నరసింహారావు, పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులతో చర్చలు జరిపారు. తొలుత రైతులు మాట్లాడుతూ తాము కోల్డ్ స్టోరేజీలో పంటలు ఉంచిన సమయంలో ఉన్న మార్కెట్ ధర చెల్లించాలని కోరగా, మరికొంత మంది ధర పెరిగినందున ప్రస్తుత మార్కెట్ ధర చెల్లించాలని ప్రతిపాదించారు. సరాసరి ధర చెల్లించటం వల్ల మెజారిటీ రైతులకు మేలు జరుగుతుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. తేజా రకానికి అత్యధికంగా, తాలు రకానికి తక్కువ ధర చెల్లించేలా అంగీకారం కుదిరింది. ఎక్నాలెడ్జ్‌మెంట్ స్లిప్‌ల ఆధారంగా రైతులు తీసుకున్న రుణాలు పోను తుది మొత్తాన్ని లెక్క తేల్చాక ఎప్పుడు చెల్లించాలనే విషయమై స్పష్టత ఇస్తామని యాజమాన్య ప్రతినిధి చెప్పారు.

పాస్టర్ ప్రవీణ్ హత్య కేసు..నగరంలో దర్యాప్తు

(7వ పేజీ తరువాయి)

చెబుతున్నారు. మినిస్ట్రీల ద్వారా ఇక్కడున్న కొంతమంది పాస్టర్లతో ప్రవీణ్‌కు సన్నిహిత సంబంధాలు ఏర్పడినట్టు చెబుతున్నారు. ఈనెల 24 ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై బయల్దేరిన ఆయన ఇక్కడికి వచ్చేసరికి అలసిపోయి స్నేహితులు ఇళ్లలో విశ్రాంతి తీసుకోవడానికి ఆగారా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రవీణ్ ఫోన్ నెంబర్ ఆధారంగా విచారణ చేస్తున్నట్టు తెలిసింది.

అక్రమాల అటెండర్

- ఆర్టీసీ హై ఎండ్ బస్సుల్లో అటెండర్ల కోసం టెండర్లు
- టెండర్లలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆర్టీసీ ఎండీ, ఉన్నాతాధికారులకు కాంట్రాక్టర్ ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)కి చెందిన హై ఎండ్ బస్సులలో అటెండర్ల కోసం పిలిచిన టెండర్లపై వివాదం నెలకొంది. సిండికేట్ల ప్రయోజనాల కోసం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న ఆరోపణలు వచ్చాయి. టెండర్లలో పాలు పంచుకున్న ఒక కాంట్రాక్టర్ టెండర్లు లోపభూయిష్టంగా జరిగాయని ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో కొంతమంది ఆర్టీసీ అధికారుల ప్రయోజనాలు కూడా దాగున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. ఆర్టీసీ ఎన్టీఆర్ రీజియన్ పరిధిలోని విజయవాడ డిపోలో ఇటీవల హై ఎండ్ బస్సులైన అమరావతి, డాల్ఫిన్ క్రూస్, వెన్నెల స్లీపర్, ఇంద్ర బస్సుల్లో అటెండర్ల కోసం టెండర్లను పిలిచారు. మొత్తం 86 మంది అన్‌స్కిల్డ్ అటెండర్లు, 4 సెమీ స్కిల్డ్ సూపర్‌వైజర్లు, 2 స్కిల్డ్ టీవీ టెక్నీషియన్ల కోసం ఏజెన్సీల నుంచి టెండర్లను ఆహ్వానించారు. వీరు హై ఎండ్ బస్సుల్లో ఆడియో, వీడియోలను ఆపరేట్ చేయడం, ఆర్టీసీ సరఫరా చేసే మినరల్ బాటిల్స్, చాక్లెట్లు, దుప్పట్లు, న్యూస్ పేపర్లను ఉచితంగా ప్రయాణికులకు సరఫరా చేయటంతో పాటు దీనికి సంబంధించిన ఖాతాలను నిర్వహించాలి. ప్రయాణికుల కోరిక మేరకు వారి లగేజీని బస్సులో భద్రపరచటం, బస్సు నుంచి దించటం, పాసింజర్ల లగేజీని గుర్తించటానికి ఐడెంటిఫికేషన్ కార్డులను ఉపయోగించటం, స్నాక్స్ కూల్‌డ్రింక్స్‌ను ఎంఆర్‌పీ రేటుకు విక్రయించటం, శుభ్రపరిచిన ఊలు దుప్పట్లను ప్రయాణికులకు అందించటం, వారానికి ఒకసారి ఉతికిన కర్టెన్లను బస్సులో ఏర్పాటు చేయటం, బస్సు బయలుదేరే ముందు, వచ్చిన తర్వాత సీట్లలో దుమ్మును దులిపి బాడీ, అద్దాలు, లోపల ఫ్లోరింగ్‌లను తడిగుడ్డతో తుడిచి పొడిగుడ్డతో తుడవటం, ఎయిర్‌ఫ్రెషనర్స్ ఉపయోగించటం, బస్సుల్లో డీవీడీ ఆడియో-వీడియో సిస్టమ్స్‌ను నిర్వహించటం, వాటికి రిపేర్లు వస్తే బాగు చేయించటం వంటి విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రైవేటు ఏజెన్సీ కోసం ఆర్టీసీ విజయవాడ డిపో అధికారులు టెండర్లు పిలిచారు. టెండర్లలో 49 బిడ్లు నిలిచాయి. వీటిలో 7 నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని పక్కన పెట్టారు. 42 అర్హత సాధించాయి. పక్కన పెట్టిన 7లో 3 బిడ్లను మళ్లీ తీసి కలిపారు. మొత్తం 45 బిడ్లను అర్హమైనవిగా తేల్చారు.

గత వైసీపీ ప్రభుత్వం నుంచి పాతుకుపోయిన సిండికేట్

వీటిలో కిందటి వైసీపీ ప్రభుత్వం నుంచి పాతుకుపోయిన కాంట్రాక్టర్ల సిండికేట్ కూడా ఉందని తెలుస్తోంది. అదే పాత సిండికేట్‌కే టెండర్లు రావటం వివాదానికి దారితీసింది. సిండికేట్ కాంట్రాక్టర్లు వేర్వేరు పేర్లతో బహుళ టెండర్లు వేశాయని కొందరు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు సిండికేట్ ప్రయోజనాలను కాపాడారని విమర్శించారు.

సమగ్ర విచారణ జరపాలి

అటెండర్ల టెండర్లలో జరిగిన లోపాలపై ఆర్టీసీ ఎండీ, విజయవాడ ఈడీ, ఆర్టీసీ ఆర్‌ఎం, టెండర్ కమిటీకి వై.శ్రీనివాస్ అనే కాంట్రాక్టర్ ఫిర్యాదు చేశారు. టెండర్లు పిలిచినప్పటి నుంచి కాంట్రాక్టర్ల ప్రయోజనం కోసం ఆర్టీసీ అధికారులు అనేక సవరణలు ఇచ్చారని ఆరోపించారు. తాము టెండర్ ఫారాన్ని రూ.5,900కు కొనుగోలు చేశామని, ఆ తర్వాత సిండికేట్ ప్రయోజనాల కోసం రూ.1770కు తగ్గించారన్నారు. సిండికేట్ వేర్వేరు పేర్లతో లెక్కకు మించి వేయటం వల్ల రూ.5,900 ధర ఉంటే వారిపై భారం పడుతుందని, తర్వాత తగ్గించారన్నారు. ఒకే వ్యక్తి టెండర్ ఫారం తీసుకోవాలని నిబంధనల్లో స్పష్టంగా ఉన్నా, ఒకే వ్యక్తి వేర్వేరు పేర్లతో టెండర్లు తీసుకున్నారని ఆరోపించారు. ఎక్స్‌పీరియన్స్-శాటిస్‌ఫ్యాక్టరీ సర్టిఫికెట్లు, ఈఎండీ ధర రూ.9,30,000, టర్నోవర్ రూ.కోటి, ప్రాఫిట్ మార్జిన్‌ను 7శాతంగా నిర్ణయించారని తెలిపారు. సవరణల పేరుతో ఇష్టానుసారంగా మార్పులు చేసి చెల్లుబాటు కాని టెండర్లను క్వాలిఫై చేశారన్నారు. ఏ బిడ్‌ను తీసినా కాంట్రాక్టర్ల త్రయం సిండికేట్‌లు వేయించినవే వస్తున్నాయని, సిండికేట్ త్రయం హాల్‌లో కూర్చున్న కాంట్రాక్టర్లపై చంపేస్తామంటూ తొడకొట్టి బెదిరించిం దని పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియపైనా, కాంట్రాక్టర్ల సిండికేట్ త్రయం బెదిరింపులపైనా సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఎన్టీఆర్ సర్కిల్లో, 18వ డివిజన్‌లో, 6వ డివిజన్‌లో, 7వ డివిజన్‌లో ఘనంగా టీడీపీ వ్యవస్థాపక ఆవిర్భావ దినోత్సవం

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

పటమట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తూమాటి ప్రేమ్‌నాథ్, చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి క్రాంతిశ్రీ, నర్రా కిషోర్, బద్రి, నల్లూరు ఉషారాణి, రత్నం రమేష్, గద్దె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. ● 12వ డివిజన్ కరివేపాకు తోటలో డివిజన్ అధ్యక్షుడు సాయిన బుజ్జి ఆధ్వర్యంలో జరిగాయి. ● గొట్టిపాటి కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ అన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. **ప్రభుత్వాసుపత్రి:** 6వ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ● 2వ డివిజన్ మాచవరం పార్టీ కార్యాలయంలో, ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి, చిత్రపటాలకు డివిజన్ అధ్యక్షుడు దాసరి గాబ్రియేలు, ఎలిసిల సురేష్ బాబు, సుగసాని కృష్ణ ప్రసాద్‌లు పూల మాలలు వేసి నివాళులర్పించారు. **రాణిగారితోట:** 18వ డివిజన్‌లో తూర్పు బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కిర తిరుపతయ్య ఆధ్వర్యంలో పలుచోట్ల జెండా ఆవిష్కరణ చేసి ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ●రాణిగారితోట నాలుగురోడ్ల సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి 17,18 డివిజన్ల నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ●రామలింగేశ్వరనగర్ పడవల రేవు సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి స్థానిక నాయకులు పూలవేసి నివాళులు అర్పించారు. **భారతీనగర్:** రమేష్ ఆస్పత్రి జంక్షన్ సమీపంలోని నాలుగో డివిజన్ పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ జాస్తి సాంబ శివరావు ఆధ్వర్యంలో జరిగాయి. **మొగల్రాజపురం:** 7వ డివిజన్‌లో అధ్యక్షుడు పటమట సతీష్‌చంద్ర ఆధ్వర్యంలో ఎన్టీయార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. పండ్లు పంపిణీ చేశారు.

టీటీడీలో ఉగాది వేడుకలు నేడు

పంచాంగ శ్రవణ బ్యానర్ ఆవిష్కరణ



లబ్బీపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ ఉగాది నూతన సంవత్సరం సందర్భంగా టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సి.లలితా తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ సీవీకే ప్రసాద్, జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు నండూరి వెంకట తాండవకృష్ణ, ఆలయ సిబ్బంది హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు తగ్గించాలని సీపీఎం ధర్నా

రాణిగారితోట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించి వేలకోట్ల రూపాయల భారాలు ప్రజలపై కూటమి ప్రభుత్వం మోపుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ విమర్శించారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో రాణిగారితోటలోని విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.చంద్రశేఖర్, చిన్నారావు, రమణ, వరప్రసాద్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అజయ్‌కుమార్ రెడ్డికి ఘన సన్మానం



అజయ్‌కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న శ్రీ భాస్కరా హోమ్ నివాసులు

పటమట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పనగర్ శ్రీ భాస్కరా హోమ్స్‌లో ఉంటున్న అంధుల క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ అజయ్ కుమార్ రెడ్డిని ఉగాది సందర్భంగా హోమ్స్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎన్జీ రంగా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ధనశేఖర్ మాట్లాడుతూ అజయ్‌కుమార్ రెడ్డి భారత అంధుల క్రికెట్ టీమ్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడన్నారు. భారత ప్రభుత్వం ఆయనకు అర్జున్ అవార్డుతో గౌరవించిందన్నారు. గద్దె చంద్రశేఖర్, ఎస్.శ్రీనివాస్, సీహెచ్ రవి కిషోర్, కె.వెంకటేష్, పి.చంద్రశేఖర్, భగత్‌రెడ్డి, సోమశేఖర్ పాల్గొన్నారు.

త్యాగానికి, దానధర్మాలకు ప్రతీక రంజాన్ : గద్దె

కృష్ణలంక, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : త్యాగానికి, దానధర్మాలకు ప్రతీక రంజాన్ మాసమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. శనివారం సాయంత్రం కృష్ణలంక 21వ డివిజన్‌లో పొట్టి శ్రీరాములు హైస్కూల్ సమీపంలోని మసీదులో జరిగిన ఇఫ్తార్ విందుకు ఆయన విచ్చేశారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ నాయకులు అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ జనసేన ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇవ్వడం చాలా సంతోషంగా వుందన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభా కాంక్షలు తెలిపారు. గొరిపర్తి నామేశ్వరరావు, ఎండీ హాజీ, అన్వర్ భాషా, షేక్ జావేద్, షేక్ ఉమర్, మండల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతం ఉగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

గాంధీనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంతం వారి ఉగాది తెలుగు క్యాలెండర్‌ను పలువురు ప్రముఖులు గాంధీ నగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆవిష్కరించారు. ప్రముఖ సాహితీ వేత్తలు గుమ్మా సాంబశివరావు, జీ.వీ.పూర్ణచందు, చలపాక ప్రకాశ్, మాజీ టీడీపీ ఫ్లోర్‌లీడర్ ఎరుబోతు రమణారావు పాల్గొన్నారు.

కళ్ల కలకపై ఆరోగ్య సదస్సు

బెంజిసర్కిల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాస్తిక్ కేంద్రంలోని వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం సాయంత్రం డాక్టర్ జి. సమరం అధ్యక్షతన కళ్ల కలకపై ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ నేత్ర వైద్యులు ఎన్వీ అన్నపూర్ణ మాట్లాడుతూ కళ్ల కలకపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెరగాలని సూచించారు. కళ్లకలక వచ్చిన వారు కళ్లను పరిశుభ్రంగా ఉంచుకొని చికిత్స తీసుకోవాలని కోరారు.


ప్రకటన

నా క్లయింటు అయిన తెలంగాణా రాష్ట్రం, మేడ్చల్ జిల్లా, కూకట్‌పల్లి, వెస్ట్రన్ హిల్స్, రోడ్డు నెం.6రు, ప్లాటు నెం. 106/ఎ, M/s Landmark Developers రిప్రజెంటెడ్ బై పార్టనర్ మాదినేని సీతారామయ్య, తండ్రి: లేటు వెంకట్రామయ్య గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలాస్తిని ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ టౌన్, పటమట గ్రామం, అయ్యప్ప నగర్, డోర్ నెం.74-14-69రు కాపురస్తులు లేటు మేడసాని వెంకట సుబ్బారావు గారి ఏకైక కుమార్తెయున్నూ, ముమ్మనేని విజయ బాబు గారి భార్యయున్నూ అయిన నిరంజని మాధురి @ శ్రీ నిరంజని మాధురి దేవి గార్ల వద్ద నుండి అభివృద్ధి నిమిత్తము తీసుకొనుటకు నిశ్చయించుకున్నారనియు కొంతధనము ధరావత్తుగా యిచ్చి రిజిష్టరు దస్తావేజు వ్రాయించుకొనుటకు సిద్ధముగా యున్నారనియు, కావున షెడ్యూలు దాఖలాస్తికి సంబంధించి ఏ విధమైన జప్తులు, తనఖాలు, ఛార్జీలు, కోర్టు దావాలు మరియు ఏ విధమైన అన్యాక్రాంతములున్నను ఈ దిగువ ఉదహరించిన సంతకముదారునకు రిజిష్టరు పోస్టుద్వారా లేదా స్వయముగా వ్రాతపూర్వక అభ్యంతరములను లేక ఆక్షేపణలను ప్రకటన వెలువడిన వారం (7) రోజులలోపు తెలియజేయగలరు. తరువాత వచ్చు ఎటువంటి అభ్యంతరములు మరియు ఆక్షేపణలు నా క్లయింటును ఏ విధంగాను బైండు చేయజాలవని ఇందుమూలముగా తెలియజేయుచున్నాను. షెడ్యూలు: ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ టౌన్, పటమట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో చేరియున్న పటమట గ్రామ సర్వే నెం.212/2బిరు దాఖలా మేడసాని వెంకట సుబ్బారావు గారు విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 457/1961రు ద్వారా ముప్పవరపు హైమవతి, ఆలపాటి పుష్పావతి గార్ల వల్ల దఖలు పొందిన రీత్యా య.0.39ట్లను సదరు మేడసాని వెంకట సుబ్బారావు గారు విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.3910/1980రు ద్వారా కోగంటి ఉమామహేశ్వరరావు వగైరాల వల్ల క్రయం పొందిన రీత్యా య.0.20ట్లను వెరశి య.0.59ట్లు ఏకఖండముగా గల ఆస్తిని మేడసాని వెంకట సుబ్బారావు గారు కాలం చేయుటతో మేడసాని వెంకట సుబ్బారావు గారి భార్య మేడసాని సీతామహాలక్ష్మి మరియు వారి ఏకైక కుమార్తె నిరంజని మాధురి గార్లు జాయింటుగా అనుభవించుచుండగా మేడసాని సీతామహాలక్ష్మి గారు ది.13-03-2023 నాడు కాలం చేయటంతో వారి ఏకైక కుమార్తె నిరంజని మాధురి గారు సర్వ సంపూర్ణ హక్కులతో అనుభవిస్తున్న షెడ్యూలు దాఖలాస్తికి **హద్దులు: తూర్పు:** ముప్పవరపు సత్యనారాయణ మరియు మాదల బసవయ్య గార్ల భూమి, **దక్షిణం:** జాయింటు బావి, షెడ్డు, **పడమర:** గద్దె శకుంతలమ్మ భూమి, **ఉత్తరం:** కొండపల్లి విజయలక్ష్మి భూమి.

GARIKIPATI PRABHAKARA RAO, B.Sc., M.B.A., LL.B., ADVOCATE,
FF-B, GMV Residency, 40-25-35, Mosque Street, Patamatalanka,
VIJAYAWADA-10, A.P. Cell: 94932 47697, 95734 43434

నయనానందవనం

రోజు రోజుకూ కొత్త అందాలను దిద్దుకుంటున్న మూలపాడు నగరవనం



దొంగమర్ల బావి

చూపు తిప్పుకోలేని అభయారణ్యం! ఎంత చూసినా తనివి తీరని రిజర్వు ఫారెస్ట్ సోయగం! సరికొత్తగా ముస్తాబవుతున్న బటర్‌ఫ్లై పార్కు, వెదురు వనం, దొంగమర్ల బావి, ఓల్డ్ గెస్ట్ హౌస్, జలపాతాలు.. ఉరుకుల పరుగుల జీవితంతో తీరిక లేకుండా గడిపే విజయవాడ నగర, ఎన్టీఆర్ జిల్లా గ్రామీణ ప్రాంత వాసులకు వీకెండ్స్‌లో కాస్త సేద తీరేందుకు ఆహ్వానిస్తోంది. రోజురోజుకూ మరింత అందంగా తయారవుతూ పచ్చని చెట్ల పందిళ్ల మధ్య పర్యాటకులను పరవశింపజేసేందుకు రెడీ అవుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడకు అతిసమీపంలోని ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ సమీపంలోని మూలపాడు నగరవనాన్ని ఒక్కసారైనా సందర్శించాల్సిందే! కొండపల్లి అభయారణ్యపు అందాలను రెండు కళ్లతో ఎంతసేపు చూసినా ఇంకా చూడాలనిపిస్తుంది. సహజ ప్రకృతి అందాలు, గలగలా పారే సహజసిద్ధ జలపాతాల సోయగాలు, వెదురు వనం, నేరేడు వనం, పార్కు.. ఇలా లోపలికి వెళ్లిన కొద్దీ అనేక ఆకర్షణలు దర్శనమిస్తాయి.

– ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి

- దొంగమర్ల బావి, ఆంజనేయస్వామి ఆలయం, గెస్ట్ హౌస్, జలపాతాలు ..
- చూపు తిప్పుకోలేని అందం సీతాకోకచిలుకల పార్కు సొంతం
- అడుగడుగునా పచ్చని చెట్లు - అబ్బురపరిచే వెదురు, జామాయిల్ వనం
- అంతరించిపోతున్న ఔషధ మొక్కలతో ప్రత్యేక వనక్షేత్రాలు

మూలపాడు నగరవనంలో సీతాకోక చిలుకల పార్కు కొత్త అందాలను సంతరించుకోవడంతో ఈ ప్రాంతానికి మరింత క్రేజ్ పెరుగుతోంది. నయనానందంతో పాటు మనస్సుకు ఉల్లాసాన్ని అందించే అనేక ప్రదేశాలు ఈ పార్కులో ఉన్నాయి. ప్రధానద్వారం వద్దే సీతాకోక చిలుకల రంగురంగుల బొమ్మలు ఆకట్టుకుంటాయి. లోనికి ప్రవేశించిన తర్వాత దారి పొడవునా సిమెంట్ బల్లలపై సీతాకోక చిలుకల బొమ్మలు ఏర్పాటు చేశారు. పిల్లలకు ప్రత్యేకంగా ఆటస్థలాలను అందుబాటులో ఉంచారు. పాతకాలం చుట్టి గుడిసెలను, చెక్కకుర్చీలను ప్రత్యేక ఆకర్షణలుగా రూపొందించారు. నేరేడు తోట, విప్ప, వెలగ, మారేడు, ఉసిరి, వేప మొదలైన అనేక రకాల చెట్లు ఆకర్షణగా నిలుస్తున్నాయి.

అబ్బురపరిచే వెదురు వనం


ఇక్కడున్న అన్ని ఆకర్షణల్లో వెదురువనం ప్రత్యేకం. మధ్యలో జామాయిల్ చెట్ల పొదరింటిలా ఏర్పాటైన ఈ వనం సహజసిద్ధ అందంతో అబ్బురపరుస్తుంది. గతంలో అనేక సినిమా షూటింగ్స్ జరిగాయి.

అభయారణ్యం అందాలు

కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ ఎంతో అందమైందే కాదు దట్టమైంది కూడా. అనేక ఔషధ మొక్కలు, తెల్లపొనికి మొక్కలు, భారీ వృక్షాలు సమూహం దీని ప్రత్యేకత. మూలపాడు నగరవనం మెయిన్ గేటు నుంచి 8 కిలోమీటర్ల దూరంలో దొంగమర్ల బావి ఉంది. పక్కనే భక్తుల కోరిన కోర్కెలు నెరవేర్చే అభయాంజనేయస్వామి ఆలయం ఉంది. కొండపైకి వెళ్లేందుకు మోటార్ బైక్ రోడ్డు కూడా ఉంది. ప్రస్తుతానికి పాడైన ఓల్డ్ గెస్ట్ హౌస్ మరమ్మతులకు అటవీ శాఖ ప్రయత్నిస్తోంది. దొంగమర్ల బావి నుంచి పడమర వైపు 2 కిలోమీటర్ల దూరంలో మరో జలపాతం కనువిందు చేస్తుంది.

ఎండని బావి - సహజ జలపాతాలు

దొంగమర్ల బావిలో ఎప్పుడూ నీరుంటుంది. ఎండాకాలంలోనూ ఎండిపోదు. ఈ బావిపై అనేక జలపాతాలు న్నాయి. వర్షాకాలం నుంచి వేసవి ప్రారంభం వరకు నీరు పారుతూనే ఉంటుంది.



చుట్టిగుడిసె

ఆదివారాలు, పండుగల రద్దీ

సీతాకోక చిలుకల పార్కు, దొంగమర్ల బావి వద్దకు ఆదివారాలు, పండుగలు, సెలవు రోజుల్లో పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ఎంట్రన్స్ ఫీజు పెద్దలకు రూ.30, పిల్లలకు రూ20, మిగిలిన రోజుల్లో ఒక్కొక్కరికీ రూ.100 చెల్లించాలి.



వెదురు వనం

భద్రతా చర్యలు

సీతాకోక చిలుకల పార్కు వరకు వెళ్లడం సురక్షితం. కానీ దొంగమర్ల బావి వద్దకు సమూహంగా వెళ్లడం ఉత్తమం. అక్కడ సెల్ నెట్‌వర్క్ అందుబాటులో ఉండదు. ఒంటరిగా వెళ్లడం శ్రేయస్కరం కాదు.

ఎలా చేరుకోవాలి?

నగరవనం విజయవాడకు 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. విజయవాడ నుంచి ఇబ్రహీంపట్నం మీదుగా మూలపాడు చేరుకుని అక్కడి నుంచి కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లోకి వెళ్లాలి. ఆటోలు, బైకులు అందుబాటులో ఉంటాయి.

ప్రస్తుతం జరుగుతున్న పనులు

నగరవనం మొదటి గేటు నుంచి రెండో గేటు వరకు రెండు వైపులా సైడ్ డ్రెయిన్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్లాంటేషన్ మధ్యలో సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. నక్షత్రవనం, రాశి వనంతో పాటు మొత్తం 8 రకాల వనాలు ఏర్పాటు చేస్తున్నారు. కడియం నుంచి గోల్డెన్ బాంబూస్, పొగడ, ఇతర పూల మొక్కలు నాటుతున్నారు. లుక్కింగ్ స్పాట్ నుంచి చూస్తే ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు చుట్టూ కొండల మధ్య అందంగా కనిస్తుంది.







కడియం నుంచి తెచ్చిన మొక్కలు

అక్టోబరుకు పూర్తి స్థాయిలో గ్రీనరీ: డీఆర్‌వో శివప్రసాద్

నర్సరీ ద్వారా పెంచే వేప, నేరేడు, మారేడు, ఉసిరి, వెదురు, గోల్డెన్ తురంత, కుంకిడి, వెల్లమర్ది కాక కడియం నర్సరీ నుంచి పలు రకాల మొక్కలు తెచ్చి నాటుతున్నాం. సైక్లింగ్ కోసం ఇక్కడ ట్రాక్‌తో పాటు 6 సైకిళ్ల ఏర్పాటు చేశారు. ఉన్న వాటితో పాటు మరో బోరు వేసి గ్రీనరీని అభివృద్ధి చేస్తున్నాం. వేసవిలో చెట్లు ఎండిపోకుండా చర్యలు చేపట్టాం. వచ్చే అక్టోబరు నాటికి నగరవనంలో పూర్తిస్థాయి గ్రీనరీ ఉండేలా చూస్తాం.

జిల్లా ప్రజలకు కలెక్టర్, ఎంపీ ఉగాది శుభాకాంక్షలు

కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసమే బలంగా విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లా ప్రజలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని జిల్లా ప్రగతిని విశ్వవినువీధులకు చాటేలా అధికారులు చేయాలని, పేదరిక నిర్మూలనకు ఈ ఉగాది నాంది పలకాలని కోరుతూ జిల్లా ప్రజలకు కలెక్టర్ లక్ష్మీశ విశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదరిక నిర్మూలన కోసం అమలు చేసుతన్న పీ4 పథకం దిగ్విజయంగా కొనసాగేందుకు ఈ ఉగాది నాంది కావాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ విశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల కోసం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా జిల్లా అధికారులు నూతన శక్తితో బాధ్యతలు నిర్వహించాలని కోరుకుంటూ ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఉద్యోగులకు, ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ శివనాథ్ శుభాకాంక్షలు

వన్‌టౌన్: ఉగాది నాడు తినే షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి జీవితంలోని వివిధ అనుభవాలను సూచిస్తుందని తెలుగు సంవత్సరాదికి, నూతన జీవితానికి నాందిగా ఉగాది పండగ జరుపుకుంటామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఈద్ నమాజ్ పోస్టర్ ఆవిష్కరణ

లబ్బీపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నందు బహిరంగ ఈదుల్ ఫితర్ నమాజ్ నిర్వహిస్తున్నట్టు ముస్లిం ఈద్గా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కాలేషావలీ, మునీర్ అహ్మద్ తెలిపారు. శనివారం స్టేడియంలో ఈద్ నమాజ్ పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ రోజు ఉదయం 7.15 గంటలకు ఈద్ సందేశం ప్రారంభమవుతుందని, నమాజ్ ఉదయం 8గంటలకు జరుగుతుందన్నారు. వజూ కోసం శుభ్రమైన నీరు అందుబాటులో ఉంటుందని, నమాజు నిర్వహించుకునేందుకు అనువుగా అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ముస్లిం సోదరులు ఈద్ నమాజ్‌లో పాల్గొనాలని కోరారు. ఈద్గా కమిటీ సభ్యులు ఎండీ అన్వర్ పాషా, ఎండీ ఇర్ఫాన్, షేక్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

టూరిజం హబ్‌గా ఏపీ

- సీఎం చంద్రబాబును కలిసిన హోటల్స్ అసోసియేషన్ సభ్యులు

గుణదల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఏపీకి ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు, టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడంలో తాము పాత్రధారులవుతామని ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి ఆలిండియా హోటల్స్ అసోసియేషన్ నుంచి కొంతమంది సభ్యులంతా గత రెండు రోజులుగా గుణదల్లోని హోటల్ హయత్ ప్లేస్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసుకుని ఏపీలో పెట్టుబడులు పెట్టే విషయమై చర్చించుకున్నామన్నారు. ఆయా అంశాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు శనివారం మధ్యాహ్నం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిసి 45 నిమిషాల పాటు మాట్లాడామన్నారు. రాష్ట్రంలో హోటళ్లు, రెస్టారెంట్ల ఏర్పాటుకు పెట్టుబడి పెట్టేవారిని తీసుకురావాలని కోరారన్నారు. ఆలిండియా హోటల్స్ అసోసియేషన్‌లోని ముఖ్యులతో సలహామండలి ఏర్పాటు చేస్తామని చంద్రబాబు చెప్పారన్నారు. దీనిపై తాము హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. బ్రాండెడ్ హోటల్స్ ఇన్వెస్టర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు సూచించారని, టూరిజం అభివృద్ధిపై ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే పాలసీ ఇచ్చిందని, పెట్టుబడిదారులు ముందుకొస్తే వారికి కావాల్సిన సహాయం అందస్తామని సీఎం స్వయంగా చెప్పడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. చిత్తూరు, శ్రీశైలంలో పర్యాటకాభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని అక్కడ భూములు కేటాయిస్తామని స్టార్ హోటళ్లు నిర్మించాలని చంద్రబాబు కోరారన్నారు. ఆ దిశగా తాము ఆలోచన చేస్తామని సీఎంకు హామీ ఇచ్చామన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని త్వరలోనే ప్రారంభించబోతున్నామన్నారు. తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ నేతలు వెంకటరెడ్డి, తమిళనాడు హోటల్స్ అసోసియేషన్ నేతలు సుబ్బు, జీయార్టీ హోటల్స్ ఛైర్మన్ నటరాజన్, తాజ్ సెలెక్షన్స్ హోటల్స్ ప్రతినిధి బాలకృష్ణ హోటల్ రంగ ప్రముఖులు సోమరాజు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబును ఆయన నివాసంలో కలిసి మాట్లాడుతున్న హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం

విద్యాధరపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు అదృశ్యమైనట్టు శనివారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. టీచర్స్ కాలనీలో ఉంటున్న పంచపర్వాల దొంతువేశ్వరరావు (50), రాజ్యలక్ష్మి దంపతుల మధ్య మనస్పర్థలు రావటంతో సుమారు 15 ఏళ్ల కిత్రం విడిపోయారు. తరువాత నుంచి అతడు లాయర్ పుప్పాల దివ్యలక్ష్మితో కలిసి సహజీవనం చేస్తున్నాడు. 6 నెలల నుంచి మద్యం సేవించి దివ్యలక్ష్మిని వేధిస్తున్నాడు. దీంతో ఆమె ఫిబ్రవరి 15న హైదరాబాద్‌లోని పుట్టింటికి వెళ్లింది. 24న ఉదయం పిట్టల సాంబశివరావు అనే వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి జయ దుర్గా లారీ ఆఫీసు వద్ద ఈనెల 15న రాత్రి దొంతువేశ్వరరావు తన ఫోన్, మోటార్ సైకిల్ పెట్టి ఎక్కడికో వెళ్లాడని, అప్పటి నుంచి రాలేదని చెప్పాడు. ఆమె హైదరాబాద్ నుంచి వచ్చి బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరో ఘటనలో మైలవరంలో ఉంటున్న తొత్తడి సత్య వెంకట దుర్గ శివ నగేష్ 8 నెలల నుంచి గొల్లపూడి మహాత్మాగాంధీ కాంప్లెక్స్‌లోని 217 షాపులో శ్రీ నగేష్ ఫార్మాస్యూటికల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వివాహం కాలేదు. హైదరాబాద్ సమీపంలోని సంగారెడ్డిలో ఉంటున్న అతడి సోదరి లోవకుమారి తరచూ తమ్ముడితో మాట్లాడుతూనే ఉంటుంది. ఈ క్రమంలో ఈనెల 28న ఉదయం తమ్ముడితో మాట్లాడింది. మధ్యాహ్నం నగేష్ షాపులో పనిచేస్తున్న ఝాన్సీ లోవకుమారికి ఫోన్‌చేసి నగేష్ షాపులో లేడని చెప్పింది. దీంతో లోవకుమారి తమ్ముడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో భర్త శరత్ కుమార్‌ను గొల్లపూడి షాపు వద్దకు పంపింది. ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె హైదరాబాద్ నుంచి వచ్చి బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. పైగా ఓ లెటర్ షాపులో లభించింది. నా గురించి వెతకవద్దు. నాకు మంచి జాబ్ వచ్చింది. సెటిల్ అయిన తరువాత వస్తా అని పేర్కొన్నాడు. అతడు తన బైక్‌పై వెళుతూ బట్టల బ్యాగ్ తీసుకుని వెళ్లిపోయాడని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేశారు.



అదృశ్యమైన దొంతువేశ్వరరావుయు వెంకట దుర్గ శివ నగేష్

వివాహితను బెదిరించిన నలుగురిపై కేసు

వివాహితను చంపుతానని బెదిరించిన నలుగురిపై శనివారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. విద్యాధరపురం యద్దనపూడి వారి వీధిలో ఉంటున్న సాలపు నౌహీరాభాను 2002లో వినయబాల మురళీకృష్ణను ప్రేమ వివాహం చేసుకుంది. అతడి కుటుంబ సభ్యుల అంగీకారం లేకపోవటంతో విడిగా ఉంటున్నారు. ఒక కుమార్తె. 2019 ఏప్రిల్ 14న మురళీ కృష్ణ అనారోగ్యంతో మృతిచెందాడు. నాటి నుంచి మురళీకృష్ణ తల్లిదండ్రులు, సోదరులు, బంధువులు నౌహీరాభానును వేధిస్తున్నారు. ఆమె ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ కుమార్తెను చదివించుకుంటుంది. భర్త తరపున రావాల్సిన ఆస్తులను ఇవ్వమని కోరగా నిరాకరించి బెదిరిస్తున్నారు. పెద్దల సమక్షంలో మాట్లాడినప్పటికీ పట్టించుకోవటం లేదు. పైగా బాధితురాలికి ఆస్తిలో ఎలాంటి హక్కులేదని సంతకాలు పెట్టమని బలవంతం చేస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 7న ఆమెకు ఫోన్ చేసి కాగితాలపై సంతకాలు పెట్టకపోతే చంపుతామని బెదిరించారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.



కేంద్ర మంత్రి పెమ్మసానికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

హయ్యర్ పెన్షన్ ఆప్షన్లను తిరస్కరించటం ఆపాలి

- కేంద్ర మంత్రి పెమ్మసానికి కార్మిక పరిషత్ వినతి

బస్టేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల ఈపీఎఫ్‌వో హయ్యర్ పెన్షన్ ఆప్షన్లను తిరస్కరించటాన్ని ఆపాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆర్టీసీ కార్మికపరిషత్ రాష్ట్ర కమిటీ శనివారం వినతి పత్రం అందజేసింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారమే ఆప్షన్లను అనుమతించాల్సి ఉంటుందన్నారు. ఆ మేరకే ఆన్‌లైన్ జాయింట్ ఆప్షన్‌ను సబ్‌మిట్ చేశారని, దీంతో పాటు డిమాండ్ లేఖలు కూడా వచ్చాయన్నారు. కొద్దిరోజులుగా ఏ కారణం లేకుండానే జాయింట్ ఆప్షన్స్‌ను తిరస్కరిస్తున్నారన్నారు. ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ శివకుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, సుప్రీం కోర్టు ఇచ్చిన సదవకాశాన్ని అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి చంద్రశేఖర్‌ను కలిసిన వారిలో కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, సీసీఎస్ ఎంసీ మెంబర్ కె.సురేంద్ర, గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం. రాజేష్, విజయవాడ డిపో కార్యదర్శి ఎస్.ప్రభాకర్ ఉన్నారు. కేంద్ర కార్మిక మంత్రితో మాట్లాడి అందరికీ డిమాండ్ లేఖలు జారీచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారు.

రైళ్లలో దోపిడీ చేసే దొంగలు అరెస్టు

రైల్వే స్టేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గవర్నమెంట్ రైల్వే పోలీసు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో ప్రయాణికులకు మత్తు మందు ఇచ్చి దోపిడీ చేసే ముగ్గురు దొంగలను శనివారం అరెస్టు చేశారు. విజయవాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం-1లో దక్షిణం వైపు చివరన దొంగలను గుర్తించి పట్టుకున్నారు. జార్ఖండ్‌కు చెందిన సుశీల్ మండల్ (32) అశోక్ మండల్ (46) దుర్గజ్ మండల్ (39)ను అరెస్టు చేశారు. వీరిపై ఈ ఏడాది ఫిబ్రవరి 15న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో రాజమండ్రి రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన దొంగతనం, అదే నెల 18న తిరుపతి - పూరీ ఎక్స్‌ప్రెస్‌లో సింహాచలం రైల్వే స్టేషన్ దగ్గర జరిగిన దొంగతనాల్లో కేసులు నమోదు అయ్యాయి. వారి నుంచి ప్రయాణికులకు మత్తు కల్పించేందుకు వినియోగించిన 21 ట్యాబ్లెట్లను, 5 గ్రాముల బరువున్న రెండు బంగారు ఉంగరాలను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద 60కేజీల గంజాయి పట్టివేత

ఉంగుటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి చెన్నై-కోల్‌కతా జాతీయరహదారి మీదుగా కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద ఆత్కూరు పోలీసులు పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర రావు నిందితులను శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టి కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 28న సాయంత్రం ఉంగుటూరు మండలం, పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద ఆత్కూరు ఎస్సై చావా సురేష్ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఏలూరు వైపు నుంచి విజయవాడ వైపు అనుమానాస్పదంగా వస్తున్న ఎర్టిగా కారును ఆపి తనిఖీచేయగా అందులో 3 బస్తాల్లో ప్యాకింగ్ చేసిన 60కేజీల గంజాయి పట్టుబడింది. కారులో ప్రయాణిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు శివారు సివిడిమామిడికి చెందిన దలాయి చంటిబాబు, కర్నాటక రాష్ట్రం, బీదర్‌జిల్లా, జంగి గ్రామానికి చెందిన సంతోష్, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌కు చెందిన మూడావత్ భాస్కర్ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక ఎర్టిగా కారు. మూడు స్మార్ట్ సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆత్కూరు ఎస్సై చావా సురేష్, సిబ్బంది ఈ.పవన్, కుమార్, ఆంజనేయులు, రామారావు, మోహనరావు ఎస్పీ అభినందించారు.

దేవదాయ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా షణ్ముగం

విజయవాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా నటరాజ షణ్ముగం నియమితులయ్యారు. ప్రస్తుతం వన్‌టౌన్‌లోని పాత శివాలయం ఈవోగా పనిచేస్తున్న ఆయనకు ఈ బాధ్యతలు అప్ప గించారు. తొలుత సీవీ రెడ్డి ట్రస్ట్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న నూతక్కి సాంబశివరావు ను నియమించారు. ఈయన దేవదాయశాఖ కృష్ణా జిల్లా అసిస్టెంట్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న సీతారామయ్య అనారోగ్యం కారణంగా సెలవులో వెళ్లారు. ముందుగా సాంబశివరావును ఎన్టీఆర్ జిల్లాకు ఇన్‌చార్జిగా నియమించినప్పటికీ ఆ ఉత్తర్వులను శనివారం నిలుపుదల చేశా రు. ఆ స్థానంలో నటరాజ షణ్ముగానికి బాధ్యతలు అప్పగించారు.

దానానికి మార్గం చూపిన ఇస్లాం

- సీపీ రాజశేఖరబాబు

విజయవాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సంపాదించిన మొత్తంలో కొంతభాగాన్ని దానం చేయడం వంటి గొప్ప సంస్కృతికి ఇస్లాం మార్గం చూపిందని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం ఉద్యోగులతో కలిసి ప్రార్థనలు చేసిన అనంతరం సీపీ మాట్లాడారు. ముస్లిం ఉద్యోగులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం ఉద్యోగులు పోలీసు శాఖలో కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత గురువులు సీపీకి ఖురాన్‌కు సంబంధించి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీసీపీలు కేజీవీ సరిత, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీ జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపదగా కూచిపూడి: కలెక్టర్

కూచిపూడి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిని రాష్ట్ర సాంస్కృతిక వారసత్వ సంపదగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం మొవ్వ మండలం కూచిపూడి గ్రామంలోని శ్రీ సిద్ధేంద్ర కళాపీఠం సమావేశ మందిరంలో జేసీ గీతాంజలి శర్మ, ప్రభుత్వ శాఖల అధికారులతో కూచిపూడి అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. తొలుత కలెక్టర్, జేసీ సిద్ధేంద్రయోగి, నటరాజస్వామి విగ్రహాలకు పూలమాలలు వేసి సమావేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కూచిపూడి సమగ్రాభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించినట్టు తెలిపారు. కూచిపూడి అభివృద్ధిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై కళాకారుల, గ్రామస్థుల అభిప్రాయాలను కలెక్టర్ తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ డీఆర్‌డీఏ పీడీ హరనాథ్‌తో ఫోన్‌లో మాట్లాడి మహిళలకు దుస్తులు, జడలు, గజ్జెల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. గ్రామంలో రహదారులు, మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖర్‌రావు, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకుడు వై.వి.ప్రసన్న, సహాయ సంచాలకుడు లజ్వంత్ నాయుడు, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, డీపీవో అరుణ, జిల్లా పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్, సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి, నాట్యాచార్యులు వేదాంతం వెంకట నాగ చలపతి, చింతా రవి బాలకృష్ణ, వేదాంతం రాధేశ్యామ్, తహసీల్దార్ మస్తాన్, ఈవోపీఆర్‌డీ పరమాత్మ పాల్గొన్నారు.

సండే సెలబ్రిటీ





టాలీవుడ్‌లో ప్రతిభావంతులైన దర్శకులలో **హరీష్ శంకర్** ఒకరు. తన అభిప్రాయాన్ని నిస్సంకోచంగా... నిర్భయంగా చెప్పగలిగిన ఆయన... త్వరలో పవన్‌కల్యాణ్, సల్మాన్‌ఖాన్ వంటి అగ్రనటుల సినిమాలకు దర్శకత్వం వహించనున్నారు. కొత్త సంవత్సరం... 'విశ్వావసు'లోకి కొత్త ఆశలతో అడుగుపెడుతున్న హరీష్‌శంకర్ 'నవ్య'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.

గమ్యం కన్నా గమనాన్ని ఆస్వాదిస్తా

పవన్ కల్యాణ్‌తో సినిమా ఎప్పుడు?

ఎన్నికల ముందు ఒక స్క్రిప్ట్ అనుకున్నాం. ఆ తర్వాత కొన్ని మార్పులు చేశాం. ఇప్పుడు అంతా రెడీ. కల్యాణ్‌గారి డేట్స్ చూసుకొని, త్వరలోనే సినిమా ప్రారంభిస్తాం. నేను మాత్రం మూడు నాలుగేళ్ల నుంచి సిద్ధంగానే ఉన్నా.

చిన్ననాటి ఉగాది జ్ఞాపకాలు చెబుతారా..?

నా ఉద్దేశంలో పండుగ అంటే పదిమంది కలిసి చేసుకొనేది. మన సంస్కృతిలోని పండుగలన్నీ ఈ అంతస్సూత్రం ఆధారంగా ఏర్పడినవే! ముఖ్యంగా ఉగాది విషయానికి వస్తే... ఇది ప్రకృతి పండుగ. ప్రకృతికి... మనిషికి మధ్య ఉన్న బాంధవ్యాన్ని చెప్పే పండుగ. ఉగాది పచ్చడి, పంచాగ శ్రవణం... మొదలైనవన్నీ వీటిలో భాగాలే! అందుకే ఆ రోజు కచ్చితంగా ఫలానా దేవుడికి దండం పెట్టాలని లేదు. నాకు చిన్నప్పటి నుంచి పంచాంగ శ్రవణం వినటం... ఆ సంవత్సరం ఎలా ఉందో చూసుకోవటం అలవాటు. నా ఉద్దేశంలో జ్యోతిషం కూడా ఒక శాస్త్రం. మనం పుట్టినప్పుడు గ్రహాలు ఎలా ఉన్నాయనే ఆధారంగా విశ్లేషిస్తే చాలా విషయాలు తెలుస్తాయనేది నా నమ్మకం. చెప్పేవాళ్లు తప్పుకావచ్చు. శాస్త్రం మాత్రం ఎప్పుడూ తప్పుకాదు. ఇక అమ్మ, నాన్న బీహెచ్ఈఎల్‌లో ఉంటారు. ప్రతి ఏడాది వాళ్ల దగ్గరకు వెళ్లి ఆశీర్వాదం తీసుకుంటా. అమ్మ చేతి వంట తింటా. మార్చి 31 నా పుట్టిన రోజు. ఈసారి ఉగాది మర్నాడేప వచ్చింది.

చాలామంది దర్శకులకు గ్యాప్ వస్తూ ఉంటుంది. అలా వేచి చూడటం చికాకుగా అనిపించదా?

ఇష్టమైన పని కష్టమయినా ఇబ్బంది పెట్టదు. చికాకు అనిపించదు. నేను గమ్యం కన్నా గమనాన్ని ఎక్కువ ఆస్వాదిస్తా. దీనివల్ల కూడా చికాకు అనిపించదు. ఇక్కడ మీకో విషయం చెప్పాలి. బయట నుంచి చూసేవాళ్లకు మేము షూటింగ్ చేసేటప్పుడు మాత్రమే పని చేస్తున్నట్టు కనిపిస్తుంది. కానీ అది నిజం కాదు. ఏడాదిలో వంద రోజులు షూటింగ్ ఉందనుకుందాం. మిగిలిన రోజులు కథలు రాసుకుంటాం... స్క్రీన్‌ప్లే తయారు చేసుకుంటాం. ఏడాదంతా ఏదో ఒక పని చేస్తూనే ఉంటాం. ప్రస్తుతం నాదగ్గర 4 కథలు ఉన్నాయి. వచ్చే నాలుగు సినిమాల మధ్య గ్యాప్ ఉండదు.

జయాపజయాలను ఎలా చూస్తారు?

నా మొదటి సినిమా 'షాక్' పరాజయం పాలయింది. నాకు పెద్ద షాక్ ఇచ్చింది. దాని నుంచి తేరుకొని 'గబ్బర్‌సింగ్' లాంటి ఇండస్ట్రీ హిట్ ఇచ్చానుగా! సినిమాపై ప్రేమతో వచ్చిన తర్వాత విజయమయినా.. పరాజయమయినా.. ప్రస్థానం మాత్రం సాగుతూనే ఉంటుంది. విజయం సాధిస్తే ఇది కొంత సులభమవుతుంది. పరాజయం వస్తే కొంత కష్టమవుతుంది అంతే! కొన్ని విమర్శలు.. ఆర్థికపరమైన ఇబ్బందులు ఉంటాయి. విజయం సాధిస్తే మనకు ఫోన్లు ఎత్తే సమయం కూడా ఉండదు. పరాజయం వస్తే... మనం ఫోన్ చేసినా ఎవరూ తియ్యరు. ఇది పరిశ్రమ తత్వం. దీన్ని అర్థం చేసుకుంటే ప్రశాంతత వస్తుంది.

జయాపజయాలు ఇంట్లోవాళ్లను ఇబ్బంది పెట్టవా?

నా సినిమా కబుర్లు అన్నీ ఆఫీసులోనే ముగిసిపోతాయి. నా భార్య స్నిగ్ధకు సినిమాలంటే పెద్ద ఇష్టం ఉండదు. కార్టూన్ నెట్‌వర్క్ అన్నా.. మొక్కలన్నా తనకు పిచ్చి. నా పారితోషికం ఎంతో కూడా తనకు తెలియదు. ఇక అమ్మ సరోజ, నాన్న శ్యాంసుందర్‌తో కూడా మొన్నటి దాకా నాకు ఎటువంటి సమస్య ఉండేది కాదు. నాన్న తెలుగు మాస్టారుగా రిటైరైన తర్వాత ఆయనకు ఒక ట్యాబ్ కొనిచ్చా. దాంతో సమస్య ప్రారంభమయింది. "హరీష్ శంకర్‌కు వార్నింగ్ ఇచ్చిన హీరో"... "ఈ దర్శకుడి పని అయిపోయిందా.." లాంటి యూట్యూబ్ వీడియోల థంబ్‌నెయిల్స్ చూసి ఆయన ఆందోళన చెందటం మొదలుపెట్టారు. దాంతో నాన్నకు "ఇవన్నీ చిన్న చిన్న విషయాలు. సినిమాల మీద ప్రేమతో ఇండస్ట్రీకి వచ్చా. పేపర్ మీద పెన్ను పెట్టి రాస్తున్నంత వరకూ మనకు ఢోకా లేదు. జీవన ప్రమాణాల స్థాయిలో తేడా ఉండచ్చేమో" అని చెప్పాను. ఆయన కొంత సమాధానపడ్డారు. అయినా అప్పుడప్పుడు ఆ తెలుగు మాస్టారిని.. మనస్సు లోపల దాగి ఉన్న తండ్రి డామినేట్ చేస్తూ ఉంటాడు! కంగారు పడుతూ ఉంటారు.

మంచి దర్శకుడికి ఉండాల్సిన లక్షణం?

దీనికి జవాబు ఈ మధ్యనే సల్మాన్ తండ్రి సలీంఖాన్ నాతో చెప్పారు. సల్మాన్‌ను కలవటానికి వెళ్లినప్పుడు ఆయన రావటం కొద్దిగా ఆలస్యమైంది. దాంతో సలీంఖాన్‌ను కలిసే అవకాశం వచ్చింది. అప్పుడు నేను ఆయనను ఇదే ప్రశ్న అడిగాను. దానికి ఆయన "హరీష్.. కారు ఎక్కగానే మీ డ్రైవర్ నీకు ఒక కథ చెబుతాడు. విమానంలో ప్రయాణిస్తున్నప్పుడు తోటి ప్రయాణికుడు ఒక కథ చెబుతాడు. నీ అసిస్టెంట్ ఆలస్యంగా వస్తే ఒక కథ చెబుతాడు. ఇలా కథలు చెప్పేవారు మన చుట్టూ ఉన్నారు. ప్రతి వ్యక్తి కథ చెప్పగలడు. కానీ దానిని ఒక పద్ధతిలో పెట్టి మంచి స్క్రీన్‌ప్లేగా మార్చగలిగినవాడే గొప్ప డైరక్టర్" అన్నారు. ఆ మాటలకు నా మబ్బులన్నీ వీడిపోయాయి.

మీకు ఎమోషనల్ సపోర్ట్ ఎవరు?

నా భార్య స్నిగ్ధ. చిన్నప్పటి నుంచి నేను స్వేచ్ఛగా, స్వతంత్రంగా బతికినవాడిని. మానసికంగా ఎవరిపైనా పెద్దగా ఆధారపడను. మనను బలహీనపరిచేది ఏదైనా ఉందంటే అది దురలవాటేనని నేను నమ్ముతాను. చాలామంది మందు, సిగరెట్లులాంటివే దురలవాట్లు అనుకుంటారు. కానీ మనను ఇబ్బంది పెట్టే ఎమోషన్ ఏదైనా దురలవాటే! దానిని దూరంగా ఉంచుతా.

అది కష్టం కాదా?

స్పష్టత ఉంటే కష్టం కాదు. ఒక ఉదాహరణ చెబుతా... మాది మధ్యతరగతి కుటుంబం. పిల్లలందరిలోనూ నేనే పెద్ద. చెల్లికి పెళ్లి చేయటం, తమ్ముడిని సెటిల్ చేయటం, అమ్మానాన్నలకు మంచి జీవనశైలి కల్పించటం... ఇలా చాలారోజులు బాధ్యతలు తీర్చటంతో సరిపోయింది. వీటన్నింటిలోనూ నాకు నా భార్య మద్దతుగా నిలిచింది. ఇక నా జీవితంలో ఎలాంటి బాధ్యతలూ వద్దనుకున్నా. నేను, నా భార్య కూర్చుని మాట్లాడుకుని పిల్లలు వద్దనుకున్నాం. ఎందుకంటే అందరూ పిల్లలు పుట్టిన తర్వాతే సెల్ఫిష్‌గా తయారవుతారు. వారి ప్రపంచం కుదించుకుపోతుంది. పిల్లల చుట్టూనే తిరుగుతుంది. దీనికి నేరుగా సంబంధం లేకపోయినా ఒక విషయం చెబుతా. మోదీజీకి మూడు సార్లు గెలవటానికి 'ఆయనకు పిల్లలు లేరు.. ఎటువంటి బాదరబందీ లేదు.. నిస్వార్థంగా ఉండగలడు' అని అనేకమంది ప్రజలు నమ్మటమే కారణమనుకుంటా!

● సివిఎల్ఎన్ ప్రసాద్

మీ దృష్టిలో మంచి ప్రేక్షకుడు ఎవరు?



ఇప్పటి దాకా మంచి ప్రేక్షకుడు.. చెడ్డ ప్రేక్షకుడు అని వేర్వేరు జాతులు ఉండేవికావు. మంచి సినిమాలు.. చెడ్డ సినిమాలు అని ఉండేవి. ప్రేక్షకులందరూ ఒక్కటే. అయితే సోషల్ మీడియా ప్రభంజనం తర్వాత చెడ్డ ప్రేక్షకులు అనే కొత్త జాతి పుట్టుకువచ్చింది. వీరికి విమర్శకు... ఎద్దేవాకు మధ్య తేడా తెలియదు. వీరు దేనినీ తులనాత్మకంగా విశ్లేషించరు. "ఆడియన్స్‌ను వెధవలనుకున్నాడా?", "ఈ మధ్య కళ్లు నెత్తికెక్కాయి.." లాంటి వ్యాఖ్యలు చేస్తూ ఉంటారు. వీరికి తమ జీవితాల్లో ఉన్న నిరాశలు వెళ్లగక్కటానికి సోషల్ మీడియా ఒక వేదిక. ఎవరూ చూడటం లేదనే భావనతో చీకట్లో ముసుగువేసుకొని అరుస్తూ ఉంటారు.

ఎప్పుడైనా సినిమా మేకింగ్‌లో సమాధానపడ్డారా?

కొద్దిగా పేరు వచ్చిన తర్వాత 'ఫలానా సీన్ ఇలా తీయి..' అని ఎవరూ చెప్పరు. కానీ కొన్నిసార్లు మిగిలిన విషయాలలో సమాధానపడాల్సి వస్తుంది. ఉదాహరణకు 'మిస్టర్ బచ్చన్' తీసుకుందాం. నెట్‌ఫ్లిక్స్‌లో మాకు మంచి రేటు.. మంచి డేట్ దొరికాయి. దాంతో ఆగస్టు4 దాకా షూటింగ్ చేసి ఆగస్టు 15కి విడుదల చేసేయాల్సి వచ్చింది. ఆ తర్వాత విడుదల చేస్తే అది బాహుబలి రేంజ్ చేరిపోతుందనేది నా ఉద్దేశం కాదు. కానీ ఇంకొంత సమయం దొరికితే ఇంకొద్దిగా బావుండేదేమో!

భావోద్వేగాలు...

నేను 10వ తరగతిలో 85 శాతం మార్కులతో పాస్ అయినప్పుడు కలిగిన ఆనందాన్ని ఇప్పటికీ మర్చిపోను. 2010లో రవి అన్నయ్య నా 'మిరపకాయ్' సినిమా ఓకే చేసిన మధ్యాహ్నం కలిగిన భావోద్వేగం ఇంకా గుర్తుంది. ఇక అవమానాల విషయానికి వస్తే... స్క్రిప్ట్‌పై నాలుగేళ్లు పని చేసిన తర్వాత షూటింగ్ మొదటి రోజున సినిమా నుంచి తొలగిస్తే... అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి ఏడుస్తూ పంజాగుట్ట, అక్కడి నుంచి బీహెచ్‌ఈఎల్ వెళ్లిన రోజు ఎప్పటికీ మర్చిపోను. 'మిస్టర్ బచ్చన్' ఫ్లాప్ తర్వాత నాలో ఒక విధమైన ప్రశాంతత వచ్చింది. నాకు ఇష్టమైన పుస్తకాలు చదువుతున్నా. నచ్చిన వ్యక్తులను కలుస్తున్నా. బిజీగా ఉంటే కలవలేనని చెప్పగలుగుతున్నా. ఇటీజ్ బెస్ట్ టైమ్ ఇన్ మై లైఫ్! ఐశ్వర్యానికి అర్థం ఇదే అనుకుంటా!

మూడు ప్రాజెక్టులు...

ప్రస్తుతం చేతిలో మూడు ప్రాజెక్టులు ఉన్నాయి. కేవీఎన్, మైత్రీ మూవీ మేకర్స్, సితారా ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు ఒప్పుకున్నా. ఇక సల్మాన్ విషయానికి వస్తే ఇప్పటి దాకా రెండు మీటింగ్స్ అయ్యాయి. మేమిద్దరం సినిమాను ఒకే కోణం నుంచి చూస్తున్నాం. అంతే కాకుండా ఎలాంటి కథ తీయాలనే విషయంపై ఏకాభిప్రాయం ఉంది. సల్మాన్‌తో త్వరలోనే సినిమా ఉంటుంది. దీనిని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తారు.

పర్వదినం

'విశ్వావసు' అంటే

తెలుగు సంవత్సరాలలో 39వదైన 'విశ్వావసు నామ' సంవత్సరంలోకి అడుగుపెట్టాం. ఈ పేరు 'విశ్వ+వసు' అనే రెండు పదాల కలయిక. 'విశ్వం వాసయతి'.. అంటే 'విశ్వానికి నివాసాన్ని కలిగించినవాడు, భగవంతుడు' అని అర్థం. "ఈ పేరు మహా విష్ణువుకు కూడా వర్తిస్తుంది. శుభకారకుడైన శ్రీహరి పేరిట ఉన్న ఈ ఏడాది అందరికీ సంతోషాన్ని కలిగించి, పరస్పర ప్రేమానురాగాలను పెంపొందిస్తుంది.

సర్వత జాయతే క్షేమం సర్వ సస్య మహార్ఘతా
విశ్వావసౌ వరారోహే కార్పాసస్య మహార్ఘతా...

విశ్వావసు నామ సంవత్సరంలో అందరికీ అన్నింటా క్షేమం కలుగుతుంది. పాడి పంటలు బాగుంటాయి. ప్రత్యేకించి పత్తి పంటలు బాగా పండుతాయి" అనేది పంచాంగకర్తల నిర్వచనం.

కాగా ఇది ఏకాదశ గంధర్వ గణాలలో ఒకరైన గంధర్వుడి పేరని కూడా అంటారు. ఈ పేరు వేదాలలో కూడా కనిపిస్తుంది. "అతను సంపదను ప్రసాదించేవాడు, వివాహ సమయంలో నూతన వధూవరుల మధ్య అనురాగం ఏర్పడి, అది దినదిన ప్రవర్ధమానమయ్యేలా చేసేవాడు" అని కూడా పండితులు చెబుతున్నారు.

సంవత్సరాలకు ఆ పేర్లు ఎలా వచ్చాయి?

సంవత్సరాల పేర్ల వెనుక ఆసక్తికరమైన పురాణ గాథ ఒకటి ఉంది.



ఒకసారి వైకుంఠానికి నారదుడు వచ్చి, మహా విష్ణువును దర్శించుకున్నాడు. వారి మధ్య విష్ణు లీలల ప్రస్తావన వచ్చింది. ఆ లీలలు, మాయల ప్రభావానికి ఎవరైనా లోనవుతారేమో కానీ... అవి తనపై పని చెయ్యవని నారదుడు అన్నాడు. విష్ణువు నవ్వి "సరే నారదా!" అని భూలోకంలోని ఒక అడవిలో ఉన్న సెలయేరును నారదుడికి చూపిస్తూ... "వెళ్ళి దానిలో స్నానం చెయ్యి" అని చెప్పాడు. నారదుడు ఆ సెలయేరులో స్నానం చేయగానే స్త్రీగా మారిపోయాడు. తన గతాన్ని పూర్తిగా మరచిపోయాడు. ఏదీ అర్థం కాని స్థితిలో అటూ ఇటూ తిరుగుతూ ఉండగా... వేట కోసం అడవికి వచ్చిన ఒక రాజు... స్త్రీ రూపంలో ఉన్న నారదుణ్ణి చూసి మోహించాడు. ఆమెను ఒప్పించి వివాహం చేసుకున్నాడు. వారికి అరవై మంది కుమారులు కలిగారు. వారు పెరిగి పెద్దవారయ్యాక... వేరొక రాజ్యంతో యుద్ధం సంభవించింది. ఆ యుద్ధంలో రాజు, ఆ అరవై మంది కుమారులు మరణించారు. ఇది తెలుసుకున్న రాణి (స్త్రీరూపంలో ఉన్న నారదుడు) రోదిస్తూ, మహా విష్ణువును ప్రార్థించింది. అప్పుడు విష్ణువు ప్రత్యక్షమై... "నారదా! నువ్వు ఎవరనేది నీకు ఇంకా గుర్తుకురాలేదా?" అన్నాడు. తక్షణమే నారదుడు తన పూర్వరూపంలోకి మారిపోయాడు. అతనికి జరిగినదంతా గుర్తుకు వచ్చింది. సిగ్గుతో తల వంచుకుంటూ "దేవా! నాపై ఎలాంటి లీలలు, మాయలు పని చేయవని అన్నందుకు... నాకు గొప్ప గుణపాఠం నేర్పారు. కానీ బ్రహ్మచారినైన నేను... స్త్రీగా మారి, మాతృత్వాన్ని చవి చూశాను. ఇప్పుడు ఆ కుమారుల మరణాన్ని భరించలేకపోతున్నాను. వారి జ్ఞాపకం శాశ్వతంగా నిలిచేలా చెయ్యి" అని కోరాడు. "ఆ అరవై మంది పేర్లు.. అరవై సంవత్సర నామాలుగా... చిరస్థాయిగా నిలిపోతాయి" అని శ్రీహరి వరం ఇచ్చాడు. ప్రభవ నుంచి అక్షయ వరకూ... అరవై నెలలను వారి పేర్లతోనే పిలుస్తున్నారు. ఈ అరవై పూర్తయిన తరువాత... మరోసారి ప్రభవతో సంవత్సరాల చక్రం పునఃప్రారంభమవుతుంది.

హిందూ సంప్రదాయం ప్రకారం... ఈ 'విశ్వావసు నామ' సంవత్సరాది నాటికి కలి యుగం ప్రారంభమై 5,126 సంవత్సరాలు గడిచాయి. ఈ ఉగాది రోజున 5,127వ సంవత్సరం ప్రారంభమవుతుంది.

సుఖ సౌఖ్యప్రదాయకం... ఉగాది పచ్చడి

ఉగాది అనగానే గుర్తుకువచ్చేది.... ఆరు రుచుల సమ్మేళమైన పచ్చడి. దీని విశిష్టతను, ప్రధానంగా వినియోగించే పదార్థాలను 'ధర్మ సింధు' గ్రంథంలోని ఈ శ్లోకం వివరించింది.

అబ్దాదౌ నింబకుసుమం... శర్కరామ్ల ఘృతైర్యుతమ్
భక్షితం పూర్వయామేస్యా... తద్వర్షం సౌఖ్యదాయకమ్

"ఉగాదినాడు వేపపూత, బెల్లం (పంచదార), చింతపండు, నెయ్యితో కూడిన పచ్చడిని తింటే... రాబోయే సంవత్సరం సౌఖ్యదాయకంగా సాగుతుంది" అని అర్థం.

అలాగే ఉగాది పచ్చడి తింటున్నప్పుడు...

శతాయుష్యం వజ్రదేహం దదార్థం సుఖానిచ
సర్వారిష్టవినాశంచ నింబకందళ భక్షణమ్... అనే శ్లోకాన్ని పఠించాలి. వేపపూతను కలిపిన ఉగాది పచ్చడిని తినడం వల్ల శరీరం వజ్రంలా దృఢంగా మారుతుందనీ, అరిష్టాలన్నీ తొలగిపోతాయనీ, వంద సంవత్సరాలు సుఖ సంతోషాలతో జీవిస్తారని ఈ శ్లోకం చెబుతోంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కన్నప్ప విడుదల వాయిదా



మంచు విష్ణు కీలక పాత్రలో ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కన్నప్ప'. ముందు ప్రకటించిన విధంగా ఏప్రిల్ 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే ఈ చిత్రం విడుదల వాయిదా పడింది. ఈ విషయాన్ని మంచు విష్ణు 'ఎక్స్'లో పోస్టు చేశారు. వీఎఫ్ఎక్స్ పనులు పూర్తి కానందున సినిమా విడుదల వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రకటన చేస్తున్నందుకు అభిమానులకు విష్ణు క్షమాపణలు చెప్పారు. మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఆ అనుభవాలతో పుస్తకం రాస్తాను

- డాక్టర్ అనిల్ విశ్వనాథ్



"28°C' సినిమా షూటింగ్ కోసం మేం చాలా కష్టపడ్డాం. చిత్రీకరణ కోసం రెండు సార్లు జార్జియా వెళ్లినా కొన్ని కారణాల వల్ల అధికారులు వెనక్కు పంపారు. ఎన్నో సవాళ్లను దాటుకొని మూడో ప్రయత్నంలో అక్కడ చిత్రీకరణ పూర్తి చేశాం. అలా ఈ సినిమా అనుభవాలతో ఓ పుస్తకం రాయాలనుకుంటున్నాను' అని డాక్టర్ అనిల్ విశ్వనాథ్ అన్నారు. 'పొలిమేర' చిత్రంతో దర్శకుడిగా చక్కని గుర్తింపు దక్కించుకున్న ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం '28°C'. నవీన్‌చంద్ర, షాలినీ వడ్నికట్టి జంటగా నటించారు. సాయి అభిషేక్ నిర్మించారు. ఏప్రిల్ 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అనిల్ విశ్వనాథ్ మీడియాతో మాట్లాడుతూ 'దర్శకుడిగా నాకు ఇది తొలి సినిమా. అయితే కొన్ని కారణాల వల్ల విడుదల ఆలస్యం అయింది. వైద్య విద్యార్థుల ప్రేమకథకు అతీంద్రియ శక్తులు ఎలాంటి అడ్డంకులు సృష్టించాయి అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ప్రస్తుతం 'పొలిమేర 3' చేస్తున్నాను' అని తెలిపారు.

ఎవరు ఏమైనా అనుకోండి



మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ తెరకెక్కించిన చిత్రం 'ఎల్2: ఎంపురాన్'. ఇటీవలె విడుదలైన ఈ సినిమాలోని పలు సన్నివేశాలు వివాదాస్పదమయ్యాయి. 2002లో గుజరాత్‌లో చోటు చేసుకున్న అల్లర్లను ఈ సినిమాలో కీలక సన్నివేశాలుగా చూపించారనీ, ఒక వర్గాన్ని తక్కువ చేసి చూపించేలా ఆ సన్నివేశాలు ఉన్నాయనీ పలువురు సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రం ప్రదర్శనలను వెంటనే నిలిపివేయాలని వామపక్ష వాదులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర రచయిత మురళీ గోపి స్పందించారు. 'ఈ వివాదంపై నేను మౌనంగా ఉండాలనుకుంటున్నాను. వాళ్లకు నచ్చిన విధంగా అనుకోనివ్వండి. ఒక సినిమాని తమకు నచ్చిన విధంగా ఊహించుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. కాబట్టి వాళ్లకు నచ్చిన విధంగా ఊహించుకోనివ్వండి. నేను మాత్రం మౌనంగానే ఉంటాను' అని మురళీ గోపి పేర్కొన్నారు.

నేటి మ్యాచ్‌లు

ఢిల్లీ x హైదరాబాద్	మ.3.30 నుంచి	వేదిక విశాఖపట్నం
రాజస్థాన్ x చెన్నై	రా.7.30 నుంచి	వేదిక: గువాహటి

జోరు సాగాలని..

వైజాగ్‌లో సన్‌రైజర్స్‌తో క్యాపిటల్స్ ఢీ



విశాఖపట్నం: సాగర తీరాన మరో హోరాహోరీ ఐపీఎల్ పోరుకు వేళైంది. ఆదివారం జరిగే మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుంది. వైజాగ్‌ను రెండో సొంత మైదానంగా ఎంచుకున్న ఢిల్లీ..లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో ఉత్కంఠగా జరిగిన తొలి పోరులో ఒక వికెట్‌తో గెలిచింది. ఈ గెలుపుతో ఆత్మవిశ్వాసం కూడగట్టుకున్న ఢిల్లీ..అదే జోరు కొనసాగించాలని భావిస్తోంది. పైగా..స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ జట్టులో చేరడంతో క్యాపిటల్స్ బ్యాటింగ్ మరింత పటిష్టమైంది. మరోవైపు సొంతగడ్డ ఉప్పల్‌లో..రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో బ్యాటర్లు చెలరేగడంతో ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరుతో హైదరాబాద్ భళా అనిపించింది. బ్యాటర్లతోపాటు బౌలర్లూ సత్తా చాటడంతో ఘనమైన బోణీ కొట్టింది. కానీ ఉప్పల్‌లోనే లఖ్‌నవూతో జరిగిన రెండో మ్యాచ్‌లో 5 వికెట్లతో ఓడిన సన్‌రైజర్స్.. నెట్ రన్‌రేట్ దారుణంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఢిల్లీతో జరిగే పోరులో బలంగా పుంజుకోవాలని హైదరాబాద్ పట్టుదలగా ఉంది.

ఐ-లీగ్‌కు గోదావరి ఎఫ్‌సీ అర్హత


- ఏపీ సూపర్ కప్ టైటిల్ కైవసం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం తొలిసారిగా ఫ్రాంచైజీ విధానంలో నిర్వహించిన ఏపీ సూపర్ కప్ టైటిల్‌ను గోదావరి ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) కైవసం చేసుకుంది. శనివారం అనంతపురంలోని ఆర్డీటీ సాకర్ మైదానంలో జరిగిన ఫైనల్లో గోదావరి ఎఫ్‌సీ 2-1 స్కోరుతో కొల్లేరు ఎఫ్‌సీపై నెగ్గింది. ఈ విజయంతో గోదావరి జట్టు ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్-3కు అర్హత సాధించింది. ఐ-లీగ్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన 30 ప్రఖ్యాత జట్లు పాల్గొంటాయి.

గుజరాత్ ఘనంగా..

- సొంత మైదానంలో బోణీ ● ముంబైకి రెండో ఓటమి
- సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీ ● కట్టడి చేసిన బౌలర్లు



సాయి సుదర్శన్ (41 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 63)

అహ్మదాబాద్: సొంత మైదానంలో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (41 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 63) తన అద్భుత ఫామ్‌ను చాటుకోగా.. బౌలింగ్‌లో ప్రసిద్ధ్ కృష్ణ (2/18), సిరాజ్ (2/34) ప్రత్యర్థిని కట్టడి చేశారు. దీంతో శనివారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 36 పరుగుల తేడాతో నెగ్గి టైటాన్స్ బోణీ చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 196 పరుగులు చేసింది. బట్లర్ (39), గిల్ (38) రాణించారు. హార్దిక్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 160 పరుగులు చేసి ఓడింది. సూర్యకుమార్ (48), తిలక్ వర్మ (39) మాత్రమే ఆకట్టుకున్నారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ప్రసిద్ధ్ నిలిచాడు.

బౌలర్ల హవా: ఈ పిచ్‌పై క్లిష్టమైన ఛేదనకు బరిలోకి దిగిన ముంబై పేలవ ప్రదర్శన కనబర్చింది. ఆరంభం నుంచే వీరిని టైటాన్స్ బౌలర్లు కట్టడి చేశారు. సూర్య, తిలక్ మినహా ఎవరూ నిలువలేకపోయారు. తొలి ఓవర్ లోనే పేసర్ సిరాజ్ గట్టి ఝలక్ ఇచ్చాడు. రెండు వరుస ఫోర్లతో జోరు కనబర్చిన ఓపెనర్ రోహిత్ (8)ను ఓ అద్భుత బంతికి బౌల్డ్ చేశాడు. ఇక వచ్చీ రాగానే తిలక్ 4,4,6తో 15 రన్స్ రాబట్టినా.. అటు సిరాజ్ మరో ఓపెనర్ రికెల్టన్ (6)ను సైతం బౌల్డ్ చేశాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు కేవలం 48/2 స్కోరుతో నిలిచింది. ఈ దశలో తిలక్-సూర్య జోడీ కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకుంది. 8వ ఓవర్‌లో తిలక్ ఫోర్, సూర్య సిక్స్‌తో 15 రన్స్ వచ్చాయి. వీరు క్రీజులో ఉన్నంతసేపు ముంబై పోటీలో ఉన్నట్టు కనిపించింది. కానీ మధ్య ఓవర్లలో స్పిన్నర్లు రషీద్, సాయికిషోర్‌లతో పాటు పేసర్ ప్రసిద్ధ్ అద్భుత బౌలింగ్‌తో ఇబ్బందిపెట్టారు. వీరి ఓవర్లలో భారీ షాట్లు ఆడడం ముంబైకి కష్టమైంది. స్వల్ప వ్యవధిలోనే తిలక్, సూర్యలను ప్రసిద్ధ్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 62 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఇక రాబిన్ మిన్జ్ (3) రెండో మ్యాచ్‌లోనూ విఫలం కాగా.. కెప్టెన్ హార్దిక్ (11) సైతం సహజశైలిలో ఆడలేక 17వ ఓవర్‌లో రబాడకు చిక్కాడు. చివర్లో నమన్ (18 నాటౌట్), శాంట్నర్ (18 నాటౌట్) వేగం ఓటమి అంతరాన్ని తగ్గించేందుకు ఉపయోగపడింది. అయినా ఆఖరి ఓవర్‌లో 46 పరుగులు అవసరం కావడంతో ముంబై ఓటమి ఖాయమని తేలింది.

సుదర్శన్ నిలకడ: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్‌లో టాపార్డర్ మెరుగ్గా రాణించింది. ఓపెనర్లు గిల్, సాయి సుదర్శన్‌ల మెరుపు ఆట కారణంగా తొలి వికెట్‌కు 78 పరుగులు జత చేరాయి. ఆరంభంలో సుదర్శన్ వేగం కనబర్చుతూ ఐదో ఓవర్‌లో 4,6,4తో 15 రన్స్ రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లో గిల్ 6,4తో 20 రన్స్ రావడంతో పవర్‌ప్లేలో గుజరాత్ 66 పరుగులతో పటిష్టంగా కనిపించింది. కానీ ఆ తర్వాత ముంబై బౌలర్లు కట్టడి చేయడంతో పరుగులు నెమ్మదించాయి. గిల్‌ను తొమ్మిదో ఓవర్‌లో హార్దిక్ అవుట్ చేశాడు. అటు సాయి ఆటలోనూ జోరు తగ్గింది. పదో ఓవర్‌లో బట్లర్ 6,4తో స్కోరులో కదలిక తెచ్చాడు. అయితే ఊపు మీదున్న బట్లర్‌ను 14వ ఓవర్‌లో స్పిన్నర్ ముజీబ్ వెనక్కి పంపడంతో రెండో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అలాగే సుదర్శన్ 33 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. ఈ మైదానంలో అతడికి వరుసగా నాలుగో ఫిఫ్టీ కావడం విశేషం. ఇక హార్దిక్ స్లో బాల్‌కు షారుక్ (9) వెనుదిరగగా.. 17వ ఓవర్‌లో రూథర్‌ఫోర్డ్ (18), సుదర్శన్‌ల ఒక్కో సిక్సర్‌తో 19 రన్స్ సమకూరాయి. దీంతో జట్టు స్కోరు 200 ఖాయమనిపించింది. కానీ చివరి మూడు ఓవర్లలో రూథర్‌ఫోర్డ్, సుదర్శన్ సహా మరో ముగ్గురు అవుటవడంతో గుజరాత్ డబుల్ సెంచరీ ఫీట్‌ను కొద్దిలో మిస్సయింది.

2

ఒకే వేదిక (అహ్మదాబాద్)లో తక్కువ ఇన్నింగ్స్ (20)లోనే వెయ్యి పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా గిల్. క్రిస్ గేల్ (బెంగళూరు, 19) ముందున్నాడు.

ఆకట్టుకున్న రాజు

ఐపీఎల్‌లో తొలిసారి ఆడుతున్న కాకినాడ కుర్రాడు పెన్మత్స సత్యనారాయణ రాజు వరుసగా తన రెండో మ్యాచ్‌లోనూ ఆకట్టుకున్నాడు. ముంబై తరఫున గత మ్యాచ్‌లో ఓ ఓవర్ వేసి 13 పరుగులు మాత్రమే ఇచ్చిన రాజు.. గుజరాత్‌తో పోరులో మూడు ఓవర్లు వేసి ఓ వికెట్ (రషీద్) పడగొట్టాడు.



రాజుకు రోహిత్ అభినందన

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	2	2	0	0	4	2.266
లఖ్‌నవూ	2	1	1	0	2	0.963
గుజరాత్	2	1	1	0	2	0.625
పంజాబ్	1	1	0	0	2	0.550
ఢిల్లీ	1	1	0	0	2	0.371
హైదరాబాద్	2	1	1	0	2	-0.128
కోల్‌కతా	2	1	1	0	2	-0.308
చెన్నై	2	1	1	0	2	-1.013
ముంబై	2	0	2	0	0	-1.163
రాజస్థాన్	2	0	2	0	0	-1.882

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

గుజరాత్: సాయి సుదర్శన్ (ఎల్బీ) బౌల్ట్ 63, గిల్ (సి) నమన్ (బి) హార్దిక్ 38, బట్లర్ (సి) రికెల్టన్ (బి) ముజీబ్ 39, షారుక్ ఖాన్ (సి) తిలక్ (బి) హార్దిక్ 9, రూథర్‌ఫర్డ్ (సి) శాంట్నర్ (బి) చాహర్ 18, తెవాటియా (రనౌట్) 0, రషీద్ (సి) హార్దిక్ (బి) సత్యనారాయణ రాజు 6, రబాడ (నాటౌట్) 7, సాయి కిషోర్ (రనౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 196/8; వికెట్ల పతనం:** 1-78, 2-129, 3-146, 4-179, 5-179, 6-179, 7-194, 8-196; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-34-1, దీపక్ చాహర్ 4-0-39-1, ముజీబుర్ రెహ్మాన్ 2-0-28-1, హార్దిక్ పాండ్యా 4-0-29-2, శాంట్నర్ 3-0-25-0, సత్యనారాయణ రాజు 3-0-40-1.

ముంబై: రోహిత్ (బి) సిరాజ్ 8, రికెల్టన్ (బి) సిరాజ్ 6, తిలక్ (సి) తెవాటియా (బి) ప్రసిద్ధ్ 39, సూర్యకుమార్ (సి) గిల్ (బి) ప్రసిద్ధ్ 48, రాబిన్ మిన్జ్ (సి) ఇషాంత్ (బి) సాయి కిషోర్ 3, హార్దిక్ (సి) సిరాజ్ (బి) రబాడ 11, నమన్ ధిర్ (నాటౌట్) 18, శాంట్నర్ (నాటౌట్) 18, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 160/6; వికెట్ల పతనం:** 1-8, 2-35, 3-97, 4-108, 5-120, 6-124; **బౌలింగ్:** సిరాజ్ 4-0-34-2, రబాడ 4-0-42-1, ఇషాంత్ 2-0-17-0, రషీద్ 2-0-10-0, సాయి కిషోర్ 4-0-37-1, ప్రసిద్ధ్ కృష్ణ 4-0-18-2.



ఆ క్రికెటర్లు గౌరవానికి అర్హులు!

రోహిత్ సంచలన వ్యాఖ్యలు

ముంబై: ఈ వ్యాఖ్యలు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఎందుకు చేశాడో తెలియదుకానీ..దేశ క్రికెట్ వర్గాల్లో మాత్రం సంచలనంగా మారాయి. గత మూడు పరిమిత ఓవర్ల ఐసీసీ టోర్నమెంట్లలో..భారత్ 24 మ్యాచ్‌లు ఆడితే ఒకదాంట్లోనే ఓడింది. ఆ ఒక్క ఓటమి భారత్ ఆతిథ్యమిచ్చిన 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఎదురైంది. ఇక..ఇటీవల చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచిన భారత్.. గత జూన్‌లో టీ20 ప్రపంచ కప్ నెగ్గింది. ఈ మధ్యలో స్వదేశంలో న్యూజిలాండ్‌పై, ఆస్ట్రేలియాలో ఆ జట్టు చేతిలో టెస్ట్ సిరీస్‌లు కోల్పోయింది. దీంతో రోహిత్‌పై వచ్చిన విమర్శలు అన్నీఇన్నీ కావు. ఓ దశలో..కెప్టెన్సీ బాధ్యతలనుంచి అతడిని తప్పించాలన్న డిమాండ్లు వినిపించాయి. ఈ పరిణామాలన్నీ రోహిత్‌ను నొప్పించాయేమో! 'ఐసీసీ టోర్నీల్లో 24 మ్యాచ్‌ల్లో 23 గెలవడం ఆషామాషీకాదు. బయట నుంచి చూస్తే ఈ విజయాలు ఎంతో సంతోషంగా కనిపిస్తాయి. కానీ ఈ క్రమంలో జట్టు ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూసింది. ఈ మూడు ఐసీసీ టోర్నీల్లో పాల్గొన్న జట్టు సభ్యులంతా గౌరవానికి అర్హులు. నా 18 ఏళ్ల కెరీర్‌లో చవిచూసిన జయాపజయాలు నాకెన్నో పాఠాలు నేర్పాయి. గత 9 నెలలు అందుకు భిన్నం కాదు' అని ముంబై ఇండియన్స్ 'ఎక్స్'లో పోస్ట్ చేసిన వీడియోలో రోహిత్ అన్నాడు. దాంతో రోహిత్ ఈ వ్యాఖ్యల వెనుక మర్మమేమిటన్న చర్చ బయలుదేరింది. ఇటీవల ఎదురైన విమర్శలను దృష్టిలో ఉంచుకొని హిట్‌మ్యాన్ ఆ విధంగా అన్నాడని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే..రోహిత్ టెస్ట్ సిరీస్ భవితవ్యంపై సెలెక్టర్లు చర్చించనున్నారనే వార్తల నేపథ్యంలో అతడు ఆ విధంగా వ్యాఖ్యానించాడని మరికొందరంటున్నారు.

శరత్.. ఓటమితో వీడ్కోలు



చెన్నై: భారత టేబుల్ టెన్నిస్ స్టార్ ఆచంట శరత్ కమల్ కెరీర్ ప్రస్థానం ముగిసింది. తాను చివరిసారిగా తలపడిన డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్ టోర్నీలో శరత్ ఓటమి పాలయ్యాడు. శనివారం ఇక్కడ జరిగిన సింగిల్స్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో తెలుగు ఆటగాడు స్నేహిత్ 11-9, 11-8, 11-9తో శరత్‌పై గెలుపొందాడు. దీంతో 42 ఏళ్ల శరత్ కెరీర్ పరాజయంతో ముగిసినట్లయింది. ఈ టోర్నీనే తనకు ఆఖరిదని శరత్ ఇదివరకే ప్రకటించిన సంగతి తెలిసిందే. 'ఆటగాడిగా నా కథ ముగిసింది. ఇక.. పరిపాలకునిగా, కోచ్‌గా, మెంటార్‌గా ఇలా.. ఏదైనా పాత్రలో ఒదిగిపోవాలనుకుంటున్నా' అని శరత్ తన వీడ్కోలు ప్రసంగంలో వెల్లడించాడు. కాగా, ప్రీక్వార్టర్స్‌లో శరత్‌పై నెగ్గిన స్నేహిత్ క్వార్టర్స్‌లో పోరెట్ (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు.

కివీస్‌దే బోణీ

తొలి వన్డేలో పాక్ ఓటమి

నేపియర్: న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను కూడా పాకిస్తాన్ ఓటమితోనే ఆరంభించింది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో మార్క్ చాప్‌మన్ (132) శతక సహాయంతో ఆతిథ్య కివీస్ 73 పరుగులతో గెలిచింది. ఇప్పటికే పాక్ ఐదు టీ20ల సిరీస్‌ను 4-1తో ఓడిన విషయం తెలిసిందే. ముందుగా కివీస్ 50 ఓవర్లలో 344/9 స్కోరు సాధించింది. మిచెల్ (76), మహమ్మద్ అబ్బాస్ (52) అర్ధసెంచరీలు చేశారు. భారీ ఛేదనలో పాక్ 44.1 ఓవర్లలో 271 రన్స్‌కే పరిమితమైంది. బాబర్ (78), సల్మాన్ ఆఘా (58) రాణించారు. నాథన్ స్మిత్‌కు 4, డఫీకి 2 వికెట్లు దక్కాయి. పాక్ మూలాలున్న అబ్బాస్ ఈ మ్యాచ్‌లో కివీస్ తరఫున అరంగేట్రం చేశాడు. 24 బంతుల్లోనే ఫిఫ్టీ బాదిన అబ్బాస్.. అరంగేట్ర వన్డే మ్యాచ్‌లో వేగవంతమైన అర్ధసెంచరీ చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలో 2021లో ఇంగ్లండ్‌పై 26 బంతుల్లోనే ఫిఫ్టీ కొట్టిన టీమిండియా ఆల్‌రౌండర్ క్రునాల్ పాండ్యా రికార్డును అధిగమించాడు.

కొత్త ఆర్థిక సంవత్సరంలో కీలక పన్ను మార్పులు..

మీరు పన్ను చెల్లింపుదారా..? ఏటా ఆదాయ పన్ను రిటర్నులు సమర్పిస్తున్నారా..? అయితే, కొత్త ఆర్థిక సంవత్సరంలో అమల్లోకి రానున్న కీలక పన్ను మార్పులను తప్పక తెలుసుకోవాల్సిందే..

రూ.12 లక్షల వరకు ఆదాయంపై పన్ను లేదు: కొత్త పన్ను విధానంలో సెక్షన్ 87ఏ కింద లభించే పన్ను రిబేటును రూ.25,000 నుంచి రూ.60,000కు పెంచుతున్నట్లు 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రకటించారు. అంటే, రూ.12 లక్షల వరకు వార్షికాదాయం ఉన్న వారికి (వేతన జీవులైతే, స్టాండర్డ్ డిడక్షన్ వెసులుబాటుతో రూ.12.75 లక్షల వరకు ఆదాయంపై) పన్ను చెల్లింపుల నుంచి పూర్తిగా ఊరట లభించనుంది.

టీడీఎస్ నిబంధనలో మార్పులు: చిన్న మొత్తాల్లో పన్ను చెల్లించే వారికి ఊరట కల్పించేందుకు ఏప్రిల్ 1 నుంచి ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ (టీడీఎస్) పరిమితిని పెంచింది ప్రభుత్వం. ఉదాహరణకు సీనియర్ సిటిజన్లకు వడ్డీ ఆదాయంపై టీడీఎస్ వర్తింపు పరిమితి రూ.లక్షకు పెరగనుంది. అంటే, వార్షిక వడ్డీ ఆదాయం రూ.లక్ష మించితేనే టీడీఎస్ వర్తిస్తుంది.

టీసీఎస్ నిబంధనలో మార్పు: వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్ (టీసీఎస్) పరిమితి కూడా పెరగనుంది. ఇది విదేశీ ప్రయాణాలు, పెట్టుబడులు, ఇతర లావాదేవీలను ప్రభావితం చేయనుంది. ప్రస్తుతం రూ.7 లక్షలకు పైగా విదేశాలకు పంపే సొమ్ముపై ఏ అవసరం కోసం పంపుతున్నారన్న ఆధారంగా 0.5 శాతం నుంచి 20 శాతం వరకు టీసీఎస్ చెల్లించాల్సి ఉంటుంది. వచ్చే నెల నుంచి ఈ పరిమితి రూ.10 లక్షలకు పెరగనుంది.

అప్‌డేటెడ్ ఐటీ రిటర్నుల ఫైలింగ్‌కు మరింత సమయం: ఇకపై అప్‌డేటెడ్ ఐటీ రిటర్నుల ఫైలింగ్‌కు 48 నెలల (4 ఏళ్ల) వరకు గడువు లభించనుంది. ప్రస్తుతం ఇది 12 నెలలు (ఏడాది)గా ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఏ కారణంగానైనా రిటర్ను సమర్పించలేకపోయినట్లయితే, దాన్ని అప్‌డేట్ చేసేందుకు నాలుగేళ్ల వెసులుబాటు లభించనుంది.

బిజినెస్ ప్లస్

30, 40, 50 ఏళ్లలో రిటైర్మెంట్ ప్రణాళిక ఇలా..

ఆలస్యమైనా ఆరంభించడం ఎంతో ముఖ్యం

జీవితంలో మలి దశ ఆర్థిక అవసరాలను సమకూర్చుకునేందుకు వీలైనంత త్వరగా రిటైర్మెంట్ ప్రణాళికను ప్రారంభించడం మేలు. ఈ ప్లానింగ్‌లో ఏటేటా పెరుగుతున్న ధరలు, వైద్య ఖర్చులు, ఆయుర్దాయం వంటి అంశాలను తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. అప్పుడే రిటైర్మెంట్ అనంతర జీవితానికి తగినన్ని నిధులను పోగేయగలం. కానీ, తక్కువ ఆదాయం, కుటుంబ వ్యయ భారం వంటి సవాళ్ల కారణంగా చాలా మంది కెరీర్ ప్రారంభం నుంచే రిటైర్మెంట్ ప్లానింగ్‌కు శ్రీకారం చుట్టలేకపోతున్నారు. ఆలస్యమైనా ఫర్వాలేదు.. ఏదో ఒక దశలో మొదలు పెట్టడం చాలా ముఖ్యం. అవసరం కూడా. మరి 30, 40, 50 ఏళ్ల వయసులో రిటైర్మెంట్ ప్రణాళిక ప్రారంభించే వారు అనుసరించాల్సిన వ్యూహాలేంటో తెలుసుకుందాం..



30 లో..

ముప్పై ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు మీ నెలవారీ ఖర్చులు రూ.30,000 అనుకుందాం. ఏటా 5 శాతం చొప్పున పెరుగుతూ పోతుంటే, మీరు రిటైర్ అయ్యేనాటికి మీ నెలవారీ ఖర్చులు రూ.1.33 లక్షలకు చేరుకోవచ్చు. పర్యవసానంగా రిటైర్ అయిన తొలి ఏడాదిలో మీకు ఖర్చులకు రూ.16 లక్షలు అవసరమవుతాయి. 5 శాతం ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే, మీకు 80 ఏళ్లు వచ్చేవరకు మొత్తం రూ.5.3 కోట్లు అవసరం. కాబట్టి, మీరు దీర్ఘకాలంలో అధిక రిటర్నులు అందించేందుకు అవకాశాలున్న ఈక్విటీలు, ఈక్విటీ ఫండ్లలో పెట్టుబడులు పెట్టడం మేలు. ఉదాహరణకు, 30 ఏళ్ల వయసులో ఈక్విటీ ఫండ్‌లో నెలకు రూ.2,000తో సిప్ (క్రమానుగత పెట్టుబడి ప్రణాళిక) ప్రారంభించి, ఏటా ఈ మొత్తాన్ని 10 శాతం చొప్పున పెంచుకుంటూ పోతే, రిటైర్మెంట్ అనంతర అవసరాలను సమకూర్చుకునేందుకు వీలుంటుంది. రిటైర్మెంట్ నాటికి ఫండ్‌లో మీరు మొత్తం రూ.40 లక్షలు పెట్టుబడి పెడతారు. మీ పెట్టుబడులపై ఏటేటా 15 శాతం చొప్పున రిటర్నులతో కలిపి మీ ఫండ్ మొత్తం విలువ రిటైర్మెంట్ నాటికి రూ.2.53 కోట్ల వరకు చేరుకోగలదు. రిటైర్మెంట్ అనంతరం, సిప్ నుంచి ఎస్‌డబ్ల్యూపీ (క్రమానుగత ఉపసంహరణ ప్లాన్)కు మారాలి. మీ ఫండ్ నుంచి 20 ఏళ్ల పాటు నెలకు రూ.1.33 లక్షల చొప్పున సొమ్మును విత్‌డ్రా చేసుకుంటూ పోవాలి. విత్‌డ్రా సొమ్మును ఏటా 10 శాతం చొప్పున పెంచుకోవచ్చు. రిటైర్మెంట్ అనంతరం 20 ఏళ్ల పాటూ మీ ఫండ్ ఏటా 15 శాతం చొప్పున పెరిగితే, నెలనెలా డబ్బును ఉపసంహరించుకున్నప్పటికీ, మీకు 80 ఏళ్లు వచ్చేసరికి మీ ఫండ్‌లో రూ.8 కోట్ల వరకు మిగిలి ఉండే అవకాశం ఉంటుంది.

40 లో..

ఈ వయసులో మీ నెల ఖర్చులు రూ.40,000 అనుకుందాం. ద్రవ్యోల్బణాన్నీ పరిగణలోకి తీసుకుంటే, రిటైర్మెంట్ అయ్యాక తొలి నెలలో మీకు ఖర్చుల కోసం రూ.1.1 లక్షల వరకు అవసరమవుతాయి. అప్పుడు కూడా ఖర్చులు ఏటేటా 5 శాతం చొప్పున పెరిగాయనుకుంటే, రిటైర్మెంట్ అనంతర రెండు దశాబ్దాలకు (60 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వరకు) గాను మొత్తం రూ.4.3 కోట్లు అవసరం. అయితే, రిటైర్మెంట్ ప్రణాళికను 40 ఏళ్లప్పుడు ప్రారంభిస్తున్నందున మీ వద్ద ఎక్కువ సమయం ఉండదు. తక్కువ కాలంలో అధిక సంపద సృష్టికి దూకుడుగా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అలాగని, అధిక రిస్క్ కూడా తీసుకోలేరు. కాబట్టి, మార్కెట్ ఆటుపోట్ల నుంచి కొంత రక్షణ కల్పించే బ్యాలెన్స్ అడ్వాంటేజ్ ఫండ్లలో ఎక్కువ మొత్తంలో సిప్ చేయడం మేలు. నెలకు రూ.12,000 చొప్పున, ఏటేటా 10 శాతం పెంచుతూ పోవాలి. మీ ఫండ్ పెట్టుబడులపై ఏటేటా 12 శాతం రిటర్నులు లభించగలిగితే, రిటైర్మెంట్ అనంతర ఆర్థిక అవసరాలను తీర్చుకోగలిగే వీలుంటుంది. మీరు రిటైర్ అయ్యే నాటికి మీ మొత్తం పెట్టుబడి రూ.82.5 లక్షలకు చేరుతుంది. ఏటేటా 12 శాతం రిటర్నులతో కలిపి మీ ఫండ్ మొత్తం విలువ రూ.2.24 కోట్లకు చేరుకుంది. రిటైర్మెంట్ అనంతరం సిప్ నుంచి ఎస్‌డబ్ల్యూపీకి మారడం ద్వారా మీకు నెలవారీగా అవసరమయ్యే రూ.1.1 లక్షల ఖర్చును సమకూర్చుకోవచ్చు. నెలవారీ విత్‌డ్రా సొమ్మును ఏటా 10 శాతం పెంచుకుంటూ పోయినా, 80 ఏళ్లు వచ్చేవరకూ మీ ఆర్థిక అవసరాలను తీర్చుకోగలుగుతారు.

50 లో..

నడి వయసులో రిటైర్మెంట్ ప్లానింగ్ అంటే చాలా ఆలస్యమైనట్టే. అయినా, సాధ్యమే. భారీ మొత్తాల్లో రిస్క్ తక్కువగా ఉంటే ఆర్థిక పథకాల్లో పెట్టుబడిగా పెట్టడం ద్వారా రిటైర్మెంట్ కార్పస్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ వయసులో మీ నెలవారీ ఖర్చు రూ.50,000 అనుకుంటే, ఖర్చులు ఏటేటా 5 శాతం పెరుగుతున్నాయనుకుంటే, పదవీ విరమణ అనంతరం మొదటి నెలలో ఖర్చులకు రూ.82,000 అవసరం. 60 ఏళ్ల నుంచి 80 ఏళ్ల ప్రయాణం సాఫీగా సాగాలంటే మొత్తం రూ.3.2 కోట్ల నిధులు కావాలి. ఇందుకోసం బ్యాలెన్స్ అడ్వాంటేజ్ ఫండ్‌లో నెలకు రూ.50,000 చొప్పున సిప్ చేయగలిగితే, ఏటా 12 శాతం రిటర్నులు లభించాయనుకుంటే, 60 ఏళ్ల నాటికి మీ ఫండ్ విలువ రూ.1.64 కోట్లకు చేరుకుంటుంది. పదవీ విరమణ అనంతరం సిప్ నుంచి ఎస్‌డబ్ల్యూపీకి మారి మీ నెలవారీ ఖర్చులను ఫండ్ నుంచి విత్‌డ్రా చేసుకోవచ్చు. విత్‌డ్రా సొమ్మును ఏటేటా 10 శాతం చొప్పున పెంచుకుంటూ పోయినా, మీకు 80 ఏళ్లు నిండే నాటికి మీ ఫండ్‌లో ఇంకా రూ.52 లక్షల వరకు మిగిలి ఉండే అవకాశం ఉంది.

ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్.. మరిన్ని విషయాలు..

ఇదీ GST



రాంబాబు గొండాల

గత వారం ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్‌కు సంబంధించి కొన్ని విషయాలు తెలుసుకున్నాం. ముఖ్యంగా ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ అంటే ఏవిటి? దీని కింద ఎవరు రిజిస్ట్రేషన్ తీసుకోవాలి? ఇలాంటి విషయాలు తెలుసుకున్నాం. అయితే ఒక ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ తాను పొందిన క్రెడిట్‌ను వివిధ శాఖల మధ్య ఎలా పంపిణీ చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

ఉదాహరణకు హైదరాబాద్ కేంద్రంగా లక్ష్మీ సిల్క్స్ అనే ఒక షోరూమ్ ఉంది. ఇది ఒక కంపెనీగా రిజిస్టర్ అయ్యింది. దీనికి హైదరాబాద్‌తో పాటు విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబైల్లో కూడా షోరూమ్‌లు ఉన్నాయి. జీఎస్‌టీ చట్టం ప్రకారం ఈ కంపెనీ తనకు షోరూమ్‌లు ఉన్న అన్ని రాష్ట్రాల్లో కూడా రిజిస్ట్రేషన్ పొందింది. అంటే, ఇవన్నీ ఒకటే పాన్ సంఖ్యతో పొందిన రిజిస్ట్రేషన్స్. ఈ షోరూమ్‌లు అన్నీ కూడా తమకు కావాల్సిన బట్టలు, ఇతర సరుకులను తమ షోరూమ్ పేరు మీదే ఇన్వాయిస్‌లు పొందుతాయి. కాబట్టి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) పొందటంలోనూ, దానిని వాడుకోవటంలోనూ ఎలాంటి ఇబ్బంది లేదు. ఇబ్బంది అంతా కామన్‌గా పొందే సర్వీస్‌లతోనే. ఉదాహరణకు ఆడిటర్లకు చెల్లించే ఫీజు, సాఫ్ట్‌వేర్ కోసం ఖర్చు పెట్టడం, ముఖ్యంగా ప్రకటనలు, ఇతర ప్రకటనల ఖర్చులు. వీటిని ఒకటే శాఖ కోసం ఉపయోగించరు కాబట్టి కంపెనీ ఇంతకు ముందు చెప్పినట్లు ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ కింద రిజిస్ట్రేషన్ పొంది ఇలాంటి ఇన్వాయిస్‌లు అన్నీ ఆ రిజిస్ట్రేషన్ మీద తీసుకోవాలి. ఉదాహరణకు ఈ మార్చి నెలలో రూ.10 లక్షలు ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ కింద క్రెడిట్ పొందారనుకుందాం. దీన్ని వివిధ బ్రాంచీలకు ఎలాం పంపిణీ చేయాలో ఇప్పుడు చూద్దాం.

ముందుగా ఈ బ్రాంచీలకు సంబంధించిన గత ఆర్థిక సంవత్సరపు టర్నోవర్ లెక్కించాలి. అంటే 2023-24 ఆర్థిక సంవత్సరం అన్నమాట. ఇందులో హైదరాబాద్ టర్నోవర్ రూ.12 కోట్లు, విజయవాడ రూ.6 కోట్లు, చెన్నై రూ.6 కోట్లు, ముంబై రూ.3 కోట్లు, బెంగళూరు రూ.3 కోట్లు టర్నోవర్ ఉందనకుందాం. అంటే మొత్తం టర్నోవర్ రూ.30 కోట్లు. ఇప్పుడు ఈ రూ.10 లక్షలను పంపిణీ చేయటానికి ముందుగా పొందిన సర్వీస్ ఏ శాఖకు సంబంధించినదో తెలుసుకోవాలి. ఉదాహరణకు రూ.10 లక్షల్లో రూ.2 లక్షలకు సంబంధించిన సర్వీస్ కేవలం హైదరాబాద్ బ్రాంచీ కోసం వాడినట్లయితే, ఆ మొత్తాన్ని ఆ బ్రాంచీకే పంపిణీ చేయాలి. అలా కాకుండా ఒకటికి మించిన బ్రాంచీలకు వాడినట్లయితే, టర్నోవర్ ఆధారంగా దామాషా పద్ధతిలో పంచాలి. ఉదాహరణకు కేవలం, హైదరాబాద్, విజయవాడ షోరూమ్స్‌ల్లోనే ఆధునికీకరణ జరిగింది. దానికి సంబంధించి పొందిన క్రెడిట్ రూ.6 లక్షలు అనుకుంటే, టర్నోవర్ ఆధారంగా హైదరాబాద్ శాఖకు రూ.4 లక్షలు, విజయవాడకు రూ.2 లక్షలు పంపిణీ చేయాలి. అలాకాకుండా పొందిన కామన్ క్రెడిట్ అంటే పైన చెప్పుకున్నట్లు మార్కెటింగ్, ఆడిటింగ్, ప్రకటనలు ఇలాంటి వాటికి సంబంధించిన క్రెడిట్ అన్నీ శాఖలకు సంబంధించినది కాబట్టి, ఇదే విధంగా దామాషా పద్ధతిలో టర్నోవర్ ఆధారంగా అన్నీ శాఖలకు పంచాలి.

క్రెడిట్ పంచేటప్పుడు గుర్తు పెట్టుకోవాల్సిన మరొక ముఖ్య విషయం ఏమిటంటే.. క్రెడిట్‌ను ఐజీఎస్‌టీ, సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ కింద పంచాలి. అంటే పొందిన క్రెడిట్ ఐజీఎస్‌టీ అయితే అన్ని శాఖలకు ఐజీఎస్‌టీ కింద పంపిణీ చేయాలి. అలాకాకుండా సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ అయితే ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ ఉన్న రాష్ట్రంలోని బ్రాంచీకి సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ కింద, మిగిలిన బ్రాంచీలకు ఐజీఎస్‌టీ కింద పంపిణీ చేయాలి.

అంటే పై ఉదాహరణలో ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ రిజిస్ట్రేషన్ అనేది హైదరాబాద్ అడ్రస్ కింద పొంది ఉంటే సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ క్రెడిట్‌ను హైదరాబాద్ బ్రాంచీకి సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ లాగా, మిగిలిన రాష్ట్రాల్లోని బ్రాంచీలకు ఐజీఎస్‌టీ కింద పంపిణీ చేయాలి. ఒకవేళ టర్నోవర్ లెక్కించేటప్పుడు ఏదేనీ శాఖకు గత ఆర్థిక సంవత్సరం ఎలాంటి ఆదాయం లేకున్నా లేదా ఆ శాఖ ప్రస్తుత ఆర్థిక సంవత్సరమే ప్రారంభించి ఉన్నా.. బ్రాంచీల టర్నోవర్ కోసం గడచిన ఆర్థిక సంవత్సరం కాకుండా, గడిచిన త్రైమాసికాన్ని తీసుకోవాలి. ఇది ఏ ఒక్క బ్రాంచీకో కాకుండా అన్నీ బ్రాంచీలకు ఇలానే తీసుకోవాలి.

ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే, ఏదేనీ ఒక బ్రాంచీకి రిజిస్ట్రేషన్ లేకున్నా కామన్ క్రెడిట్‌ను పంపిణీ చేయటానికి ఆ బ్రాంచీ టర్నోవర్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. అలాగే క్రెడిట్ పంపిణీ చేసేటప్పుడు అర్హత లేని క్రెడిట్ కూడా ఇదే పద్ధతిలో విడిగా చూపుతూ పంపిణీ చేయాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	470
వరంగల్	452	గోదావరి	455
చిత్తూరు	520	విశాఖపట్నం	455
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	131	విజయవాడ	137
వరంగల్	131	గుంటూరు	137
కరీంనగర్	131	ఒంగోలు	137
మహబూబ్‌నగర్	131	చిత్తూరు	105
కర్నూలు	131	నెల్లూరు	110
విశాఖపట్నం	109	అనంతపురం	110
గోదావరి	137		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	91,200 ▲	83,600 ▲	1,13,000 ▼
విజయవాడ	92,500 ▲	87,000 ▲	1,00,300 ▼
విశాఖపట్నం	89,290 ▼	81,850 ▼	1,00,730 ▼
రాజమండ్రి	91,200 ▲	83,600 ▲	1,03,700 ▼
ప్రొద్దుటూరు	91,150 ▲	84,400 ▲	1,01,200 ▼
ముంబై	89,164 ▲	81,674 ▲	1,00,892 ▲

లంచం కేసులో హైకోర్టు రిటైర్డు జడ్జి నిర్మల్ యాదవ్ నిర్దోషి



» ఆమెకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లభించలేదు

» 17 ఏళ్ల నాటి కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు

చండీగఢ్, మార్చి 29: ఆస్తి వివాదంలో లంచం తీసుకోవడానికి ప్రయత్నించారన్న కేసులో పంజాబ్-హరియాణా హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ నిర్మల్ యాదవ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ శనివారం ఇక్కడి సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు చెప్పింది. 'జడ్జి ఇంటి గుమ్మం వద్ద నగదు' పేరుతో 17 ఏళ్ల క్రితం సంచలనం సృష్టించిన కేసులో ఆమె బయటపడ్డారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జిపై కేసు నమోదు కావడం అదే తొలిసారి. 2008లో రూ.15 లక్షల నగదు ప్యాకెట్‌ను కొందరు ఆమెకు పంపారని, కానీ పొరపాటున అది అప్పటి మరో సిట్టింగ్ జడ్జి అయిన జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ నివాసానికి చేరిందంటూ కేసు నమోదైంది. ఆ నగదు లబ్ధిదారు జస్టిస్ నిర్మల్ యాదవే అన్న కోణంలో విచారణ జరిగింది. అయితే ఇందుకు తగిన ఆధారాలు లేవంటూ సీబీఐ కోర్టు జడ్జి అల్కా మాలిక్ కేసును కొట్టివేశారు. ఆమెతో పాటు నిందితులుగా ఉన్న మరో నలుగురు వ్యక్తులు- హరియాణా మాజీ అదనపు ఏజీ సంజీవ్ బన్సల్, ఢిల్లీకి చెందిన హోటల్ యజమాని రవీందర్ బాసిన్, చండీగఢ్‌కు చెందిన స్థిరాస్తి సంస్థ డీలర్ రాజీవ్ గుప్తా, నిర్మల్ సింగ్‌లను కూడా నిర్దోషులుగా ప్రకటించారు. సంజీవ్ బన్సల్ 2017 ఫిబ్రవరిలో మరణించడం గమనార్హం. తీర్పుపై నిర్మల్ యాదవ్ స్పందిస్తూ "న్యాయవ్యవస్థపై నాకు నమ్మకం ఉంది. నేను ఏ నేరమూ చేయలేదు" అని అన్నారు.

ఏం జరిగింది?

2008 ఆగస్టు 13వ తేదీ సాయంత్రం 8.30 గంటల సమయంలో పంజాబ్-హరియాణా హైకోర్టు జడ్జి జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ నివాసం వద్దకు పర్కాశ్‌రామ్ అనే వ్యక్తి వచ్చి అక్కడి ప్యూన్ అమ్రిక్ సింగ్‌కు ఒక ప్లాస్టిక్ సంచి ఇచ్చాడు. ఆ సంచిలో నోట్ల కట్టలు కనిపించడంతో జస్టిస్ నిర్మల్‌జిత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పర్కాశ్ రామ్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. ఆగస్టు 26న ఈ కేసు సీబీఐకి బదిలీ అయింది. ఈ ఘటనపై సుప్రీంకోర్టు కూడా అంతర్గతంగా విచారణ జరిపింది. సీబీఐతో పాటు, సుప్రీంకోర్టు అంతర్గత కమిటీలు జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్‌కు క్లీన్‌చిట్ ఇచ్చాయి. 2009 డిసెంబరులో సీబీఐ కేసును మూసివేసింది. అయితే, దాన్ని అంగీకరించని సీబీఐ ప్రత్యేక కోర్టు మళ్లీ దర్యాప్తు చేయాలని 2010 మార్చిలో ఆదేశించింది. 2011 ఏప్రిల్ 18న సీబీఐ కోర్టులో ఛార్జిషీటు సమర్పించింది. ఆ నగదు ప్యాకెట్ జస్టిస్ నిర్మల్ యాదవ్ ఇంటికి తీసుకెళ్లాల్సి ఉండగా, పేర్లు ఒకే మాదిరిగా ఉండడంతో జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ ఇంటి వద్దకు వచ్చిందని సీబీఐ ఆ ఛార్జిషీటులో ఆరోపించింది. తాజాగా కోర్టు అందుకు ఆధారాల్లేవని కేసును కొట్టేసింది.

10, 12 తరగతులకు సీబీఎస్ఈ కొత్త సిలబస్

న్యూఢిల్లీ, మార్చి 29: పాఠ్యాంశాలు, పరీక్షల విధానంలో భారీగా మార్పులు చేసినట్టు సీబీఎస్ఈ ప్రకటించింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 10, 12 తరగతులకు కొత్త సిలబస్‌ను ముద్రించినట్టు తెలిపింది. పదో తరగతి విద్యార్థులు ఫిబ్రవరి, ఏప్రిల్‌లో రెండుసార్లు పరీక్షలు రాసే అవకాశాన్ని కల్పిస్తున్నట్టు పేర్కొంది. 12వ తరగతి విద్యార్థులకు మాత్రం ఏటా ఒక్కసారే పరీక్షలు రాసే అవకాశం ఉంటుంది. 2026 ఫిబ్రవరి 17న బోర్డు ఎగ్జామ్స్ రాయాల్సి ఉంటుందని పేర్కొంది. పదో తరగతి విద్యార్థులు 80 మార్కులకు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. మిగిలిన 20 మార్కులు అంతర్గత మదింపునకు కేటాయిస్తారు. ప్రతి పరీక్షలో కనీసం 33 మార్కులు సంపాదించాల్సి ఉంటుంది. మార్కులకు బదులుగా 9 పాయింట్ల గ్రేడ్ విధానాన్ని అమలు చేస్తారు. 12వ తరగతిలోనూ 9పాయింట్ల గ్రేడ్ విధానం అమలవుతుంది. నైపుణ్యాలకు సంబంధించిన ఎలక్టివ్ సబ్జెక్టులను తీసుకోవాల్సి ఉంటుంది.

ఎక్స్‌ను ఎక్స్‌ఏఐకు అమ్మిన మస్క్

వాషింగ్టన్, మార్చి 29: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌ను అమ్మేశారు. అయితే కొన్న సంస్థ కూడా ఆయనకు చెందినదే కావడం విశేషం. ఎక్స్‌ను కృత్రిమమేధ సంస్థ ఎక్స్‌ఏఐకు 33 బిలియన్ డాలర్లకు విక్రయించినట్లు మస్క్ ప్రకటించారు. ఎక్స్‌కు ఉన్న విశేష ఆదరణతో ఎక్స్‌ఏఐ అధునాతన శక్తిని, నైపుణ్యాన్ని సమ్మిళితం చేయడం ద్వారా అపారమైన సామర్థ్యాన్ని అందుకునే అవకాశం ఉందని ఆ పోస్టులో మస్క్ తెలిపారు. ఈ డీల్‌తో ఎక్స్‌ఏఐ విలువ 80 బిలియన్ డాలర్లుగా, ఎక్స్ విలువ 33 బిలియన్ డాలర్లుగా ఉందని వెల్లడించారు. 2022లో ట్విటర్‌ను కొని దానిని ఎక్స్‌గా మార్చిన మస్క్.. ఏడాది తర్వాత ఎక్స్‌ఏఐను స్థాపించారు.

500 మంది భారతీయ ఖైదీలకు క్షమాభిక్ష

» రంజాన్ నేపథ్యంలో యూఏఈ నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి29: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 500 మంది భారతీయ ఖైదీలకు యూఏఈ ప్రభుత్వం క్షమాభిక్ష పెట్టడంతో పాటు జైళ్ల నుంచి విడుదల చేయాలని నిర్ణయించింది. భారత్-యూఏఈ మధ్య బలమైన సంబంధాలకు ఇది నిదర్శనంగా నిలుస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. విదేశీ జైళ్లలో మగ్గుతున్న భారతీయ ఖైదీలను విడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దౌత్యపరమైన ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి. 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పదేళ్లలో ఇప్పటివరకు సుమారు 10వేల మంది భారతీయ ఖైదీలు విడుదలయ్యారు.

బ్యాంకులను 'కలెక్షన్ ఏజెంట్లు'గా చేశారు: ఖర్గే

న్యూఢిల్లీ, మార్చి 29: మోదీ ప్రభుత్వం ప్రజలను లూటీ చేయడానికి బ్యాంకులను 'కలెక్షన్ ఏజెంట్లు'గా మారుస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. మే 1 నుంచి ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరణ చార్జీలు పెరగనున్న నేపథ్యంలో ఖర్గే 'ఎక్స్' వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. వివిధ బ్యాంకులు పెంచిన చార్జీల జాబితాను ఆయన జత చేశారు. ప్రజలు తమ పొదుపు ఖాతాల్లో కనీస నగదు నిల్వను ఉంచనందుకు 2018-2024 మధ్య మోదీ ప్రభుత్వం రూ.43,500 కోట్లు ముక్కు పిండి వసూలు చేసిందని పేర్కొన్నారు. బ్యాంకులు వివిధ చార్జీల పేరిట ప్రజలను లూటీ చేస్తున్నాయని ఆరోపించారు. ఎవరైనా ఖాతాదారుడు ఏడాదిలో ఎలాంటి లావాదేవీలు నిర్వహించకపోతే రూ.100-200, బ్యాంకు స్టేట్‌మెంట్ జారీ ఫీజు కింద రూ.50-100, ఎస్‌ఎంఎస్ అలెర్ట్‌ల పేరుతో 4 నెలలకు రూ.20-25 చొప్పున, రుణాల మంజూరు సమయంలో 1 నుంచి 3 శాతం ఫీజు వసూలు చేస్తున్నాయన్నారు.

ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ దిశగా ఇస్రో!

న్యూఢిల్లీ, మార్చి 29: ఉపగ్రహ ప్రయోగాల్లో కొత్త శకాన్ని ప్రారంభించే 'ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్' సాకారం దిశగా ఇస్రో మరో ముందడుగు వేసింది. 300 మిల్లీన్యూటన్ల సామర్థ్యమున్న స్టేషనరీ ప్లాస్మా థ్రస్టర్ వెయ్యి గంటల జీవితకాలాన్ని విజయవంతంగా పరీక్షించింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన చేసింది. సదరు థ్రస్టర్‌ను ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్‌లో వినియోగించనున్నారు. ప్రస్తుతం ఉపగ్రహాలను ఒక కక్ష్యలో స్థిరంగా ఉంచటానికి, ఒక కక్ష్య నుంచి మరొక కక్ష్యలోకి పంపించటానికి 'రసాయనిక ప్రొపల్షన్ వ్యవస్థలను' వినియోగిస్తున్నారు. వీటి స్థానంలో ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్‌ను వాడే అవకాశాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఇవి ఫలిస్తే.. ఉపగ్రహాల బరువు తగ్గుతుంది.

ఉప్పు నీటిలో కరిగే ప్లాస్టిక్ తయారీ

టోక్యో, మార్చి 29: సముద్ర జలాల్లో టన్నులకు టన్నులు పేరుకుపోయి అందులోని జీవులతో పాటు మానవ మనుగడకే ముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్‌కు పరిష్కారాన్ని కనుగొన్నారు జపాన్ శాస్త్రవేత్తలు. సముద్ర జలాల్లో(ఉప్పునీటిలో) కరిగి పోయే ప్లాస్టిక్‌ను వారు ఆవిష్కరించారు. సుప్రామాలిక్యులర్ అని పిలిచే ఈ వినూత్న ప్లాస్టిక్ సాధారణంగా ఉపయోగిస్తున్నప్పుడు మన్నికగా ఉండి, సముద్రపు నీటిలో కలిస్తే సురక్షితంగా అందులో విచ్ఛిన్నమవుతుంది. జపాన్‌లోని రైకెన్ శాస్త్రవేత్తలు దీనిని కనుగొన్నారు. పర్యావరణహితమైంది కావడంతో దీనిని విస్తృతంగా వాడకలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు.



మాండలేలోని స్కై విల్లా భవన శిథిలాల వద్ద సహాయక సిబ్బంది



భూకంప తీవ్రతతో కుంగిపోయిన నేల

మయన్మార్‌లో హాహాకారాలు



శిథిలాల కింద చిక్కుకున్న వ్యక్తిని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం

1,664కు చేరిన భూకంప మృతుల సంఖ్య

నేపిడా(మయన్మార్), మార్చి 29: మయన్మార్‌లో సంభవించిన శక్తిమంతమైన భూకంపం.. తదనంతర ప్రకంపనలతో మరణాల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. శనివారం రాత్రి కడపటి వార్తలందేసరికి 1,664 మంది మృతిచెందారని.. 3,408 మంది గాయపడ్డారని, పలువురు గల్లంతయ్యారని అధికారులు వెల్లడించారు. అయితే.. కొండ ప్రాంతాలు, రెబల్స్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మరణాలను అధికారులు పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోంది. అమెరికాకు చెందిన జియోలాజికల్ సర్వే(యూఎస్‌జీఎస్) మృతుల సంఖ్య ఏకంగా 10 వేలకు పైనే ఉంటుందని అంచనా వేసింది. మయన్మార్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో భూకంప ప్రభావం కనిపించింది. భూకంప తీవ్రతకు నేపిడాలోని అంతర్జాతీయ విమానాశ్రయంలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) టవర్ కుప్పకూలి, అందులో ఉన్న సిబ్బంది అంతా చనిపోయారు. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడి ఆలస్యం అవుతుండటంతో మరణాల సంఖ్య బాగా పెరిగే ప్రమాదముందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మయన్మార్‌కు భారత్ సహా.. పలు దేశాలు సహాయక సామగ్రిని తరలించాయి. సహాయక చర్యలకు భారత్ 80 మంది ఎన్‌డీఆర్ఎఫ్ బృందం, 118 మందితో వైద్య బృందాన్ని పంపింది.

అంతటా హాహాకారాలు

భూకంపంతో ఒక్క మండలే నగరంలోనే 700 మందికి పైగా మృతిచెందినట్లు, ఇతర నగరాల్లో కలుపుకొని ఆ సంఖ్య 1,002గా ఉందని మయన్మార్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే.. కొండప్రాంతాలు, అటవీ ప్రాంతాల్లో మరణాలను ఇంకా అంచనా వేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ ప్రాంతాల్లో సహాయక చర్యలు ప్రారంభం కాకపోవడంతో బాధితుల హాహాకారాలు మిన్నంటుతున్నాయి. ఒక్క సికాయ్ పట్టణంలోనే 200 మందికిపైగా మృతదేహాలను కనుగొన్నామని, పర్వత ప్రాంతం కావడంతో ఇంకా సహాయకచర్యలు అందడం లేదని స్థానికులు చెబుతున్నారు. శిథిలాల కింద వందల మంది చిక్కుకుపోయారని పేర్కొన్నారు. భూకంపం సంభవించినప్పుడు ప్రీస్కూళ్లు, కాన్వెంట్లు, మఠాలు, శరణార్థి శిబిరాల్లో వందల మంది ఉన్నట్లు చెప్పారు. ఇక్కడికి సమీపంలో రెబల్స్ ఆధీనంలో ఉన్న గ్రామంలోనూ 18 మరణాలు సంభవించాయి. వంతిన్ ప్రాంతంలో ఓ బౌద్ధారామం కుప్పకూలడంతో ఇద్దరు బౌద్ధ సన్యాసులు సహా.. 36 మంది మృతిచెందారు. టౌంగూ వెహ్లువన్‌లోనూ బౌద్ధమఠం కుప్పకూలడంతో ఐదుగురు చిన్నారులు(శరణార్థుల పిల్లలు), ఒక బౌద్ధ భిక్షువు మృతిచెందారు. ఇక్కడ సహాయక చర్యలు చేపట్టిన అధికారులు.. శిథిలాల కింద నుంచి మరో ముగ్గురిని కాపాడి, స్థానిక ఆస్పత్రికి తరలించారు. టోంగ్యు టౌన్‌షిప్‌లో ఓ మసీదు కూలడంతో ఐగుదురు చిన్నారులు మృతిచెందారని స్థానికులు తెలిపారు. సిచువాన్, మాంటలే, మాగుయి, షెండాంగ్, పెయిచు, యాంగూన్‌లలో ప్రభుత్వం ఎమర్జెన్సీని ప్రకటించింది.



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న రెస్క్యూ సిబ్బంది

30 గంటలకు పైగా పోరాటం

మాండలేలోని న్యూమార్కెట్ వద్ద ఓ ఏడంతస్తుల పాఠశాల భవనం కుప్పకూలిపోయింది. ఏడో అంతస్తులోని వసతిగృహంలో ఉన్న విద్యార్థులు 30 గంటల పాటు మృత్యువుతో పోరాటం చేశారు. ఇక్కడ ఓ ఉపాధ్యాయుడు సహా.. ఐదుగురు మృతిచెందగా.. మిగతా వారిని సురక్షితంగా కాపాడినట్లు సహాయక బృందాలు వెల్లడించాయి. కచ్చిన్‌లోని మరో ప్రాథమిక పాఠశాలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ పాఠశాల భవనం కూలడంతో 24 మంది మరణించగా.. 50 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. శనివారం సాయంత్రం వీరిని సురక్షితంగా వెలికి తీశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆస్పత్రులు భూకంప బాధితులతో నిండిపోతున్నాయి. వేల మంది క్షతగాత్రులకు రక్తం అవసరమవుతోందని మయన్మార్ ఆరోగ్య శాఖ తెలిపింది. రక్తదాతలు వెంటనే ముందుకు రావాలని పిలుపునిచ్చింది. భూకంపం ధాటికి దేశంలోని పలు జైళ్లు దెబ్బతిన్నాయి. భూకంప కేంద్రానికి సమీపంలో ఉన్న మాండలే జైలు, ఓబో జైలులో పలు భవనాలు కుప్పకూలిపోయాయి. అక్కడి ఖైదీల పరిస్థితి ఏమిటనేదానిపై సమాచారం లేదు.

భారత్ సాయం

భూప్రకోపంతో విలవిలలాడి మయన్మార్, థాయ్‌లాండ్‌కు సాయమందించేందుకు అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి. భారత్ ఏకంగా 'ఆపరేషన్ బ్రహ్మ' పేరుతో ఆపన్నహస్తం అందిస్తోంది. 40 టన్నుల సహాయక సామగ్రిని మయన్మార్‌కు పంపింది. ఇందులో టెంట్లు, దుప్పట్లు, స్లీపింగ్ బ్యాగులు, జనరేటర్లు, ఆహార ప్యాకెట్లు ఉన్నాయి. ఇప్పటికే వైమానిక దళం తరలించిన 15 టన్నుల మానవతాసాయం మయన్మార్‌కు చేరిందని, నౌకాదళాన్ని కూడా రంగంలోకి దింపామని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. మృతుల్లో భారతీయులెవరూ లేరని తెలిపింది. సహాయక చర్యల కోసం జాతీయ విపత్తు నిర్వహణ దళం(ఎన్‌డీఆర్ఎఫ్) నుంచి 80 మంది, 118 మంది వైద్య సిబ్బందిని పంపినట్లు వివరించింది. వీరితోపాటు.. నాలుగు రెస్క్యూ డాగ్‌స్క్వాడ్‌లు ఉంటాయని తెలిపింది.



40కి పైగా వారసత్వ కట్టడాలు ధ్వంసం

తాజా భూకంపం, తదనంతర ప్రకంపనల కారణంగా మయన్మార్‌లోని 40కి పైగా వారసత్వ కట్టడాలు పాక్షికంగా/పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిల్లో.. 2019లో యునెస్కో గుర్తించిన బగాన్, 2014లో గుర్తించిన 'ప్యూ' పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. భూకంపంతో మయన్మార్‌లో నిత్యావసరాల ధరలకు రెక్కలొచ్చాయి. కరెంటు కొరత నేపథ్యంలో కొవ్వొత్తులకు డిమాండ్ పెరిగింది. దీంతో.. రూ.250గా ఉండాల్సిన 10 కొవ్వొత్తుల ప్యాకెట్ ధర రూ.450కి పెరిగింది. ఆహార పదార్థాల ధరలు కూడా రెట్టింపయ్యాయి. విద్యుత్తు కొరత కారణంగా.. రోజుకు నాలుగు గంటలు మాత్రమే సరఫరా చేయనున్నట్లు యాంగూన్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ప్రకటించింది.

ప్రధాని మోదీ సంతాపం..

మయన్మార్ విపత్తుపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. మృతులకు సంతాపం తెలిపారు. భూకంప బాధిత దేశాలు మయన్మార్, థాయ్‌లాండ్‌కు 5 మిలియన్ డాలర్ల మేర ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ఐక్యరాజ్య సమితి(ఐరాస) సెక్రటరీ జనరల్ గుటెరస్ ప్రకటించారు. కాగా, మానవతాసాయాన్ని అందించాల్సిన ప్రస్తుత పరిస్థితుల్లో రెబల్స్(పీపుల్స్ డిఫెన్స్ ఆర్మీ) స్థావరాలపై కాల్పులకు విరామం ఇస్తున్నట్లు మయన్మార్ సైనిక ప్రభుత్వం ప్రకటించింది.

అసలే అంతర్యుద్ధం.. ఆపై ప్రకృతి ప్రకోపం

మయన్మార్.. భూకంపాలు అధికంగా సంభవించే దేశం. ప్రకృతి ప్రకోపాన్ని ఎదుర్కోవడం ఆ దేశ ప్రజలకు కొత్తేమీ కాదు. కానీ, శుక్రవారం సంభవించిన భూకంపం మాత్రం ఆ దేశాన్ని, ఆ దేశ ప్రజలను మరింత దీన స్థితికి చేర్చింది. మానవతా హృదయంతో ఆ దేశానికి సాయం చేసే వారున్నా.. ఆ సాయాన్ని అందుకోలేని దుస్థితి మయన్మార్ ప్రజలది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి సైనిక పాలన, అంతర్యుద్ధం, పేదరికంతో అల్లాడుతున్న మయన్మార్ పరిస్థితిని 2021 నుంచి జరుగుతోన్న అంతర్యుద్ధం మరింత దిగజార్చేసింది. సైనిక పాలనకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పాలన కోసం ప్రజలు సాయుధ పోరాటానికి దిగడంతో దేశంలో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. నాలుగేళ్లుగా సైన్యానికి, తిరుగుబాటు దారులకు మధ్య జరుగుతున్న భీకర పోరు వల్ల మయన్మార్ తీవ్రంగా నష్టపోయింది. ఇలాంటి దుర్భర పరిస్థితిలో ఉన్న మయన్మార్‌లో శుక్రవారం సంభవించిన భూకంపం ఆ దేశాన్ని మరిన్ని కష్టాల్లోకి నెట్టేసింది. దీంతో దిక్కుతోచని స్థితిలో నిలిచిన మయన్మార్ పాలకులు గతంలో ఎప్పుడూ లేని విధంగా తమకు సాయం చేయాలని తొలిసారి ప్రపంచాన్ని కోరారు.

మోదీ గొప్ప ప్రధాని

చాలా తెలివైన వ్యక్తి.. నా మంచి మిత్రుడు

సుంకాల ఉద్రిక్తతల వేళ ట్రంప్ ప్రశంసలు



వాషింగ్టన్, మార్చి 29: ప్రధాని మోదీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ప్రశంసలు కురిపించారు. మోదీని గొప్ప మిత్రుడు, చాలా తెలివైన వ్యక్తి అంటూ శుక్రవారం వైట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ట్రంప్ కొనియాడారు. అయితే, భారత్‌పై అధిక సుంకాలు విధించడాన్ని ట్రంప్ సమర్థించుకున్నారు. 'మోదీ ఇటీవల ఇక్కడికి వచ్చారు. మేం ఎప్పటి నుంచో మంచి మిత్రులం. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధిస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. వారు చాలా తెలివైనవారు. మోదీ నాకు గొప్ప మిత్రుడు. ఆయన చాలా తెలివైన వ్యక్తి. మా మధ్య చాలా మంచి చర్చ జరిగింది. అది చాలా మంచి ఫలితాన్ని ఇస్తుందని భావిస్తున్నా' అన్నారు. కాగా, భారత్ సహా అనేక దేశాలపై అమెరికా విధించిన ప్రతీకార సుంకాలు ఏప్రిల్ 2 నుంచి అమలు కానున్నాయి. అలాగే, అమెరికాకు దిగుమతి చేసుకునే ప్రతి వాహనంపైనా 25 శాతం సుంకాలు విధించాలని గురువారం ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఇది కూడా ఏప్రిల్ 2 నుంచి అమలు కానుంది. కాగా, యూఎస్ ఎయిడ్‌కు అంతర్జాతీయంగా ఉన్న కార్యాలయాలను మూసివేయనున్నట్టు ట్రంప్ యంత్రాంగం అమెరికా కాంగ్రెస్‌కు తెలిపింది. భూకంపం ధాటికి కుదేలైన మయన్మార్‌కు ట్రంప్ సాయం ప్రకటించిన సమయంలోనే, ఆయన యంత్రాంగం ఈ ప్రకటన చేయడం గమనార్హం.

17 మంది మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్.. మృతుల్లో 11 మంది మహిళలు

చర్ల/చింతూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. తొమ్మిది రోజుల క్రితం ఈ నెల 20న బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌ను మరువకముందే శనివారం మరో ఘటన చోటుచేసుకుంది. సుక్మా జిల్లా కెర్లపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉప్పంపల్లిలో శనివారం ఉదయం 8 గంటల సమయంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో 17 మంది మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో 11 మంది మహిళలు ఉన్నారు. మృతుల్లో దర్భా డివిజన్ కమిటీ కార్యదర్శి, ప్రత్యేక జోనల్ కమిటీ సభ్యుడు కుహ్రామి జగదీశ్ అలియాస్ బుద్రా కూడా ఉన్నాడు. ఇతనిపై రూ.25 లక్షల రివార్డు ఉంది. కాగా, ఎదురుకాల్పుల్లో నలుగురు జవాన్లకు కూడా గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురు డీఆర్‌జీ, మరొకరు సీఆర్‌పీఎఫ్ జవాను ఉన్నారు. గాయపడ్డ జవాన్ల పరిస్థితి నిలకడగా ఉందని బస్తర్ రేంజ్ మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. గాయపడ్డ జవాన్లను హెలికాప్టర్‌లో రాయపూర్ ఆస్పత్రికి తరలించారు. 17 మంది మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉప్పంపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారంతో డీఆర్‌జీ, 159 బెటాలియన్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్లు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య ఎదురుకాల్పులు జరిగి 17 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. కాగా, శనివారం సాయంత్రం వరకు మృతుల్లో ఏడుగురిని గుర్తించినట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన దర్భా డివిజన్ కమిటీ కార్యదర్శి జగదీశ్ స్వస్థలం సుకుమా జిల్లా కుకనార్ గ్రామం. 2013లో 30 మంది కాంగ్రెస్ నాయకులను హత్య చేసిన ఘటన, 2023లో జవాన్లు ప్రయాణిస్తున్న వాహనాన్ని పేల్చివేసి 10 మందిని హత్య చేసిన ఘటనల్లో జగదీశ్ నిందితుడు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లో ఒకే నెలలో రెండు భారీ ఎన్‌కౌంటర్లు జరిగాయి. మార్చి 20న బీజాపూర్ జిల్లా గంగలూరు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 26 మంది మావోయిస్టులు మృతి చెందగా.. తాజా ఎన్‌కౌంటర్‌లో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 25 మంది మహిళలు ఉన్నారు. వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఇకనైనా మావోయిస్టులు లొంగిపోవాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. మరోవైపు, ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో శనివారం 15 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు పోలీసులు ప్రకటించారు. ఇదిలా ఉండగా, బీజాపూర్ జిల్లాలోనే జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు చనిపోయినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌కౌంటర్ బూటకం

ఛత్తీస్‌గఢ్‌లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు ఆరోపించారు. దండకారణ్యంలో నరమేధం ఆపాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


వక్ఫ్ బోర్డు నిర్ణయాలపై సవాల్!

» ఏ నిర్ణయంపై అయినా కోర్టుకు వెళ్లేలా బిల్లులో కీలక మార్పులు

» బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు: అమిత్ షా

న్యూఢిల్లీ, మార్చి 29: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 4తో ముగియనున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వక్ఫ్ బిల్లుపై కీలక ప్రకటన చేశారు. ప్రస్తుత సెషన్‌లోనే వక్ఫ్ (సవరణ) బిల్లును ప్రవేశపెడుతామని స్పష్టం చేశారు. టైమ్స్ నౌ సమ్మిట్-2025లో ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో చేసిన చట్టానికి భిన్నంగా.. వక్ఫ్ బోర్డు నిర్ణయాలను కూడా కోర్టుల్లో సవాల్ చేసే విధంగా చట్టాన్ని రూపొందిస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 2013లో పార్లమెంట్‌లో సమగ్ర చర్చ చేపట్టకుండా వక్ఫ్ బిల్లును పాస్ చేయించుకుందని విమర్శించారు. బిల్లులోని చాలా నిబంధనలు రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా లేనప్పటికీ, కాంగ్రెస్ పార్టీ తన బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఈ విధంగా చేసిందని అన్నారు. ఏ చట్టమూ రాజ్యాంగం కంటే ఎక్కువేమీ కాదని అమిత్ షా స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు ప్రస్తుత స్థితిని ప్రశ్నిస్తూ.. "వక్ఫ్ బోర్డు గనుక ఒక నిర్ణయం తీసుకుంటే, దాన్ని దేశంలోని కోర్టుల్లో సవాల్ చేసేందుకు అవకాశం లేదు. భారత్ వంటి దేశంలో ఈ పద్ధతిని ఏ విధంగా అనుమతించగలం" అని షా అన్నారు.

లోకం తీరు



స్వచ్ఛందంగా వెళ్లిపోండి!

» క్యాంపస్ ఆందోళనల్లో పాల్గొన్న అంతర్జాతీయ విద్యార్థులకు అమెరికా ఈ-మెయిల్స్ ...జాబితాలో భారతీయ విద్యార్థులు !

వాషింగ్టన్, మార్చి 29: అమెరికాలోని విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లలో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విదేశీ విద్యార్థులంతా స్వచ్ఛందంగా క్యాంపస్ విడిచి వెళ్లిపోవాలని ఆ దేశ విదేశాంగ శాఖ ఈ-మెయిల్ ద్వారా హెచ్చరికలు జారీ చేసింది. వీరితో పాటు ఆందోళనలకు సంబంధించిన సమాచారాన్ని, జాతి వ్యతిరేక సందేశాలను సోషల్ మీడియాలో షేర్ చేసినవారికి కూడా ఈ-మెయిల్ పంపినట్లు ఇమిగ్రేషన్ అటార్నీ అధికారులు ధ్రువీకరించారు. వీరిలో కొంతమంది భారతీయ విద్యార్థులు కూడా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను కాన్సులేట్ అధికారులతో కలసి విదేశాంగ శాఖ ఇటీవల నిశితంగా సమీక్షించింది. ఆ నివేదికల ఆధారంగా తాజా నిర్ణయం తీసుకున్నారు. హమాస్, ఇతర ఉగ్రసంస్థలకు మద్దతు పలుకుతున్న అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేయడానికి అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఏఐ ఆధారిత 'క్యాచ్ అండ్ రివోక్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇది అమల్లోకి వచ్చిన మూడు వారాల్లోనే 300 మందికిపైగా విదేశీ విద్యార్థుల స్టూడెంట్ వీసాలు రద్దయ్యాయి. 'మీకు వీసా జారీచేసిన తర్వాత అదనపు సమాచారం అందుబాటులోకి వచ్చింది. ఫలితంగా అమెరికా ఇమిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టంలోని సెక్షన్ 22(1) ప్రకారం మీ ఎఫ్-1 వీసా రద్దయింది' అని విద్యార్థులకు పంపిన ఈ మెయిల్స్‌లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాలో నివసిస్తున్న భారతీయ వలసదారులపై ట్రంప్ ప్రభుత్వం మరో పిడుగు వేసింది. గ్రీన్‌కార్డుల ప్రాసెసింగ్‌ను నిలిపివేసింది. ఆ దేశంలో శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకొనే వారి వివరాలను మరింత సమగ్రంగా పరిశీలన చేసే లక్ష్యంతో అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేసిన రెండు కార్యనిర్వాహక ఆదేశాలను పాటించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఎస్‌సీఐఎస్ తెలిపింది.



మొగల్తూరు ఉన్నత పాఠశాల భవనం

పవన్ చొరవకు లోకేశ్ తోడు!

» మొగల్తూరు హైస్కూల్ అభివృద్ధికి రూ.1.71 కోట్లు మంజూరు

మొగల్తూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు శ్రీపెన్మత్స రంగరాజా జడ్పీ హైస్కూలుకు మహర్దశ పట్టింది. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలలో అధునాతన సౌకర్యాలు కల్పించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రతిపాదనలు పంపించగా, విద్యాశాఖ మంత్రి లోకేశ్ రూ.కోటీ 71 లక్షలు మంజూరు చేయించారు. ఈ క్రమంలో పవన్‌తో నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ శనివారం ప్రత్యేకంగా మొగల్తూరు అభివృద్ధిపై చర్చించారు. పాఠశాల అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభించి పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే విలేకరులకు తెలిపారు.

చిత్ర నిర్మాణ వ్యయంపై ఈడీ దర్యాప్తునకు ఆదేశించలేం

» 'సంక్రాంతికి వస్తున్నాం'పై దాఖలైన పిల్ కొట్టివేసిన హైకోర్టు

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా నిర్మాణ వ్యయంపై ఈడీతో దర్యాప్తు చేయించాలంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. సినిమాల నిర్మాణ వ్యయంపై న్యాయస్థానాలు విచారణకు ఆదేశించలేవని, ఇది పూర్తిగా కార్యనిర్వాహక వ్యవస్థ పరిధిలోని వ్యవహారమని తేల్చిచెప్పింది. సినిమా నిర్మాణ వ్యయంపై దర్యాప్తు చేయాలని ఈడీని ఆదేశించాలనడం కోర్టు విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని అభిప్రాయపడింది. పిటిషనర్ ఎలాంటి ప్రాథమిక ఆధారాలూ లేకుండా, ఊహాజనితంగా పిల్ దాఖలు చేయడంపై అభ్యంతరం తెలిపింది. ప్రస్తుత పిల్‌ను ప్రజా ప్రయోజనం కోసం కాకుండా పబ్లిసిటీ కోసం దాఖలు చేశారని అభిప్రాయపడింది. అదనపు షోల ప్రదర్శన ఇప్పటికే పూర్తయినందున టికెట్ ధరల పెంపు విషయంలో విచారించాల్సింది ఏమీ లేదని తెలిపింది. టికెట్ ధరల పెంపును 10 రోజులకే పరిమితం చేస్తూ 2022 మార్చి 7న జారీ చేసిన జీవో 13ను సవరించాలనే ప్రతిపాదనలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోందని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో సంక్రాంతికి వస్తున్నాం సినిమా టికెట్ ధర పెంపు, అదనపు షోలకు అనుమతిస్తూ ఈ ఏడాది జనవరి 8న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటిరవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది.

ఏప్రిల్ 30 వరకు రేషన్ కార్డుదారుల ఈకేవైసీకి గడువు

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియ గడువును కేంద్రం ఏప్రిల్ 30వరకు పొడిగించింది. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద రేషన్‌కార్డుదారులకు నిత్యావసర సరుకుల సరఫరాలో పారదర్శకతను పెంపొందించడం, నకిలీ లబ్ధిదారులను నియంత్రించడం, సజావుగా సబ్సిడీల కేటాయింపు కోసం ఈకేవైసీని తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. మార్చి 31వ తేదీ లోపు ఈకేవైసీ ప్రక్రియను నూటికి నూరు శాతం పూర్తి చేయాలని ఇంతకు ముందు గడువును నిర్దేశించినప్పటికీ.. ఇంకా ఈ ప్రక్రియ పూర్తికాకపోవడంతో మరో నెల రోజుల పాటు పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యుత్తు ఒప్పంద కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు రంగంలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదానీ స్మార్ట్ మీటర్లు రావడంతో, పదిహేనేళ్లుగా పని చేస్తున్న మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదంలో పడ్డారని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. శనివారం ఆయన విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

నేడు, రేపూ వాణిజ్య పన్నుల శాఖ సేవలు

» జీఎస్టీ, వ్యాట్ చెల్లింపులకు ప్రత్యేక ఏర్పాట్లు: చీఫ్ కమిషనర్ బాబు

అమరావతి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆదివారం, సోమవారం సెలవు రోజులైనా పన్ను చెల్లింపుదారుల కోసం రాష్ట్రవ్యాప్తంగా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాలు తెరిచే ఉంటాయని ఆ శాఖ ప్రధాన కమిషనర్ అహ్మద్ బాబు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసిపోతున్నందున జీఎస్టీ, వ్యాట్ బకాయిలు కట్టవలసినవారు తప్పనిసరిగా ఈ రెండు రోజుల్లో చెల్లించాలని శనివారం ఆయన కోరారు. పన్ను చెల్లింపుదారులు తమ జీఎస్టీ, వ్యాట్, ఇతర పన్నులను సకాలంలో చెల్లించేందుకు వీలుగా తమ శాఖ కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్యాలయాలకు రాలేనివారు ఆన్‌లైన్‌లో www.apct.gov.in వెబ్‌సైట్ ద్వారా ఎప్పుడైనా పన్నులు చెల్లించే సౌకర్యం ఉందన్నారు.

పశుబీమా ప్రీమియంలో రైతు వాటా తగ్గింపు

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పశువులకు బీమా సౌకర్యం కల్పించి, పోషకులకు ప్రభుత్వం భరోసా ఇస్తోందని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు చెప్పారు. జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ అనుసంధానంతో అమలుచేసే పశు బీమా పథకంలో కొన్ని సవరణలు చేసిందని, తక్కువ ప్రీమియంతో బీమా అందించేందుకు పశుపోషకుల వాటాను 20 నుంచి 15శాతానికి తగ్గిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ విధానం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందని శనివారం తెలిపారు. రాష్ట్రంలోని పశుపోషకులందరూ ఈ బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. పాడి, పని పశువులు, మేకలు, గొర్రెలు, పందులు చనిపోతే. బీమా సొమ్ము పొందే అవకాశం ఉంది. గతంలో 5 పశువులకే పరిమితమైన బీమా ఇక నుంచి 10 పశువులకు వర్తించనున్నది. 50 గొర్రెలు/మేకలకు పరిమితమైన బీమా 100 జీవాలకు వర్తించనున్నది. బీమా ప్రీమియంలో 15% రైతు చెల్లిస్తే.. కేంద్రం 51% కేంద్రం, 34% రాష్ట్రప్రభుత్వం భరించనున్నాయి.

వ్యవసాయ పరికరాలు సత్వరమే సరఫరా చేయండి: ఆగ్రోస్ ఎండీ

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తర్వాత రైతులకు వ్యక్తిగత వ్యవసాయ పరికరాలకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంటే.. రైతులు చెల్లింపులు జరిపినా పరికరాల పంపిణీలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్న కంపెనీలపై ఏపీ ఆగ్రోస్ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఏపీ ఆగ్రోస్ నుంచి జిల్లా మేనేజర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించాలని నిర్ణయిస్తే.. తయారీదారులు సరఫరాలో జాప్యం చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 12,540 దరఖాస్తులను ఏడీఏలు జనరేట్ చేయగా, 7,137 మంది రైతులు వాటా సొమ్ము చెల్లించగా, 1,045 పరికరాలనే కంపెనీలు సరఫరా చేయగా, గ్రామ వ్యవసాయ సహాయకులకు కేవలం 183 పరికరాలే అందినట్లు ఆన్‌లైన్ నివేదికలో తేలడంతో తయారీదారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటా చెల్లించిన రైతులకు వెంటనే పరికరాలు అందించాలని, ఈ నెలాఖరులోపు దరఖాస్తులందరికీ పరికరాలు అందేలా చూడాలని ఆదేశించారు.

రహదారుల నిర్మాణానికి రూ.701 కోట్లు

రాష్ట్రంలో రహదారుల నిర్మాణం, విస్తరణ, అభివృద్ధి కోసం రూ.701 కోట్ల విడుదలకు పరిపాలనా అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా ప్రధాన రహదారులకు రూ.200 కోట్లు, రాష్ట్ర ప్రధాన రహదారుల కోసం రూ.400 కోట్లు, సీఆర్ఎఫ్ కింద రూ.101 కోట్లు కేటాయిస్తూ ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈ నిధులకు పరిపాలనా అనుమతి ఇస్తూ ఆర్అండ్‌బీ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎండీఆర్ కింద ఎమ్మెల్యేల సిఫారసుల మేరకు నియోజకవర్గాల్లో రహదారుల పునర్‌నిర్మాణం, అభివృద్ధి కోసం భారీగా వర్క్‌లను మంజూరుచేశారు. రాష్ట్రంలో 896 కి.మీ. మేర రహదారులను రూ.400 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు అనుమతులు ఇచ్చారు.

వృద్ధాప్యంలో భరించలేని వేధింపులు!

» 'సైబర్' ఉచ్చులో పడి 50 లక్షలు ముట్టచెప్పాం

» బంగారం లోన్‌పై పెట్టాం.. అప్పులు చేశాం

» ఈ వయస్సులో ఎవరి దయతోనో బతకాలనుకోలేదు

» వృద్ధ దంపతుల ఆత్మహత్య వెనుక కదిలించే అంశాలు

» సూసైడ్ నోట్‌లో పేర్కొన్న నిందితులపై కేసు నమోదు



డియోగో నజరత్, పావియా నజరత్ దంపతులు (ఫైల్)

బెంగళూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వేధింపులు, బెదిరింపుల కారణంగా కర్ణాటకలో ఆత్మహత్య చేసుకున్న వృద్ధ దంపతులు.. తీవ్ర మానసిక హింసను అనుభవించినట్లు సూసైడ్ నోట్ ఆధారంగా తెలుస్తోంది. వృద్ధాప్యంలో భరించలేని వేధింపులకు గురయ్యామని, మరొకరి దయతో జీవించకూడదనే ప్రాణాలు తీసుకుంటున్నామని మాజీ ప్రభుత్వ ఉద్యోగి నజరత్ (82) వారి సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. బెళగావి పోలీసులు తెలిపిన వివరాల మేరకు, నజరత్ గొంతు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. 79 ఏళ్ల ఆయన భార్య నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ వృద్ధ దంపతులకు పిల్లలు లేరు. నజరత్ రాసుకున్న రెండుపేజీల సూసైడ్ నోట్‌లో సైబర్ నేరగాళ్లుగా సుమిత్ బిర్రా, అనిల్ యాదవ్ అనే ఇద్దరి పేర్లను ప్రస్తావించారు. ఢిల్లీ టెలికాం శాఖ అధికారిగా సుమిత్ పరిచయం చేసుకున్నాడని, తమ పేరుపై మోసపూరితంగా ఒక సిమ్ కార్డు కొన్నారని, దాన్ని వేధింపులకు, చట్టవిరుద్ధమైన ప్రకటనలకు వినియోగిస్తున్నట్లు చెప్పారని తెలిపారు. ఆ తర్వాత ఫోన్ కాల్‌ను అనిల్ యాదవ్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడని, అతను క్రైమ్ బ్రాంచ్ అధికారినని చెప్పాడని ఆ నోట్‌లో వివరించారు. అప్పుడు అనిల్.. తమ ఆస్తులు, ఆర్థిక వివరాల గురించి అడిగాడని, చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరించాడని పేర్కొన్నారు. దీంతో భయపడి రూ.50 లక్షలకు పైగా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేశామని తెలిపారు. బంగారం తాకట్టు పెట్టి రూ.7.15 లక్షల రుణం కూడా తీసుకున్నామని, కొందరి వద్ద అప్పులు చేశామని పేర్కొన్నారు. అప్పులు తీర్చేందుకు తన భార్య బంగారం అమ్మాలని నజరత్ సూసైడ్ నోట్‌లో రాశాడని పోలీసులు తెలిపారు. ఈ వృద్ధ వయస్సులో తమకు అండగా నిలిచే వారు ఎవరూ లేరని, ఎవరి దయతోనే జీవించాలని అనుకోవడం లేదని భావించి.. ఆత్మహత్య నిర్ణయం తీసుకున్నామని నజరత్ అందులో పేర్కొన్నారు. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. సూసైడ్ నోట్, ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా ఇద్దరు నిందితులపై ఆత్మహత్యకు ప్రేరేపించడం, సైబర్ మోసం కేసులు నమోదు చేశామని, సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని బెళగావి ఎస్పీ భీమశంకర్ తెలిపారు.

డిస్కమ్‌లను ఆదుకోండి

నష్టాల్లో ఉన్న సంస్థలకు సహకారం అందించండి

» కేంద్ర మంత్రి యశోనాయక్‌కు ఇంధన మంత్రి గొట్టిపాటి వినతి



ఢిల్లీలో జరిగిన వివిధ రాష్ట్రాల విద్యుత్ శాఖా మంత్రుల సమావేశంలో ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద, మంత్రి గొట్టిపాటి రవికుమార్ తదితరులు

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వినియోగదారుడి సంతృప్తిని లక్ష్యంగా చేసుకుని విద్యుత్తు పంపిణీ సంస్థ(డిస్కమ్)లను బలోపేతం చేసేలా సహకారం అందించాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కేంద్రాన్ని కోరారు. అన్ని రాష్ట్రాల్లోనూ డిస్కమ్‌లు నష్టాల్లో నడుస్తున్నందున వినియోగదారుడికి సరసమైన ధరల్లో సేవలు అందించడంలో సంస్థలు విఫలమవుతున్నామని తెలిపారు. విద్యుత్తు లైన్లను ఎప్పటికప్పుడు మార్పులు చేయాల్సి ఉందని, కానీ, అలా చేయకపోవడం వల్ల విద్యుదాఘాతాలతో మృతి చెందుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోతోందన్నారు. ఈ మేరకు డిస్కమ్‌ల బలోపేతంపై కేంద్ర ఇంధన శాఖ మంత్రి శ్రీపాద యశోనాయక్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీకి మంత్రి విన్నవించారు. ఈ కమిటీలో పలు రాష్ట్రాల విద్యుత్తు శాఖ మంత్రులు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే రెండు దఫాలుగా సమావేశమైన ఈ కమిటీ శనివారం ఉత్తరప్రదేశ్ రాజధాని లఖ్‌నవ్‌లో మరోసారి భేటీ అయింది. ఈ సమావేశానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. సమావేశంలో గొట్టిపాటి పలు అంశాలను ప్రస్తావించారు.

1 కేంద్ర సహకారంతో రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ సిస్టమ్(ఆర్‌డీఎస్ఎస్) కింద డిస్కమ్‌ల స్వయం సమృద్ధికి చర్యలు చేపడుతున్నా.. మౌలిక సదుపాయాల కోసం భారీగా అప్పులు చేయాల్సి వస్తోంది. ఏపీలో 3 డిస్కమ్‌లకు రూ.62,000 కోట్ల మేర అప్పులు ఉన్నాయి.

1 డిస్కమ్‌లు.. నిర్వహణ కోసం ఆర్థిక సంస్థల నుంచి అధిక వడ్డీకి రుణాలు తీసుకుంటున్నాయి. వడ్డీలు చెల్లించలేక.. వాయిదాలు కట్టేందుకే మళ్లీ అప్పులు చేయాల్సి వస్తోంది. దీంతో డిస్కమ్‌లు ఆర్థికంగా చితికిపోతున్నాయి. డిస్కమ్‌లకు తక్కువ వడ్డీకి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లాంటి సంస్థలు రుణాలు ఇచ్చేలా కేంద్రం ఆదేశించాలి.

1 పాతకాలంనాటి ట్రాన్స్‌మిషన్ విధానాల వల్ల రైతులు, సామాన్యులు విద్యుదాఘాతంతో చనిపోతున్నారు. వీటి నివారణకు ఎప్పటికప్పుడు ట్రాన్స్‌మిషన్ వైర్లు మార్చాలి. విద్యుత్ స్తంభాలు, ఇతర పరికరాల విషయంలో అత్యాధునిక సాంకేతిక నైపుణ్యం వినియోగించాలి. రాష్ట్రాలకు మళ్లీ 'ఉదయ్' కింద సహకారాన్ని అందించాలి.

1 వ్యవసాయ క్షేత్రాల్లో తరచూ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జరుగుతున్నాయి. కొత్తవి బిగించేందుకు సరళీకృత విధానాలు అమలు చేయాలి.

వైసీపీ పాలనలో అప్పులు!

2014-19 మధ్యకాలంలో వినియోగదారులపై చార్జీల భారాన్ని మోపకుండా.. మిగులు విద్యుత్తుతో ముందుకు సాగామని మంత్రి గొట్టిపాటి వివరించారు. కానీ, 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక పునరుద్పాదక విద్యుత్తు రంగ సంస్థలతో రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు చేసుకున్న ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేసిందని తెలిపారు. దీంతో విద్యుత్ కొరత ఏర్పడిందని వివరించారు. కొరతను అధిగమించేందుకు మార్కెట్లో అధిక ధరలకు కరెంటును కొనుగోలు చేశారని తెలిపారు. ప్రైవేటు సంస్థలకు డబ్బులు చెల్లించడం కోసం ఆర్థిక సంస్థల నుంచి అప్పులు తెచ్చారని వివరించారు. 2019-24 మధ్యకాలంలో ఏపీ విద్యుత్ రంగం రూ.1,30,000 కోట్ల మేర అప్పుల భారంలో కూరుకుపోయిందన్నారు. 2024లో చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడ్డాక పునరుద్పాదక విద్యుత్తురంగాన్ని ప్రోత్సహించడంపై ప్రత్యేక దృష్టిని సారించిందని చెప్పారు. కేంద్ర దిశా నిర్దేశం మేరకు ఏపీలో క్లీన్ ఎనర్జీ పాలసీని అమలు చేస్తున్నామని గొట్టిపాటి తెలిపారు. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ లాంటి పునరుత్పాదక విద్యుదుత్పత్తిని చేపడుతున్నందున రాష్ట్రానికి సంపూర్ణ సహకారం అందించాలని కేంద్రమంత్రి యశోనాయక్‌ను అభ్యర్థించారు. రాష్ట్రాల విద్యుత్తు శాఖా మంత్రుల కమిటీ సమావేశం అనంతరం కేంద్ర మంత్రితో గొట్టిపాటి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాయలసీమ ప్రాంతంలో సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తుతో కూడిన హైబ్రీడ్ విద్యుత్తుకు ప్రత్యేకంగా గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని వివరించారు. ఈ గ్రిడ్ ఏర్పాటుకు రూ.28,000 కోట్ల అందించాలని అభ్యర్థించారు. సీమలో అదనంగా 500 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజీ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గొట్టిపాటి కోరారు. దీనికి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద మెగావాట్‌కు రూ.20లక్షల చొప్పున సాయాన్ని అందించాలన్నారు. పల్నాడులో రెండు పునరుద్పాదక ఇంధన పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఈ పార్కులకు సహకారాన్ని అందించాలన్నారు. ఈ అభ్యర్థనలకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్టు రవికుమార్ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల కొరత?

» ఎల్పీజీ ట్రాన్స్‌పోర్ట్ ట్యాంకర్ల సమ్మె ప్రభావం

» 1.56 కోట్ల వినియోగదారుల్లో ఆందోళన



అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎల్పీజీ ట్రాన్స్‌పోర్ట్ ట్యాంకర్ల సమ్మెతో రాష్ట్రంలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడే అవకాశముందని వినియోగదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బల్క్ ఎల్పీజీ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన కొత్త టెండర్ నిబంధనలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దక్షిణ ప్రాంత బల్క్ ఎల్పీజీ ట్రాన్స్‌పోర్టర్లు ఈ నెల 27 నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. దీంతో ఏపీతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు ఎల్పీజీని రవాణా చేసే ట్రాన్స్‌పోర్ట్ లారీలు నిలిచిపోయాయి. రాష్ట్రంలో గ్యాస్ సిలిండర్లు రీఫిల్ చేసే బాట్లింగ్ ప్లాంట్లకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలైన ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ తదితర చమురు శుద్ధి కర్మాగారాల నుంచి ఎల్పీజీ రవాణా నిలిచిపోవడంతో ఆయా ప్లాంట్లలో సిలిండర్ల రీ ఫిల్లింగ్ ప్రక్రియకు అంతరాయం ఏర్పడనుంది. సమ్మె దీర్ఘకాలం కొనసాగితే బాట్లింగ్ ప్లాంట్లలోని ఎల్పీజీ నిల్వలు నిండుకుని రీఫిల్లింగ్ ప్రక్రియ నిలిచిపోతే గృహ, వాణిజ్య అవసరాలకు గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో సుమారు 1.56 కోట్ల కుటుంబాలు వంట గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నాయి. వీటిలో సుమారు 60 లక్షల బీపీఎల్ కుటుంబాలకు ప్రభుత్వం 'దీపం-2' పథకం కింద ఏడాదికి 3 సిలిండర్లను ఉచితంగా అందజేస్తోంది. ట్రైబల్ ప్యాకేజీ కింద మరో 74వేల గిరిజన కుటుంబాలకు సిలిండర్లను అందిస్తోంది. పీఎం ఉజ్వల యోజన కింద దాదాపు 10 లక్షల కుటుంబాలకు వంట గ్యాస్‌పై సబ్సిడీని కేంద్రం అందిస్తోంది. సమ్మె కారణంగా వంట గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చెబుతున్నాయి. సిలిండర్లను రీ ఫిల్లింగ్ చేసే బాట్లింగ్ ప్లాంట్లలో తగినంతగా బల్క్ ఎల్పీజీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, వినియోగదారులు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇస్తున్నాయి.

మామిడికి తెగుళ్ల దెబ్బ

దిగుబడులపై తీవ్ర ప్రభావం

» దెబ్బతీసిన మంగు, నల్ల తామర, పేను కొరుకుడు

» పంటను రక్షించుకునే ప్రయత్నాల్లో రైతులు

» కాయలకు కవర్లు తొడిగి.. రక్షణ కోసం పాట్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



మధుర ఫలం.. మామిడిని ఈ ఏడాది తెగుళ్లు బాగా దెబ్బతీశాయి. దీంతో ధర బాగున్నా.. దిగుబడి పెద్దగా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది మార్చి రెండోవారం వరకు తెల్లవారుజామున మంచు కురవడంతో పండ్లకు మంగు ఏర్పడింది. ఇంకోవైపు తామర పురుగు దాడి చేస్తోంది. మిర్చి సాగైన ప్రాంతాల్లో ఉన్న మామిడి తోటలను నల్ల తామర పురుగు ఆశిస్తోంది. ఏలూరు, ఎన్టీఆర్, ప్రకాశం, కడప, శ్రీసత్యసాయి జిల్లాల్లో నల్ల తామర ప్రభావం ఉందని చెబుతున్నారు. పేను కొరుకుడు విపరీతంగా రావడంతో రైతులు రసాయనాలు పిచికారి చేస్తున్నారు. ఈ ఏడాది పూత బాగా వచ్చినా.. చీడపీడలతో దిగుబడి తగ్గుతుందని చెబుతున్నారు. దిగుబడి తగ్గిపోతున్న నేపథ్యంలో మామిడి ఈ ఏడాది బాగా గిరాకీ పెరిగే పరిస్థితి ఉంది. కొన్ని జిల్లాల్లో చీడపీడలతో కాపు తగ్గినా.. మరికొన్ని జిల్లాల్లో పంట బాగుండటం, మరోవైపు ఎగుమతి ఆర్డర్లు మెరుగుపడటం వల్ల మామిడి ధరలు బాగానే ఉన్నాయి. మొదటి కోతకు ధర బాగున్నా.. ఇప్పుడు ధర తక్కువ పలుకుతోంది. అయితే కాపు చివరి కొచ్చేసరికి మళ్లీ ధరలు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే రైతులు ఒక విడత కాయల్ని కోసి అమ్మేశారు. రెండో విడత కోతకు సిద్ధమౌతున్నారు. అత్యంత నాణ్యమైన పండ్లను రైతులు బయ్యర్ల ద్వారా ఎగుమతిదారులకు విక్రయిస్తుండగా, తక్కువ రకం పంటను స్థానిక మండీల్లో మధ్యవర్తులకు అమ్ముకుంటున్నారు. గత నెలలో బంగినపల్లి మామిడి టన్ను రూ.లక్ష దాకా పలికింది. పంట మార్కెట్‌కు వస్తుండటంతో ధర తగ్గింది. ఇప్పుడు టన్ను రూ.30వేల నుంచి రూ.60వేల దాకా పలుకుతోంది. అయినా నాణ్యత, సైజును బట్టి ధరలు పలికే అవకాశాలున్నాయని చెప్తున్నారు. కాయలకు కవర్లు తొడిగి, రైతులు పంట నాణ్యత పెంచుతున్నారు. నాణ్యమైన పండ్లను దేశ, విదేశాలకు ఎగుమతి చేయడానికి ఉద్యాన శాఖ రైతులకు ఊతమిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది మామిడి పంటకు బీమా వర్తింపజేయడం, ఉద్యాన శాఖ ద్వారా రాయితీలిచ్చి ప్రోత్సహించడం రైతులకు కలిసివస్తోంది. సాధారణంగా హెక్టారుకు 9నుంచి12 టన్నుల మామిడి దిగుబడి వస్తుంది. ఈ ఏడాది 40 లక్షల టన్నుల దిగుబడి అంచనాగా ఉంది. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, నెల్లూరు జిల్లాల్లో పంట ఓ మోస్తరుగా ఉంది. ఏలూరు, ఎన్టీఆర్, ప్రకాశం, అనంతపురం, కర్నూలు తదితర జిల్లాల్లో పూత బాగానే ఉన్నా, చీడపీడలు దెబ్బకొట్టాయి. చిత్తూరు, అన్నమయ్య, విజయనగరం, అనకాపల్లి ప్రాంతాల్లో తోటలు బాగున్నందున ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సగటున 30లక్షల టన్నుల దిగుబడి వస్తుందని ఉద్యాన అధికారులు అంచనా వేశారు. స్థానిక విక్రయాలతో పాటు మన మామిడి ఢిల్లీతోసహా, ఇతర రాష్ట్రాలకు విరివిగా ఎగుమతి అవుతోంది. రాష్ట్రం నుంచి గత ఐదేళ్లలో 1,400టన్నుల మామిడి పండ్లు ఇతర దేశాలకు ఎగుమతి అయ్యాయి. ఈ ఏడాది తాజా పండ్లు 2వేల టన్నులు, గుజ్జు 3లక్షల టన్నులకు తగ్గకుండా ఎగుమతి చేయాలని ఉద్యాన శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అపెడా సంస్థ సమన్వయంతో ఇటీవల బయ్యర్లు, ఎక్స్‌పోర్టర్లతో ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు.

పండ్లకు కవర్లతో రక్షణ

బంగినపల్లి మామిడికి భౌగోళిక గుర్తింపు ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా ఈ రకానికి డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. దీంతో ఈ రకం మామిడిని నాణ్యంగా సిద్ధంచేసి, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బయ్యర్ల ద్వారా ఎగుమతి చేస్తున్నాయి. ఒక్కో కాయ 250-350గ్రా. ఉంటే.. కిలో రూ.60-75 చొప్పున పలుకుతోంది. అయితే మచ్చ, మంగు, ఒత్తిడి, మెత్తదనం లేకుండా రసాయనాలు పిచికారి చేయని పసుపు వర్ణంలో ఉన్న పండ్లకే డిమాండ్ ఉంటోంది. ఈ కారణంగా మంచి ధర, ఎగుమతికి అనువుగా రైతులు మామిడి తోటల్లో కాయలకు జూట్‌తో చేసిన కవర్లు తొడిగి, జాగ్రత్తగా ప్యాకింగ్ చేసి, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అలాగే ఏటా మే-జూన్‌లో చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో తోతాపురం మామిడి నుంచి 3.5లక్షల టన్నుల గుజ్జు ఉత్పత్తి అవుతోంది. గుజ్జును మామిడి తాండ్ర, చాక్లెట్స్, జెల్లీ, మ్యాంగో జ్యూస్‌కు వాడుతున్నారు. తోతాపురి మామిడి గుజ్జు ఎక్కువగా ఆఫ్రికా ఖండానికి ఎగుమతి అవుతోంది. రాష్ట్రంలో మామిడి ప్రొసెసింగ్ యూనిట్లు 50 దాకా ఉన్నా.. 38 మాత్రమే నడుస్తున్నాయి.

మామిడి రైతుకు బీమా

రాష్ట్రంలో మామిడి సాగుకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. మామిడి తోటల నిర్వహణ, పండ్ల నిల్వ సామర్థ్యం, ఎగుమతుల విషయంలో రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా అవగాహన కల్పిస్తోంది. ఎంఐడీహెచ్ పథకం కింద 60% ప్రభుత్వం, 40% రైతులు భరించేలా ఈ ఏడాది 25వేల ఎకరాల తోటల్లోని మామిడి పండ్లకు కవర్లను అమర్చడానికి ఉద్యాన శాఖ రూ.10కోట్లు కేటాయించింది. మామిడి తోటలు, పండ్ల యాజమాన్యంపై ఎస్ఎంఎస్‌ల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

రేపిస్టులకు కఠిన శిక్షలు

» మహిళలు, చిన్నారులకు రక్షణగా 164 శక్తి బృందాలు: డీజీపీ

» ఐదు జిల్లాల్లో తీర్పులపై పోలీసులకు అభినందన

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు తప్పవని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హెచ్చరించారు. వారిని ఉక్కుపాదంతో అణచి వేస్తామని, యావజ్జీవ శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. శనివారం పోలీసు అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో పోక్సో కేసుల్లో ఇటీవల శిక్షలు ఎక్కువగా పడుతుండటాన్ని డీజీపీ ప్రస్తావించారు. విజయనగరం, చిత్తూరు, తిరుపతి, పల్నాడు, అన్నమయ్య జిల్లాల్లో ఐదుగురికి కోర్టులు జైలు శిక్ష విధించడంపై ఆయా జిల్లాల పోలీసుల్ని అభినందించారు. శిక్షల శాతం పెరిగితేనే నేరస్తుల్లో భయం పెరిగి అఘాయిత్యాలు తగ్గుతాయని, బాధితులకు కూడా స్వాంతన లభిస్తుందని పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగించి బాధ్యులకు శిక్షలు పడేలా ఏపీపీలతో సమన్వయం చేసుకోవాలని క్షేత్రస్థాయి పోలీసులకు డీజీపీ సూచించారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల రక్షణ కోసం ఐజీ ర్యాంకు అధికారి నేతృత్వంలో 164 శక్తి బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆడవారికి నిరంతరం రక్షణ కల్పించేందుకు రాష్ట్ర పోలీసు శాఖ పని చేస్తోందని, ప్రతి ఒక్కరూ ఫోన్‌లో 'శక్తి' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.



ఒకే దేశం ఒకే ఎన్నికపై సదస్సులో మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు

పార్టీ ఫిరాయింపులు నిషేధించాలి

» విద్య, వైద్యం తప్ప ఏదీ ఉచితంగా ఇవ్వకూడదు

» 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' దేశానికి ఉపయోగం: వెంకయ్యనాయుడు

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): 'రాజకీయాల్లో ప్రజాప్రతినిధులు మంచినీళ్లు తాగినంత సులభంగా పార్టీలు మారుతున్నారు.. పార్టీ ఫిరాయింపులు నిషేధిస్తూ చట్టం తేవాలి.. పార్టీ మారిన వెంటనే పదవికి రాజీనామా చేయకపోతే వేటు పడేలా అందులో ఉండాలి..' అని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఒకే దేశం- ఒకే ఎన్నిక ప్రాముఖ్యత, సవాళ్లు, ప్రభావం'పై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. శివశంకర్ రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. 'ఉచితాల పేరుతో ఓట్లు వేయించుకుని, ప్రజల డబ్బు పంచుతూ నేతలు ఫొటోలు వేయించుకొంటున్నారు... రాష్ట్రాలు మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి.. ఆర్థిక పరిస్థితులు, ఆదాయ వనరులు అంచనా వేసిన తర్వాతే అప్పులు చేసేలా బ్రేకులు వెయ్యాలి' అని వెంకయ్య అభిప్రాయపడ్డారు. 'ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు జరిగినప్పుడు కేరక్టర్, కేలిబర్, కెపాసిటీ, కాండక్ట్ చూసి పార్టీలు అభ్యర్థులను, ప్రజలు తమ ప్రతినిధులను ఎంపిక చేసుకునేవారని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు క్యాస్ట్, కమ్యూనిటీ, క్యాష్ క్రిమినాలిటీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు ప్రామాణికం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రాజకీయ పార్టీలు అభివృద్ధి, సంక్షేమ అజెండాతో ఎన్నికలకు వెళితే ఇప్పుడు అన్నీ ఫ్రీ ఫ్రీ అంటూ పార్టీల నాయకుల పేర్లతో వెళ్తున్నాయని అన్నారు. అన్నీ ఉచితం అంటూ ఓటర్లను ఆకట్టుకోవడానికి చేస్తున్న విన్యాసాలు ఏపీ, కర్ణాటక, తెలంగాణలో జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి ప్రభుత్వ ఖజానాను దిగజార్చాయని ఆవేదన చెందారు. విద్య, వైద్యం తప్ప ఏదీ ఉచితంగా ఇవ్వరాదని, చేపలు పట్టడం నేర్పించాలి తప్ప... చేపల కూర పంచరాదని హితవు పలికారు. 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' మనకు కొత్త కాదని, 1952 నుంచి 1967వరకూ పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయని వెంకయ్య గుర్తుచేశారు. దీనివల్ల ఎంతో ఖర్చు ఆదా అవడంతో పాటు దేశ జీడీపీకి ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. దేశంలో ఎప్పుడూ ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం ఉంటే రాజకీయ పార్టీలు సైతం ప్రజోపయోగ, సమర్థమైన నిర్ణయాలు తీసుకోలేవని చెప్పారు. జమిలి ఎన్నికల నిర్వహణకు రాష్ట్రాల అభిప్రాయం అవసరం లేదని, స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ఇందులో భాగమైతేనే అవసరమని వెంకయ్య స్పష్టం చేశారు. జస్టిస్ శివశంకర్ రావు మాట్లాడుతూ ఐదేళ్లకు ఒకసారి ఎన్నికల వల్ల పాలన సజావుగా జరుగుతుందని అన్నారు. దేశాభివృద్ధిలో జమిలి ఎన్నిక కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉంటుందని పేర్కొన్నారు. మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, పార్థసారథి, కామినేని శ్రీనివాస్, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధులు వల్లూరు జయప్రకాశ్, యామినీ శర్మ పాల్గొన్నారు.

హైకోర్టు ఏపీఎస్‌పీఎఫ్ యూనిట్‌కు క్రీడల పోటీలు

» విజేతలకు ట్రోఫీ, పతకాలు అందజేత

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకొని హైకోర్టు ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఏపీఎస్‌పీఎఫ్) పోలీసులకు క్రీడల పోటీలు నిర్వహించారు. హైకోర్టు వద్ద ఉన్న మైదానంలో విజయవాడ జోన్ ఏపీఎస్‌పీఎఫ్ కమాండెంట్ శంకరరావు, హైకోర్టు సీఎస్‌వో అసిస్టెంట్ కమాండెంట్ కె.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఈ క్రీడలు జరిగాయి. విజేతల ట్రోఫీతో పాటు పతకాలు అందజేశారు. ఇన్‌స్పెక్టర్లు వి.ప్రసాద్, ఎంవి. శివకుమార్ క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.



టీడీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, వేదికపై అనిత, లోకేశ్, పెమ్మసాని, కొనకళ్ల, కేశినేని చిన్ని, పల్లా, వర్ల, కంభంపాటి, రాజకుమారి, నజీర్ అహ్మద్, గల్లా మాధవి, రామాంజనేయులు, ప్రభాకర్ చౌదరి

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం

సంక్షేమానికి మారుపేరు టీడీపీ.. రాజకీయ కక్షలకు నేను దూరం

తప్పు చేసిన వారి తాట తీస్తా

టీడీపీ ప్రాంతీయ పార్టీ కాదు

- జాతీయభావాలున్న దేశభక్తి పార్టీ
- పార్టీకి వారసులం.. పెత్తందారులం కాదు
- కార్యకర్తల త్యాగం గుర్తు పెట్టుకుంటా
- రాష్ట్రంలో సంపద పెంపుపై దృష్టి పెట్టాం
- టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవంలో చంద్రబాబు వ్యాఖ్యలు

అమరావతి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ స్థాపనకు ముందు రాజకీయాలంటే పెత్తందారీ వ్యవస్థ అన్నట్టు నడిచేవని, అప్పటి వరకూ పాలనకే ప్రభుత్వాలు పరిమితం కాగా, ఎన్టీఆర్ వచ్చాక సంక్షేమానికి శ్రీకారం చుట్టారని ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశానికి సంక్షేమ పథకాలను పరిచయం చేసిందే టీడీపీయేనన్నారు. తెలుగువారు ఉన్నంత వరకూ పార్టీ ఉంటుందని తెలిపారు. టీడీపీ 43 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు చంద్రబాబు ఘన నివాళులు అర్పించారు. అనంతరం జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలూ అందరం పార్టీకి వారసులమేగానీ పెత్తందారులం కాదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. "ఎవరైనా చరిత్ర రాస్తే టీడీపీ ఆవిర్భావానికి ముందు తర్వాత అని రాయాల్సిందే. భావితరాల భవిష్యత్తు గురించి ఆలోచించి వారికి అండగా నిలిచిన పార్టీ ఇది. టీడీపీ వచ్చాకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలకు రాజకీయ అధికారం వచ్చింది. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మరింత పైకి తేవడమే నా లక్ష్యం. మొన్నటి ఎన్నికల్లో అన్ని వర్గాలు, అన్ని కులాలను రాజ్యాధికారంలో బాగస్వాములను చేస్తూ సీట్లు ఇచ్చాం. ఎస్సీ వర్గీకరణపై మాట నిలబెట్టుకున్నాం" అని చంద్రబాబు తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

> "టీడీపీని లేకుండా చేస్తామని విర్రవీగినవారు కాలగర్భంలో కలిసిపోయారు. పార్టీని స్థాపించిన ముహూర్త బలం, సంకల్పం చాలా గొప్పవి. తెలుగుదేశం ఓ స్వర్ణ యుగం అని చరిత్రలో చెప్పుకొనే రోజులు వస్తాయి. 43 ఏళ్లుగా పార్టీకి ఎన్నో సంక్షోభాలు ఎదురయ్యాయి. ప్రతి సంక్షోభాన్నీ అవకాశంగా మలుచుకున్నాం."
> - టీడీపీ అధినేత చంద్రబాబు

జాతీయస్థాయిలో మనదే కీలక పాత్ర

"టీడీపీ ప్రాంతీయ పార్టీ మాత్రమే కాదు, జాతీయ భావాలు ఉండే దేశభక్తి కలిగిన పార్టీ. నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యక్తి ఎన్టీఆర్. మనం యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటు చేశాం. ఎన్డీయే 1, ఎన్డీయే 2, అలాగే ప్రస్తుతం కేంద్రంలో టీడీపీదే కీలకపాత్ర. దేశంలో మరే పార్టీకీ దక్కని విధంగా పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షంగా పనిచేశాం. టీడీపీ ముందుచూపుతోనే సంపద సృష్టి సాధ్యమైంది. ఆనాడు టీడీపీ ప్రారంభించిన పనుల వల్ల దేశంలోనే ఎక్కువ తలసరి ఆదాయం వచ్చే రాష్ట్రంగా ఈనాడు తెలంగాణ నిలిచింది."


ఏపీ పునర్నిర్మాణం కోసమే కూటమి ఏర్పాటు

"దగాపడిన రాష్ట్రాన్ని నిలబెట్టి, ఏపీని పునర్నిర్మించాలని టీడీపీ, బీజేపీ, జనసేన కలిశాయి. మనపై ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అప్పులు చేసి సంక్షేమం ఇస్తే కొన్నాళ్లకు ఆగిపోతాయి. అందుకే సంపద పెంపుపై దృష్టి పెట్టాం. ఓవైపు సంక్షేమం, అభివృద్ధి చేస్తూనే రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్నాం. గత పాలకులు రూ.9.94 లక్షల కోట్ల అప్పులు మిగిల్చారు. అభివృద్ధి ఆగిపోయే పరిస్థితి వచ్చింది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. రూ.200 పింఛన్‌ను రూ.2వేలకు పెంచాం. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఏడాదికి రూ.250 చొప్పున రూ.1000 పెంచడానికి ఐదేళ్లు సమయం తీసుకుంది. మనం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3వేలు నుంచి రూ.నాలుగు వేలు చేశాం. దివ్యాంగుల పింఛను రూ.ఆరువేలకు పెంచాం. పింఛన్లకు ఏడాదికి రూ.33 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. అన్నా క్యాంటీన్లు పెట్టాం. దీపం-2 కింద ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఏప్రిల్, మే నెలలో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం అందిస్తాం. మత్స్యకారులకు రూ.20వేలు ఆర్థికసాయం చేస్తాం. గత ఐదేళ్లలో నిలిపేసిన అమరావతి, పోలవరం పనులు తిరిగి ప్రారంభిస్తాం. పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఎంతో మంది రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారు." అని చంద్రబాబు తెలిపారు.

కార్యకర్త ఫస్ట్.. ఆ తర్వాతే నాయకుడు

"తెలుగుదేశం కార్యకర్తలు నాకు ప్రాణసమానం. ఇన్నేళ్ల ప్రయాణంలో కార్యకర్తల అండదండలతోనే ఎన్నో సవాళ్లు అధిగమించాం. పార్టీయే ప్రాణంగా బతికే పసుపు సైనికులందరికీ మనస్ఫూర్తిగా పాదాభివందనం చేస్తున్నాను. కార్యకర్తల బాధలు చూసి నిద్రపోని రోజులు ఉన్నాయి. కార్యకర్తల త్యాగాలు చూశాను. 'టీడీపీని వీడితే నీ ప్రాణాలు తీయకుండా వదిలేస్తా'మన్నా టీడీపీ జెండా వదలనంటూ ప్రాణాలు పోగొట్టుకున్న చంద్రయ్యలను చూశాను.గత పాలకులు విష సంస్కృతి తెచ్చారు. కానీ రాజకీయ కక్షలకు టీడీపీ దూరం. అదే సమయంలో మంచికి మంచి.. చెడుకు చెడు. ఎవరైనా చెడు చేసి తప్పించుకోవాలంటే తాట తీస్తాను. కార్యకర్తలు హుషారుగా ఉంటే టీడీపీకి ఓటమి లేదు. వారిలో జోష్ తగ్గితే విపక్షాలకు కొమ్ములు వస్తాయి. కార్యకర్త ఫస్ట్.. ఆ తర్వాతే నాయకుడు. నాయకులు వస్తుంటారు... పోతుంటారు. కానీ కార్యకర్తలు శాశ్వతంగా ఉంటారు. 83 రోజుల్లో కోటి సభ్యత్వాలు చేసిన ఏకైక పార్టీ టీడీపీ."


ఆవిర్భావ సభలో కార్యకర్తల ఉత్సాహం



సీనియర్లకు గౌరవం.. జూనియర్లకు ప్రమోషన్

- నేతల చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరిగే వారికే పదవులు
- ఇదే నా స్టైల్.. రెడ్‌బుక్ పేరు చెబితే కొందరికి గుండెపోటు
- టీడీపీ జెండా పీకేస్తామన్నవారే అడ్రస్ లేరు: లోకేశ్

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పసుపు జెండా అంటేనే తెలుగు ప్రజలకు ఒక ఎమోషన్ అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ అన్నారు. తెలుగుదేశం ఆవిర్భావం ఒక సంచలనమైతే.. తొలి గెలుపు ఒక చరిత్ర అన్నారు. రాజకీయాల్లో రికార్డులు కొట్టాలన్నా.. వాటిని తిరగరాయాలన్నా అది టీడీపీకే సాధ్యమన్నారు. టీడీపీ 43 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడారు. 'ఎన్టీఆర్ అనే మూడు అక్షరాలు తెలుగు వారి ఆత్మగౌరవం కోసం తొడకొట్టాయి.. తెలుగు ప్రజల గుండె చప్పుడుగా మారాయి. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది ఎన్టీఆర్. దేశానికి అభివృద్ధిని పరిచయం చేసింది చంద్రబాబు. దేశంలో అత్యధిక పింఛను ఇస్తుంది మన ప్రభుత్వమే. అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే మేనిఫెస్టోలో ఇచ్చిన 177 హామీల్లో 55 పూర్తిగా అమలు చేశాం. 49 పాక్షికంగా అమలు చేశాం. దాదాపు సగానికి పైగా హామీలు అమలయ్యాయి." అని లోకేశ్ వివరించారు. రెడ్ బుక్ గురించి చెబితే కొంత మందికి గుండెపోటు వస్తుందని, కొంత మంది బాత్ రూంలో జారిపడి చేతులు విరగ్గొట్టుకుంటున్నారన్నారు. 'అర్థం అయిందా రాజా ?' అని లోకేశ్ వ్యాఖ్యానించారు. తెలుగుదేశం జెండా పీకేస్తామన్నవారే అడ్రెస్ లేకుండా పోయారన్నారు. టీడీపీకి గల్లీ పాలిటిక్స్‌తోపాటు ఢిల్లీ పాలిటిక్స్ కూడా తెలుసునన్నారు. కేంద్ర ప్రభుత్వాలను శాసించే అవకాశం వచ్చినా, ఎప్పుడూ స్వార్థానికి వాడుకోలేదని, రాష్ట్ర ప్రయోజనాలే మనకు ముఖ్యమన్నారు. అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా చేయడంలో, అంబేడ్కర్‌కు భారతరత్న రావడంలో.. బాలయోగిని పార్లమెంటు తొలి దళిత స్పీకర్‌గా చేయడంలో టీడీపీ కృషి ఉందని లోకేశ్ గుర్తుచేశారు.

పార్టీ ప్రక్షాళన నాతోనే మొదలు పెట్టండి

"కార్యకర్తల కోసం నేను బయట ఎంత పోరాడుతానో పార్టీలో కూడా అంతే పోరాడతాను. పార్టీ కోసం కష్టపడే కార్యకర్త, నాయకులను గుర్తించడమే నా లక్ష్యం. అందుకే పార్టీ ముందు ఒక ప్రతిపాదన ఉంచాను. రెండు విడతలు ఒక పదవి చేసిన తర్వాత అంతకన్నా ఉన్నత పదవికైనా వెళ్లాలి లేదా ఒక విడత విరామమైనా తీసుకోవాలి. ఇది జరిగితే పార్టీలో అన్ని స్థాయిల్లో కదలిక వస్తుంది. గ్రామస్థాయి నాయకుడు కూడా రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగే అవకాశం వస్తుంది. జాతీయ ప్రధాన కార్యదర్శిగా నాలుగోసారి పనిచేస్తున్నా.. పార్టీలో ప్రక్షాళన నాతోనే మొదలు పెట్టండి. సీనియర్లను గౌరవిస్తా. పనిచేసే జూనియర్లకు ప్రమోషన్ ఇస్తా.. ఇదే నా స్టైల్. పార్టీ మరో 40 ఏళ్లు బతకాలి అంటే కొత్త రక్తం ఎక్కించాలి. దానికి అందరి సహకారం కావాలి. పనిచేసే వారికే పదవి అనేది నా నినాదం. నాయకుల చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరిగే వారికే పదవులు. పార్టీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తాం. త్వరలోనే అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తాం' అని లోకేశ్ పేర్కొన్నారు.

అరాచకానికి ఎదురొడ్డాం.. ప్యాలెస్‌లు బద్దలగొట్టాం

"గడిచిన ఐదేళ్ల గతంలో ఎన్నడూ చూడని అరాచక పాలనను ఎదుర్కొన్నాం. దేవాయలం లాంటి పార్టీ కార్యాలయంపై దాడి చేస్తే వెన్ను చూపకుండా ఎదురొడ్డి నిలబడిన ఘనత టీడీపీ కార్యకర్తలదే. పార్టీ అధినేత ఇంటికి తాళ్లు కడితే తెంచుకుని పోరాడాం. మందుపాతరకే భయపడని బ్లడ్ మనది. కామెడీ పీసులకు భయపడతామా? నలుగురు ఎమ్మెల్యేలను లాక్కుని ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తామన్న వారికి నేడు ప్రతిపక్ష హోదా లేకుండా ప్రజలే ఇంటికి పంపారు. ప్యాలెస్‌లు బద్దల కొట్టాం.. అరాచకవాదులను ఇంటికి పంపాం. 2024 ఎన్నికల్లో మన స్ట్రైక్ రేటు 94 శాతం. 58 శాతం ఓటు షేరు సాధించాం.. 8 ఉమ్మడి జిల్లాలు క్లీన్ స్వీప్ చేశాం. ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 65 శాతం ఓట్ షేర్ సాధించాం. ప్రజలు ప్రజాప్రభుత్వం కావాలని కోరుకున్నారు. వారి ఆకాంక్షల మేరకు ఈ ప్రభుత్వం పనిచేస్తుంది. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినేత. కార్యకర్తల సంక్షేమం కోసం ఇప్పటి వరకు సుమారు రూ.140 కోట్లు ఖర్చు చేశాం."

సామాజిక న్యాయం టీడీపీకే సాధ్యం

- కుప్పంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో నారా భువనేశ్వరి వ్యాఖ్య


కుప్పంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నారా భువనేశ్వరి

కుప్పం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యమని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ఆమె 4 రోజుల పర్యటన శనివారం ముగిసింది. శనివారం కుప్పంలో నిర్వహించిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో ఆమె పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా పేదలకు తోపుడు బండ్లు, మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. షాహీ గార్మెంట్స్‌లో మహిళా కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ ప్రజలే దేవుళ్లు-సమాజమే దేవాలయం అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు సంక్షేమాన్ని, అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ప్రభుత్వపరంగా, రాజకీయ నాయకుడిగా ఆయన సాధిస్తున్న విజయాలకు కార్యకర్తల అండదండలే కారణమన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి ఇప్పటి దాకా 7,531 మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు 2500 మందికి ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. కుప్పంలో 150 మంది మహిళలకు టైలరింగ్, జ్యూట్ బ్యాగ్ తయారీ, సిల్క్ దారాలతో గాజుల తయారీ, చికన్‌కారీ ఎంబ్రాయిడరీ తదితర శిక్షణ ఇస్తున్న ట్లు తెలిపారు. స్త్రీ శక్తి విభాగం ఏర్పా టు చేసి స్వయం ఉపాధి శిక్షణ ద్వారా సాధికారత కల్పిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సామాజిక న్యాయం మా బ్రాండ్: పల్లా శ్రీనివాస్



సామాజిక న్యాయం టీడీపీ బ్రాండ్ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది టీడీపీయేనన్నారు. ఎన్టీఆర్ బాటలో ఆయన ఆశయాల సాధనకు సీఎం చంద్రబాబు, యువ నేత లోకేశ్ ముందుకు సాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర హోం మంత్రి అనిత తదితరులు పాల్గొన్నారు.

రథ సారథులు కార్యకర్తలే

- తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకే
- ఎన్టీఆర్ తెలుగుదేశాన్ని స్థాపించారు
- తెలుగోళ్లను సీఎం చంద్రబాబు ప్రపంచ స్థాయిలో నిలబెట్టారు
- పార్టీ ఆవిర్భావ వేడుకల్లో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- ఢిల్లీలో పార్టీ కార్యాలయం కోసం దరఖాస్తు చేశాం: టీడీపీపీ నేత లావు


ఢిల్లీలో కేక్ కట్ చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పక్కన లావు తదితరులు

న్యూఢిల్లీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం పార్టీ మాకు కన్న తల్లితో సమానం. టీడీపీని నడిపించే రథ సారథులు కార్యకర్తలే. వారి కోసం మేం పనిచేస్తాం' అని కేంద్ర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం ఇక్కడ టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. పార్టీ జెండాను లావు శ్రీకృష్ణదేవరాయలు ఎగురవేసి, కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు, లోకేశ్ నాయకత్వంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తాం. తెలుగువారికి జరుగుతున్న అన్యాయాన్ని ఆపేందుకు, తెలుగువారికి దేశ, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉండాలనే కాంక్షతో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారు. ఈ దేశంలో ఎన్నో పార్టీలు వచ్చి కాలగర్భంలో కలిసిపోయాయి. టీడీపీ మాత్రం గత 43 ఏళ్లలో ఎన్నో చారిత్రాత్మక ఘటనలకు వేదికగా నిలిచింది. అందుకు కారణం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, పార్టీ కార్యకర్తలే. టీడీపీ బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచి ప్రోత్సహించింది. అందుకు మా కుటుంబమే ఉదాహరణ. ఒక సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన ఎర్రన్నాయుడుకు 25 ఏళ్లకే టికెట్ ఇచ్చి ఎన్టీఆర్ ఎమ్మెల్యేను చేశారు. ఎర్రన్నాయుడు గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఎదగడంలో టీడీపీ వెన్నంటి నిలిచింది. ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెడితే సీఎం చంద్రబాబు తెలుగువారికి ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చారు. ఇప్పుడు నారా లోకేశ్.. ఎన్టీఆర్, చంద్రబాబు నాయకత్వాన్ని ముందుకు తీసుకెళ్తూ పార్టీని నడిపిస్తున్నారు. ఈ మధ్యకాలంలో టీడీపీని అడ్రస్ లేకుండా చేస్తామని కొంతమంది సవాల్ విసిరారు. వారే అడ్రస్ లేకుండా పోయారు. రాష్ట్రం బాగుండాలి. దేశం బాగుండాలన్న భావన టీడీపీది. ఏపీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వనాశనం అయిన రాష్ట్రాన్ని గాడినపెట్టేందుకు, ఎన్నికల హామీలను నెరవేరుస్తూ, రాష్ట్రాన్ని ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. సీఎం విజన్ స్వర్ణాంధ్ర 2047ను సాకారం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలి.' అని రామ్మోహన్‌నాయుడు అన్నారు.

రెండు నెలల్లో ఢిల్లీలో పార్టీకి స్థలం: లావు

ఇటీవల కేంద్రాన్ని ఢిల్లీలో టీడీపీ కార్యాలయం కోసం స్థలం కేటాయించమని అడిగామని లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఈ మధ్యకాలంలో అన్ని పార్టీల ఆఫీసుల కోసం ఢిల్లీలో స్థలాలు ఇస్తున్నందున టీడీపీకి కూడా స్థలం ఇస్తే పార్టీ కార్యాలయం కట్టుకుంటామని దరఖాస్తు పెట్టుకున్నామని తెలిపారు. నెల రెండు నెలల్లో స్థలం ఇస్తామని కేంద్రం తెలిపిందన్నారు.

60వేల మంది కార్యకర్తలు, నాయకులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు 60 వేల మంది కార్యకర్తలు, నాయకులతో శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 43 ఏళ్లుగా పార్టీ వెన్నంటి ఉన్న కార్యకర్తలు, నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అధికారం కోసం కాకుండా తెలుగు జాతిని అన్ని విధాలా ముందుంచాలన్న లక్ష్యంతో ప్రజలే ముందు అనే నినాదంతో టీడీపీ పనిచేస్తోందన్నారు.


ప్రజల కోసం చంద్రబాబు కుటుంబం త్యాగాలు: బుద్దా



విజయవాడ(వన్‌టౌన్), మార్చి 29(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మనవడు నారా దేవాన్ష్ ఆధ్వర్యంలో 2082 నాటికి తెలుగుదేశం శత వసంతోత్సవాలు జరుపుకొంటుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడలో కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019లో పార్టీ ఓటమి పాలైన తరువాత ఐదేళ్లలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొందన్నారు. చంద్రబాబు కుటుంబం రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేసిందని, ఆ కారణంగానే 2024 ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చిందని తెలిపారు.

తెలుగుదేశం పార్టీకి శుభాకాంక్షలు

\- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. '1982లో ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా, ప్రజల గొంతుకగా ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ 42 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకుని 43వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉంది. విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ, జాతీయ రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదిగి, ప్రజల పక్షాన నిలిచింది. 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు, శుభాకాంక్షలు.' అని పేర్కొన్నారు.


టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, టీడీపీ నేతలు



పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద తిరువూరు నుంచి రమేశ్ రెడ్డి, ఆయనకు మద్దతుగా తరలివచ్చిన పార్టీ కార్యకర్తలతో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గీత దాటితే చర్యలు తప్పవు

- ఎంతటివారైనా వెనుకాడబోం
- త్వరలోనే తిరువూరు వివాదానికి చెక్ పెడతాం
- రమేశ్ రెడ్డి వ్యవహారంపై కొలికపూడితో సహా పార్టీకి ఎవరూ ఫిర్యాదు చేయలేదు: పల్లా శ్రీనివాసరావు
- పార్టీ కార్యాలయానికి కార్యకర్తలతో తరలివచ్చిన రమేశ్ రెడ్డి
- ఎంపీ కేశినేని చిన్నితో వచ్చిన నియోజకవర్గం మాజీ బాధ్యుడు శావల

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): 'ఎవ్వరికైనా పార్టీయే సుప్రీం. పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవు. ఎంతటివారైనా చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోం' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. శనివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వివాదంపై ఆయన స్పందించారు. 'కొలికపూడి చెబుతున్నట్లు రమేశ్ రెడ్డి వ్యవహారాన్ని పార్టీ దృష్టికి తీసుకురాలేదు. ఇప్పటి వరకూ రమేశ్ రెడ్డిపై ఎవ్వరూ పార్టీ పెద్దలకు కానీ, నాకు కానీ ఫిర్యాదు చేయలేదు. త్వరలోనే తిరువూరు వివాదానికి చెక్ పెడతాం' అని తెలిపారు. కాగా, కొలికపూడి ఆరోపణలు చేసిన రమేశ్ రెడ్డి శనివారం పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఆయన వెంట భారీగా స్థానిక నాయకులు తరలివచ్చారు. 'డౌన్ డౌన్ కొలికపూడి', 'తిరువూరుకు కొలికపూడి వద్దు' అంటూ నినాదాలు చేశారు. వారితో పల్లా శ్రీనివాస్ భేటీ అయ్యి సమస్యలను విన్నారు. వారి అభిప్రాయాలను పార్టీ అధినేత చంద్రబాబు, లోకేశ్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. కాగా పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొనేందుకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని వెంట తిరువూరు మాజీ ఇన్‌చార్జి శావల దేవదత్ పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఇది కూడా చర్చనీయాంశమైంది. 'తిరువూరు పంచాయతీని అధిష్ఠానం చూసుకుంటుంది. ప్రతి కుటుంబంలో చిన్నపాటి గొడవలు ఉంటాయి. తిరువూరు సమస్య కూడా కుటుంబ సమస్యలాంటిదే' అని కేశినేని చిన్ని అన్నారు.

న్యూట్రిఫిల్‌కు స్కోచ్ అవార్డు

- ఎన్టీఆర్ ట్రస్ట్ భాగస్వామ్యంతో రూపొందిన యాప్
- నారా భువనేశ్వరి బృందానికి సీఎం అభినందనలు

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్ట్ ప్రమోట్ చేసిన న్యూట్రిఫిల్ యాప్.. స్కోచ్ అవార్డుల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగంలో మొదటి బహుమతి గెలుచుకుంది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. న్యూట్రిఫిల్ యాప్ ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన సలహాలు, సూచనలు అందిస్తుంది. ఈ యాప్ 4 లక్షలకుపైగా ఉచిత కన్సల్టేషన్లను, డైట్ ప్లాన్లను అందించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో పనిచేసే ఈ యాప్ ఆరోగ్య సంరక్షణ విభాగంలో తనదైన ముద్ర వేసింది. న్యూట్రిఫిల్ యాప్ రూపకల్పనలో భాగస్వామిగా నిలిచిన నారా భువనేశ్వరి, ఆమె బృందాన్ని చంద్రబాబు అభినందించారు. ఆరోగ్యకరమైన సమాజ రూపకల్పనకు ఈ బృందం కృషి అభినందనీయమన్నారు.

ఫైబర్‌నెట్, మారిటైమ్‌ల ప్రక్షాళన!

- రెండు కీలక కమిటీల ఏర్పాటు
- నియామకాలపై లోతైన పరిశీలన
- కొత్త నియామకాలు చేపట్టే అధికారం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్, మారిటైమ్ బోర్డులను ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. వైసీపీ హయాంలో ఈ రెండు బోర్డులలోనూ జరిగిన నియామకాలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆలస్యంగానైనా వీటిని ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఫైబర్‌నెట్, మారిటైమ్ బోర్డుల్లో కీలక విభాగాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నవారిని ఎవరు సిఫారసు చేశారో.. వారు నిర్వహిస్తున్న బాధ్యతలు ఏమిటో సమీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వ మౌలిక సదుపాయల శాఖ కార్యదర్శి యువరాజ్ నేతృత్వంలో రెండు కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలు గతంలో చేపట్టిన నియామకాలను సమీక్షించనున్నాయి. అదేవిధంగా కొత్తగా చేపట్టే నియామకాలకు సంబంధించి అభ్యర్థులను ఇంటర్వ్యూ చేయడంతోపాటు నియామక పత్రాలు అందించనున్నాయి. ఇలా రెండు సంస్థలూ ఉద్యోగుల నియామకాలపై లోతైన సమీక్ష చేయడం ద్వారా ఫైబర్‌నెట్, మారిటైమ్ బోర్డులను ప్రక్షాళన చేయనున్నాయి. ఫైబర్ నెట్ కమిటీలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి, ఐ అండ్ ఐ, ఐటీశాఖ కార్యదర్శి, ఏపీఈడీసీ సీఈవో, ఎపీఐసీఎల్ ఎండీ, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో ఉంటారు. అదేవిధంగా మారిటైమ్ బోర్డులో కీలక నియామకాల కోసం ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో, ఎండీ ఏపీఎస్ఎఫ్ఎల్, ఏపీఈడీబీ సీఈవో, ఏపీఐఐసీ ఎండీలతో కూడిన కమిటీని నియమించారు.

ఇవీ ఆరోపణలు

ఫైబర్‌నెట్, మారిటైమ్ బోర్డుల్లో కీలక ఉద్యోగాల నియామకాలు తాడేపల్లి ప్యాలెస్ సిఫారసుల మేరకు జరిగాయని.. ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో నష్టం జరిగిందని విమర్శలు వెల్లువెత్తాయి. అయినప్పటికీ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ వ్యక్తిగత కార్యదర్శి, వైసీపీ ఎంపీలు వాట్సప్ ద్వారా సిఫారసు చేసిన వారందరికీ ఫైబర్‌నెట్, ఏపీ మారిటైమ్ బోర్డులో ఉద్యోగాలు ఇచ్చారు. వీరిలో కొందరు ఐదేళ్లుగా ఉద్యోగాలకు రాకున్నా.. నెలనెలా జీతాలను చెల్లిస్తూ వచ్చారు. ఈ నియామకాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. ఫైబర్‌నెట్ అక్రమాలపై ఇప్పటికే విజిలెన్స్ దర్యాప్తు జరుగుతోంది. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా ఫైబర్‌నెట్, మారిటైమ్ బోర్డులలో ప్రక్షాళనకు నోచుకోకపోవడంపై సర్వత్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఫైబర్‌నెట్, మారిటైమ్ బోర్డుల ప్రక్షాళనకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేయడం గమనార్హం.

ప్రవీణ్ మృతిపై వేగంగా దర్యాప్తు

- ఆయన చేతులు, ముఖంపై రాపుడు గాయాలు
- విజయవాడలో 4గంటల పాటు ఎక్కడున్నారో విచారణ
- ప్రైవేటు సీసీ కెమెరాల ఫుటేజీ కూడా పరిశీలిస్తున్నాం
- అన్ని నివేదికలూ వచ్చాకే మృతిపై స్పష్టతకు అవకాశం
- వదంతులు వ్యాప్తి చేస్తే చర్యలు: ఐజీ అశోక్ కుమార్



రాజమహేంద్రవరంలో జరిగిన సమావేశంలో సీసీ ఫుటేజీ చూపిస్తూ వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ డి.నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై దర్యాప్తు వేగంగా జరుగుతోందని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవీణ్ మృతిపై సీఎం చంద్రబాబు రోజూ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎస్పీ నరసింహ కిశోర్‌తో శుక్రవారం రాత్రి సుమారు 45 నిమిషాలు మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారని చెప్పారు. అనుభవజ్ఞులైన ఉన్న ఇద్దరు డీఎస్పీలను దర్యాప్తు అధికారులుగా నియమించామని వెల్లడించారు. ప్రాథమికంగా పరిశీలించిన అంశాల ప్రకారం.. ప్రవీణ్ హైదరాబాద్‌లో 24న ఉదయం 11 గంటల ప్రాంతంలో బయలుదేరారని, విజయవాడ చేరుకున్న తర్వాత సుమారు 4 గంటలు ఎక్కడ ఉన్నారనే అంశంపై లోతుగా విచారణ చేస్తున్నామని ఐజీ వివరించారు. హైదరాబాద్, విజయవాడల్లో ప్రైవేటు సీసీ కెమెరాల ఫుటేజీని కూడా పరిశీలిస్తున్నామని తెలిపారు. కొంతమూరు టోల్‌గేటు వద్దకు రాత్రి 11.30 గంటలకు ప్రవీణ్ చేరుకున్నారని, 11.42 గంటలకు నయారా పెట్రోలు బంకు సమీపంలో ప్రమాదం జరిగిందని చెప్పారు. శవపరీక్ష నివేదిక ప్రకారం చేతులు, కాళ్లపై రాపుడు, గాయాలు, ముఖంపై గాయాలు ఉన్నాయని, కాలుపై కాలిన గాయాలు ఉండటంతో పాథాలజీ విభాగానికి నమూనాలను పంపించామని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నుంచి రిపోర్టులు రావాల్సి ఉందని, అన్నీ నివేదికలు వచ్చిన తర్వాతే ప్రవీణ్ మృతిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఐజీ తెలిపారు. ప్రజల వద్ద ఈ ఘటనకు సంబంధించి బెదిరించిన సాక్ష్యాలు, వీడియోలు, ఇతర సమాచారం ఉంటే తమకు అందజేయాలని కోరారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ఇన్‌చార్జి, డీఎస్పీ దేవకుమార్ నం.94407 96620లో కూడా సంప్రదించవచ్చని సూచించారు. సున్నితమైన కేసు కాబట్టి విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియా తదితర మాధ్యమాల ద్వారా వదంతులను వ్యాప్తి చేస్తే చర్యలు తప్పవని ఐజీ హెచ్చరించారు. ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ.. ప్రవీణ్ బయలుదేరిన దగ్గర నుంచీ ప్రమాదం జరిగిన ప్రాంతం వరకూ ప్రతీ టోల్‌గేటు వద్ద సీసీ ఫుటేజీని సేకరించామని చెప్పారు. దాదాపు గొట్టిపాడు నుంచి బుల్లెట్‌కి హెడ్‌లైట్ లేకుండానే ఆయన ప్రయాణించారని తెలిపారు. ప్రమాదానికి ముందు నాలుగు కార్లు ఆయన వాహనంతో పాటు ప్రయాణించాయని, వాటిలో ప్రయాణిస్తున్న వారిని కూడా విచారించామని, ఆ కార్లను రవాణా అధికారులతో పరిశీలన చేయించామని సీసీ ఫుటేజీ వీడియోలు చూపిస్తూ ఎస్పీ వివరించారు. మృతిపై ప్రవీణ్ కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడం లేదన్నారు. రాజమహేంద్రవరం సమీపంలోని నామవరంలో గతంలో కుమార్తె పేరున ప్రవీణ్ ఒక స్థలం కొన్నారని, ఫిబ్రవరి 12న రిజిస్ట్రేషన్ జరిగిందని, బైబిల్ మిషన్ తరఫున అక్కడ ఒక చర్చి నిర్మించాలని అనుకున్నారని వివరించారు. ఆకాశ్, జాన్ అనే ఇద్దరి ద్వారా పనులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. దీనికోసం హౌసింగ్ బోర్డులో ఒక ఇల్లు కూడా అద్దెకు తీసుకున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ఆయన ఇక్కడికి వస్తున్నట్టు భార్యతో పాటు ఆకాశ్, జాన్‌కి మాత్రమే సమాచారం ఉందన్నారు. అన్ని అంశాలను పూర్తిగా పరిశీలించిన తర్వాత మృతికి కారణాలను వివరిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.



మమతల పండుగ

ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ పండగలను హిందు, ముస్లింలు ఘనంగా జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా శనివారం నెల్లూరులో జరిగిన ఓ కార్యక్రమంలో మిఠాయి, ఖర్జూరం తినిపించుకుంటున్న హిందూ ముస్లిం యువతులు

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఎండ ప్రచండం!

- అట్లూరు, రుద్రవరం, పెద్దారవీడులో 43 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదు

అమరావతి, విశాఖపట్నం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వడగాడ్పులతో ఉత్తరకోస్తా ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. శనివారం కోస్తాలో మిగిలిన ప్రాంతాలు, రాయలసీమలో కూడా అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగింది. కోస్తా, రాయలసీమల్లో ఎక్కువచోట్ల 40 డిగ్రీలు దాటి పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 27 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీయగా, 103 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. 22 జిల్లాల్లోని 232 ప్రాంతాల్లో 40డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదవగా, 96 ప్రాంతాల్లో 41 డిగ్రీల పైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గరిష్ఠంగా కడప జిల్లా అట్లూరులో 43.7, నంద్యాల జిల్లా రుద్రవరం, ప్రకాశం జిల్లా పెద్దారవీడులో 43.5, అన్నమయ్య జిల్లా వతలూరులో 42.7, కర్నూలు జిల్లా ఉలిందకొండలో 42.4, అనకాపల్లి జిల్లా రావికమతంలో 42.2, విజయనగరం జిల్లా గుర్లలో 42.1, తిరుపతి జిల్లా గూడూరులో 41.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం అల్లూరు జిల్లా చింతూరు మండలంలో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని, శ్రీకాకుళం నుంచి పల్నాడు జిల్లా వరకు 126 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని అమరావతిలోని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కాగా, శనివారం మధ్యాహ్నం నుంచి ఉత్తరాంధ్రలో కొన్నిచోట్ల మేఘాలు ఆవరించాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒకటి, రెండుచోట్ల వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో ఎండ తీవ్రత పెరుగుతుందని, అక్కడక్కడా వాతావరణ అనిశ్చితి కారణంగా వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ శాఖ తెలిపింది.

తిరుమలలోనూ భానుడి భగభగలు

తిరుమల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పచ్చని తిరుమల గిరులపైనా ఎండలు మండిపోతున్నాయి. శ్రీవారి ఆలయ ప్రాంతం, మాడవీధుల్లో పాదరక్షలతో తిరగడం నిషేధం. ఈ క్రమంలో పాదరక్షలు లేని భక్తులు ఆలయం వద్ద సిమెంటు గచ్చులపై నడవలేక అగచాట్లు పడుతున్నారు. కొన్నిచోట్ల కూల్‌పెయింట్ ఉన్నప్పటికీ చాలా ప్రదేశాల్లో ఎలాంటి ఏర్పాట్లూ లేవు. దీంతో కాలుతున్న నేలపైనే భక్తులు పరుగులు తీస్తూ కనిపిస్తున్నారు. మాడవీధుల్లో నీటితో నేలను చల్లబరుస్తున్నారు. అయితే ఆలయం ముందున్న ప్రాంతంలో నీటితో చల్లబరిచే పరిస్థితి లేకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు.



కంకిపాడు పోలీస్ స్టేషన్ వద్ద వంశీమోహన్

తెలియదు... సంబంధం లేదు

- విచారణకు సహకరించని వంశీ
- భూ వివాదం కేసులో కంకిపాడు స్టేషన్‌లో విచారణ
- లాయర్ సమక్షంలో ప్రశ్నలు

కంకిపాడు/గన్నవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): భూ వివాదం కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని శనివారం కంకిపాడు పోలీస్ స్టేషన్‌లో పోలీసులు విచారించారు. పోలీసుల విచారణకు వంశీ ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. పోలీసుల ప్రశ్నలకు 'తెలియదు.. సంబంధం లేదు' అంటూ దాటవేత సమాధానాలు చెప్పినట్లు సమాచారం. వంశీపై తేలప్రోలుకు చెందిన కాంట్రాక్టర్ శనగల శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గతనెల 24న ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న వంశీని ఈ కేసులో పీటీ వారెంట్‌పై ఇటీవల గన్నవరం కోర్టులో హాజరుపరచగా, ఏప్రిల్ 1 వరకు రిమాండ్ విధించారు. భూ వివాదంపై వంశీని విచారించడానికి ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరగా, శనివారం ఒకరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు విచారించేందుకు కోర్టు అనుమతించింది. ఈ నేపథ్యంలో శనివారం వంశీ అడ్వొకేట్ సత్యశ్రీ సమక్షంలో పోలీసులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భూ వివాదంపై ప్రశ్నించారు. అక్కడ నుంచి తీసుకువచ్చి గన్నవరం కోర్టులో న్యాయాధికారి ముందు హాజరు పరిచారు. కస్టడీలో పోలీసులు ఏమైనా ఇబ్బంది పెట్టారా అని వంశీని న్యాయాధికారి ప్రశ్నించగా ఏమీ లేదని బదులిచ్చారు. అడ్వొకేట్ సత్యశ్రీ, తన భార్య పంకజశ్రీతో 5 నిమిషాలు మాట్లాడేందుకు వంశీకి న్యాయాధికారి అనుమతి ఇచ్చారు. అనంతరం వంశీని విజయవాడ జైలుకు తరలించారు.

పీఎస్ వద్ద వైసీపీ శ్రేణుల హంగామా

వంశీని కంకిపాడుకు తరలించారన్న సమాచారంతో వైసీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని హంగామా చేశారు. కంకిపాడు జెడ్పీటీసీ బాకి బాబు తదితరులు వంశీని కలిసేందుకు ప్రయత్నించారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో వెనుతిరిగారు. ముందస్తు చర్యల్లో భాగంగా స్టేషన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైసీపీ నుంచి ప్రాణహాని

- హత్య సినిమా ఎవరు తీశారో.. తీయించారో త్వరలో పోలీసుల విచారణలో వెలుగులోకి
- నలుగురి పేర్లే ఈ సినిమాలో పేర్కొన్నారు
- అవినాశ్, భాస్కర్‌రెడ్డి, ఉదయకుమార్, శంకర్‌రెడ్డి లేరా?
- రాచమల్లు కేసుల కోసం ఓ నేత కాళ్లు పట్టుకున్నాడు
- వివేకా కేసులో ఏ-2 సునీల్ యాదవ్ వ్యాఖ్యలు




సునీల్‌యాదవ్

పులివెందుల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల నుంచి తన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని, తనపై తీవ్రస్థాయిలో దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-2గా ఉన్న సునీల్ యాదవ్ అన్నారు. శనివారం పులివెందులలో ఆయన మీడియాతో మాట్లాడారు. "హత్య సినిమా ద్వారా నన్ను, నా తల్లిని ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. వివేకా హత్యకేసులో 8 మందిపై చార్జిషీట్ ఉంటే ఈ సినిమాలో నలుగురి పేర్లే చూపించారు. మిగిలిన నలుగురి పేర్లు ఎందుకు బయట పెట్టలేదు. 'హత్య' సినిమా ఎవరు తీశారో, తీయించారో త్వరలో వెలుగులోకి వస్తుంది" అని వ్యాఖ్యానించారు. హత్య సినిమా తీసింది 'చార్జిషీట్' ప్రకారమేనని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. "హత్య సినిమాలో నన్ను, నా తల్లిని ఇబ్బంది పెట్టేలా చిత్రీకరించారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేయడమే నేను చేసిన తప్పా? సినిమాలో కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయకుమార్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి పేర్లు ఎందుకు చూపించలేదో అందరికీ త్వరలోనే అర్థమవుతుంది. నా దగ్గర రూ.కోట్లకు కోట్లు ఉన్నాయని మాట్లాడుతున్నారు. ఆ కోట్లకు కోట్లు మీరే తీసుకుని నాకో ఇల్లు, అవసరాలకు కొంత డబ్బు ఇస్తే చాలు" అని వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి హైదరాబాదులో ఓ బీసీ నాయకుడి కాళ్లు పట్టుకుని తనపై ఉన్న కేసులు, దందాలు బయటికి రాకుండా చూడాలని బతిమలాడింది అందరికీ తెలుసునన్నారు. "వైసీపీకి వివేకానందరెడ్డి వీర విధేయుడుగా ఉన్నారని మొదటి నుంచి చెప్పుకుంటూ వచ్చారు. కానీ, హత్య జరిగినప్పటి నుంచి లేనిపోని అభాండాలు వేసి ఆయన ఇమేజ్‌ను దిగజారుస్తూ వచ్చారు. రాచమల్లు రెండుసార్లు ప్రెస్‌మీట్ పెట్టి.. సునీల్ యాదవ్ ఫిర్యాదు ఇచ్చీ ఇవ్వగానే ఆగమేఘాల మీద కేసు నమోదు చేయాల్సిన అవసరం ఏముందని పులివెందుల లాయరు ఓబుల్‌రెడ్డి అన్నారని చెప్పారు. కానీ, నా నుంచి 161 స్టేట్‌మెంటు రికార్డు చేసినప్పుడు మీరు దాన్ని ఎందుకు తప్పుబట్టలేదో చెప్పాలి" అని ప్రశ్నించారు.

జగన్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి తోడు దొంగలు

- వైఎస్ వివేకాను హత్యచేసి మాపై నిందలు
- త్వరలో వేగవంతం కానున్న కేసు విచారణ
- దోషులంతా కటకటాలు లెక్కించక తప్పదు: ఆదినారాయణరెడ్డి



కడప, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సర్వనాశనం చేసిన తోడు దొంగలు మాజీ సీఎం జగన్‌రెడ్డి, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డిలే అని జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి అన్నారు. శనివారం కడప ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ప్రజలకు మంచి చేయాలనే తలంపుతో నాయకులు రాజకీయం చేస్తుంటారు. ఇందుకు పూర్తి విరుద్ధంగా జగన్‌రెడ్డి... ఎవరైనా ఎక్కడైనా చనిపోకపోతారా, పరామర్శ పేరుతో బయటకు రావచ్చు... అని అనుకోవడం తప్ప ప్రజల బాధలు గురించి ఏ మాత్రం ఆలోచనే లేదు. గతంలో వైఎస్ వివేకానందరెడ్డి చనిపోయిన రోజున తొలుత గుండెపోటుతో చనిపోయారని చెప్పారు. గంట వ్యవధిలోనే హత్యకు గురయ్యారని, ఆ హత్య మేం చేశామని నిందలు మోపారు. ఆ విషయాలు ప్రజలందరికీ తెలుసు. అబద్ధాలను ప్రచారం చేయడం వారికి మొదటి నుంచి అలవాటుగా మారింది. వివేకా హత్య విషయంలో వాళ్ల వాళ్ల కొట్లాడుకుని మాపై ఆరోపణలు చేయడం దారుణం. స్వంత నియోజకవర్గానికి నీరు తెచ్చుకోలేని దౌర్భాగ్య స్థితికి చేరారు. పులివెందుల, కడప నుండి జగన్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డిని ఓడించి తీరుతాం. వివేకా హత్య కేసు వేగవంతం కానుంది. త్వరలో దోషులంతా కటకటాలను లెక్కించక తప్పదు' అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.